నవశక్తి

Vol. 2, no. 28

(Jun. 28, 1939)

బెజవాడ, 1939

Navaśakti

Vol. 2, no. 28

(Jun. 28, 1939)

Bejavāḍa, 1939

Regd. No. M. 3824

నవశక్తి


ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారపత్రిక

సంపుటం 2 } బుధవారం 28-6-39 బెజవాడ { సంచిక 28

మునగాల రైతుల తాత్కాలిక విజయం


కామ్రేడ్ చలసాని వాసుదేవరావు

18-6-39 వ ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ కార్య వర్గ సమావేశం బెజవాడలో జరుపబడి, మునగాల రైతుల సత్యాగ్రహము 15 రోజుల వరకూ నిలుపుదల చేయవలసినదిగా రైతులను కోరుచూ, యీ వ్యవధి కాలంలో మద్రాసు ప్రభుత్వం రైతులకు జమీందారుకు జర్గిన యొడంబడికను అమలు జరిపే తగిన యేర్పాట్లు గావించవలయునని ప్రభుత్వమును గోరుచూ, యొక తీర్మానమును గావింపబడెను. ఆదే తీర్మానము ద్వారా మునగాల రైతుల సత్యాగ్రహమును గూర్చియు, రైతుల కోర్కెల గూర్చియు ప్రభుత్వమునను తెలియపర్చుటకుగాను యొక రాయబార వర్గముగూడ నియమింపబడెను. ఆ రాయబారవర్గములో నొకడైన నేను 19-6-39 తేదీన నన్నూ, 20-6-39 వ తేదీన సున్నూ రెవెన్యూ మంత్రిగారైన శ్రీయుత ప్రకాశం పంతులుగార్ని కలుసుకొని మునగాల సత్యాగ్రహమును గూర్చి, రైతులకు జమీందారుకు యిదివరలో జర్గిన వొడంబడికనుగూర్చి తెలియపర్చితిని. మామధ్యను, రెవిన్యూ మంత్రివర్గము మధ్యను, జర్గిన సంభాషణ ఫలితంగా మేమొక యొడంబడికకు రాగల్గితిమి. ఆ వొడంబడిక ప్రకారం, మునగాల రైతులు సత్యాగ్రహమును, విరమించుటయు, యివ్వగల రైతులచేత మునగాల రైతు సంఘం జమీందారు గార్కి శిస్తులు యిప్పించుటయు, రైతులకు జమీందారుకు లోగడ జర్గిన యొడంబడిక తదుపరి ఆ వొడంబడికకు సంబంధించినంతవరకు బ్రహ్మయ్య గారింతవరకూ యిచ్చిన నిర్ణయములను సాధ్యమైనంత త్వరగా వుభయులు అమలులో పెట్టుటకుగాను శ్రీ యెర్నేని సుబ్రహ్మణ్యంగారిని నియమించుట, సత్యాగ్రహ సమయమున జరుపబడిన జప్తు ఆస్థులను రైతులకు తిర్గి యిప్పించివేయుట, ఖైదీలను విడుదల చేయుట మొదలగు విషయములు ముఖ్యములైనవి. ఈ విధమైన తాత్కాలిక రైతుల జయమునకు నేను సంతసించుచున్నాను. ఈ పరిష్కారమునకు చాల శ్రద్ధతో కృషిచేసిన గౌరవనీయులైన రెవెన్యూ మంత్రిగారిని అభినందించుచున్నాను. ఈ యొడంబడిక ప్రకారం త్వరగా పనులు జరుగగలవని నేను గట్టిగా విశ్వసిస్తున్నాను.



మునగాల రైతుల "ఊరేగింపు"

మునగాల రైతులు



ఈ సంచికలో

తెనాలి తాలూకాలో జాతీయ వాంఛా ప్రచారం

(మా విలేఖరి)

అమృతలూరు ఫిర్కా సభ.

గుంటూరు జిల్లాలో జాతీయ వాంఛా, ఫెడరేషన్ నిరోధక యుద్ధ ప్రతికూల ప్రచారం చేయుటకు జిల్లా కాంగ్రెసు సంఘంవారు, జిల్లా కాంగ్రెసు సోషలిస్టు పార్టీవారు నిశ్చయించారు. మొదట తెనాలి తాలూకా కాంగ్రెసు సంఘ యాజమాన్యమున ప్రచార దళంగా శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య (ఆనరరీ ఆర్గనైజరు, గుంటూరు జిల్లా కాంగ్రెసు సంఘము) కామ్రేడ్ పి. వి. శివయ్య (ప్రధాన కార్యదర్శి, గుంటూరు జిల్లా కాంగ్రెసు సోషలిస్టుపార్టీ) చింతల సూర్యనారాయణ (అధ్యక్షుడు, తెనాలి తాలూకా కాంగ్రెసు సంఘము) కామ్రేడ్ ముక్తేవి మాధవాచార్య (గుంటూరుజిల్లా రైతు సంఘ కార్యవర్గ సభ్యుడు) ఈ నెల 20 వ తేదీ తెనాలినుండి అమృతలూరు బయలుదేరిరి. అచట సాయంత్రము జాతీయ గీతాలతోడను, విప్లవ గీతాల తోడను గ్రామ కీర్తనము గావించిరి. శ్రీ భాషా సంజీవని సంఘము ముందు అమృతలూరు ఫిర్కా సభ జరిపిరి. సభా ప్రారంభమునకు ముందు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు జాతీయ పతాకోత్సవము జరిపిరి. తదుపరి శ్రీ గాదెపల్లి శివరామకృష్ణయ్యగారు సభకు అధ్యక్షత వహించిరి. యీ యాత్రికులను పరిచయ మొనర్చిరి. శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు ప్రపంచంలోని సామ్రాజ్య యుద్ధాలను గురించియూ, బానిస రాజ్యాంగ శాసనమగు ఫెడరేషను గురించియు, కామ్రేడ్ పి. వి. శివయ్య జాతీయవాంఛను గురించియు, రానున్న జాతీయ పోరాటాన్ని గురించియు వివరంగా ప్రబోధకరంగా ఉపన్యసించిరి.

అటుతర్వాత "త్రిపురి కాంగ్రెస్‌లో చేసిన జాతీయవాంఛను బలపరుచు చున్నారనియు ఫెడరేషను ఎదిరించు చున్నారనియు ఈసభవారు తీర్మానించు చున్నారు. (2) సామ్రాజ్య యుద్ధాలలో భారతీయు లెవరును ఏవిధంగానూ పాల్గొనగూడదని ప్రజలకున్నూ, సామ్రాజ్య యుద్ధాలను పూర్తిగా బహిష్కరిస్తున్నామని బ్రిటిషు వారికిన్నీ ఈసభవారు హెచ్చరిక తెలుపుచున్నారు." అను తీర్మానములు జయ జయ ధ్వనులతో గావించిరి. అధ్యక్షులు శ్రీ శివరామకృష్ణయ్యగారి తుదిపలుకులతో జయ నినాదములతో సభ ముగిసెను. సభకు దాదాపు 800 మంది విచ్చేసిరి.

అలపాడులో సభ

యాత్రాదళంవారు మరుదినం ఉదయం 10 గంటలకు 3 మైళ్ళలోనున్న అలపాడు చేరిరి. 12 గంటలకు గ్రామ కాంగ్రెస్ సంఘాధ్యక్షులు శ్రీ నిశ్శంకరరావు సుబ్బారావుగారి అధ్యక్షతను బహిరంగ సభ జరిగెను. మధ్యాహ్నమగుట సభ 80 మందివచ్చిరి. సభ గ్రామ చావడిలో జరిగెను. శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు ఫెడరేషనును నిరోధించవలసిన కారణాలను గురించి, చింతల సూర్యనారాయణగారు, కాంగ్రెస్‌లో సభ్యులుగా చేరవలెనని, ముక్తేవి మాధవాచార్య యుద్ధాలలో పాల్గొనవలదని ఉపన్యసించిరి. జాతీయవాంఛను బలపరచిరి. ఫెడరేషన్ను నిరోధిస్తు యుద్ధాలను బహిష్కరిస్తు తీర్మానము గావింపబడెను జయనినాదాలతో సభ ముగింపబడెను.

చేబ్రోలు ఫిర్కా సభ.

అలపాడునుండి 11 మైళ్ళ దూరమున్న చేబ్రోలు చేరిరి. 6 గంటలకు వర్షమువచ్చెను. వర్షము తెరిపిచ్చిన తర్వాత శ్రీ రామమందిరం వద్ద చేబ్రోలు ఫిర్కా సభ జరిగెను. శ్రీ వాసిరెడ్డి చంద్రశేఖరం గారధ్యక్షత వహించిరి. వర్షమైనందున వందమందికి లోపుగా సభకు వచ్చిరి. పోలీసులు వచ్చిరి. కామ్రేడ్ ముక్తేవి మాధవాచార్యగారు సామ్రాజ్య యుద్ధాలలో నెవరును పాల్గొనవలదనియు, వావిలాల గోపాలకృష్ణయ్యగారు ఫెడరేషనులోని అన్నిలోపాలనున్నూ, పి. వి. శివయ్యగారు జాతీయ వాంఛను గురించియు విపులంగా ఉపన్యసించిరి. అటుపై జాతీయవాంఛను బలపరుస్తు, ఫెడరేషనును నిరోధిస్తు సామ్రాజ్య యుద్ధాలలో పాల్గొనవలదని తీర్మానాలు గావింపబడెను. అధ్యక్షులు శ్రీ చంద్రశేఖరంగారు కాంగ్రెస్‌ను గురించి మాట్లాడిరి. జయధ్వనులతో సభ ముగిసెను.

తెనాలి ఫిర్కా సభ

ఆరాత్రి అచటనేయుండి మరుదినం సాయంత్రము (22 వ తేదీ) యాత్రాదళంవారు 12 మైళ్ళ దూరానవున్న నందివెలుగు చేరిరి. దారి పొడుగున వర్షమే వర్షమైనను చుట్టుపక్కల గ్రామాలవారు నందివెలుగు విచ్చేసిరి. సాయంత్రం 6½ గంటలకు కన్నెగంటి వారి యింటి ముందు వరండాలో తెనాలి ఫిర్కా సభజరిగెను. సభకు 300 మందిపైగా విచ్చేసిరి.

జిల్లాబోర్డు సభ్యుడు శ్రీ కన్నెగంటి సూర్యనారాయణమూర్తిగారు సభాధ్యక్షత వహించిరి. యాత్రికులను సభ్యులకు పరిచయపరచిరి. ముక్తేవి మాధవాచార్య కీర్తనలతో సభ ప్రారంభింపబడెను. శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు ఫెడరేషనును ఎందుకు పాతిపెయ్యవలెనో యుద్ధాలలో ఎందుకు పాల్గొనకూడదో వివరించిరి. కామ్రేడ్ పి. వి. శివయ్య హరిపుర కాంగ్రెస్ తీర్మానం, త్రిపురీ కాంగ్రెస్ తీర్మానం వివరించి జాతీయ వాంఛను వివరించిరి. అధ్యక్షుడు శ్రీ కన్నెగంటి సూర్యనారాయణమూర్తిగారు రానున్న పోరాటానికి సిద్ధంగా వుండాలెనని హెచ్చరించిరి. జాతీయ వాంఛను బలపరచుచు, ఫెడరేషనును నిరోధించుచు, యుద్ధాలను బహిష్కరించుచు తీర్మానములు గావింపబడెను. జయనాదాలతో సభ ముగిసెను.

ఈమనిలో సభ

ఆరాత్రి అచటనేయుండి మరుదినం 23 వ తేదీ ఉదయం 8 గంటలకు నాలుగు మైళ్ళ దూరంలోవున్న ఈమని చేరిరి. గ్రామసంకీర్తనము గావించిన అనంతరము రావిచెట్టువద్ద శ్రీ ముడిగొండ విశ్వనాధంగారి అధ్యక్షతను బహిరంగసభ జరిగెను. సభకు 150 పైగా విచ్చేసిరి. శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారిచే జాతీయపతాకోత్సవం నిర్వహింపబడెను. కామ్రేడ్ పి. వి. శివయ్య ఫెడరేషను ఎందుకు నిరోధించవలెనో, వివరించిరి. శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు జాతీయవాంఛను గురించి సామ్రాజ్యయుద్ధాల బహిష్కరణను గురించి. శ్రీ చింతల సూర్యనారాయణగారు కాంగ్రెస్ సభ్యులుగా చేరవలెనని హెచ్చరించిరి. అధ్యక్షులు శ్రీ విశ్వనాధంగారు బ్రిటిషు రాజరికంలో మనకు దాస్యంకన్న గత్యంతరము లేకుండా వున్నదనిరి. జాతీయ వాంఛను బలపరుస్తు ఫెడరేషనును నిరోధిస్తు, యుద్ధాలను ప్రతిఘటిస్తు తీర్మానాలు చేయబడెను. జయనినాదాలతో సభ ముగిసెను.

దుగ్గిరాల ఫిర్కా సభ.

యాత్రాదళం అచ్చటినుండి 12 గంటలకు బయలు దేరి 7 మైళ్ల దూరానవున్న చిలువూరు 2 గంటలకు చేరిరి. రాత్రి 8 గంటలకు గ్రామ సంకీర్తనం చేసిన తర్వాత చిలువూరు, తుమ్మపూడి మధ్య నున్న రైలువే గేటువద్ద - సత్రం ముందు దుగ్గిరాలఫిర్కాసభ జరిపిరి. శ్రీ మునునూరి భార్గవరావుగారు అధ్యక్షత వహించిరి. సభకు దాదాపు వెయ్యిమంది ప్రజలు విచ్చేసిరి. శ్రీ చింతల సూర్యనారాయణగారు ఉపన్యాసకుల నెరుకపరచిరి. శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు కాంగ్రెసు చరిత్ర, బ్రిటిషు సామ్రాజ్యం ఏ విధంగా దేశాన్ని దోస్తున్నదో యుద్ధాలలో మనం పాల్గొన్నందువలన పొందిన ప్రతిఫలం రౌలట్ ఆక్టని, మళ్లీ పొందబోయేదీ ఇంకొక పంజాబు హత్యయని కావున ఎవరూ పాల్గొనవలదని అదను కనిపెట్టి ఫెడరేషనును నిరోధించాలెనని-ఆ ఫెడరేషనులో గల అనర్థకాలు వివరించి చెప్పిరి. కామ్రేడ్ పి. వి. శివయ్య "జాతీయవాంఛ"ను వివరించి, దేశంలో స్వాతంత్ర్యశక్తులు నిర్మాణ యుక్తంగా పోరాటానికి సంసిద్ధంగా వున్నవనియు, బ్రిటిషు గవర్నమెంటుతో అదను కనిపెట్టి స్వాతంత్ర్య సంగ్రామం సాగించవలసియున్నదనియు కూలీలకు, రైతులకు ప్రబోధించిరి. కామ్రేడ్ ముక్తేవి మాధవాచార్య యుద్ధాలను-అందువలన కలుగుచున్న అనర్థకాలను వివరించి ఎవరును రానున్న ప్రపంచ యుద్ధములో పాల్గొనవలదనియు, సిపాయిలుగ చేరవద్దనియు హెచ్చరించిరి.

జాతీయవాంఛను బలపరుస్తు, ఫెడరేషనును నిరోధిస్తు, యుద్ధాలను బహిష్కరిస్తు తీర్మానం గావింపబడెను.

నజరానాలనుగురించి కాంగ్రెస్ మంత్రులేమి చేసిరని సభ్యులలో ప్రశ్నించిరి. ఈ నడుమ గౌ॥ ప్రకాశంగారు కొల్లూరు వచ్చినపుడు ఈ విషయం అడిగితిమనియు, అది వసూలు ప్రస్తుత మాపుదలచేయుచూ క్రింది అధికారులకు తాఖీదులు పంపుదుమనిరనియు ఆ విధంగా పంపిరనియు, చింతల సూర్యనారాయణగారు చెప్పిరి. మరల వసూలు చేయబడుననీ-చెల్లించవలెనని గ్రామాధికారులు టమటమ వేయించిరనిరి. అందుపై తీవ్రమగు ఆందోళన సాగించుట మన విధి యనియు ఆ విషయమై కాంగ్రెస్ కమిటీ శ్రద్ధ వహించుననియు సూర్యనారాయణగారు తెలిపిరి. అధ్యక్షుని తుది పలుకులతో జయజయ నినాదాలతో సభ రాత్రి 11 గంటలకు ముగిసెను.

ఈ యాత్రాదళంవారు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘంవారు ప్రకటించిన ఫెడరేషన్ నిజస్వరూపం, ప్రకాశం కమిటీ రిపోర్టు పుస్తకాలు విరివిగా అమ్ముచున్నారు. ఎంత వర్షాకాలమైనను అనుకున్న కార్యక్రమం ప్రకారం వానకు తడిసిఅయినా సరే జరుపుతున్నారు. ఈ నడుమ ప్రచారమే అనుమాట లేనందువల్ల ప్రజలలో చాలా ఉత్తేజం కలిగిస్తున్నది.

అమరావతి వేసంగి పాఠశాల జమా—ఖర్చులు.

గుంటూరుజిల్లా కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ యాజమాన్యాన, గుంటూరు సత్తెనపల్లి రివిన్యూ డివిజనలు వేసంగి రాజకీయ పాఠశాల మే నెల 18 వ తారీకు నుంచి జూను 2 వ తారీకు వరకు జరిగింది. దానికై జమా-ఖర్చు లీ క్రింద వుదహరించబడినవి.

ఆదాయం:—

గుంటూరు	53	8	0
అమరావతి	42	0	0
ఇతరచోట్ల	16	0	0
విద్యార్థి రుసుము	30	0	0
మొత్తం	141	8	0

ఖర్చు :—

భోజనాలు	122	5	10
ప్రయాణాలు	16	0	0
జండాలు వగైరా	9	8	0
తపాల ఖర్చులు	1	8	0
కాగితాలు వగైరా	3	7	0
కరపత్రాలు	10	4	9
పనివాళ్ల	4	8	0
మొత్తం ఖర్చు	167	9	7
	141	8	0
మొ॥ సి॥ అప్పు	26	1	7

అప్పు :—

చిల్లర కొట్టు	23	12	0
ప్రెస్సు	2	4	9
మొత్తం రూ॥ అ॥	26	1	7

పి. వి. శివయ్య,
కార్యదర్శి,
జిల్లా కాం॥ సో॥ పార్టీ.

సంపుటం 2 **నవశక్తి** బుధవారం
సంచిక 28 28—6—39

సంపాదకవర్గం: మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు), కంభంపాటి సత్యనారాయణ, పుచ్చలపల్లి సుందరయ్య, తుమ్మల వెంకట రామయ్య.

బొంబాయి సమావేశాలు

ఈ వారం బొంబాయిలో జరిగిన అఖిలభారత కాంగ్రెసు కమిటీ సమావేశము అతి ప్రాముఖ్యమైనది. కాంగ్రెసులోని కుళ్లు తొలగించాలనే పేరుతో గాంధీయులు తమ దిగజారుడు విధానానికి వ్యతిరేకులయిన తీవ్రవాద శక్తులను కాంగ్రెసునుండి తరిమివేసి, స్వాతంత్ర్యము కోరు భారత ప్రజ లందరి సంస్థయగు కాంగ్రెసు మహాసంస్థను కేవలము గాంధీతత్వమందు విశ్వాసమున్నవారి సంస్థగా చేయుటకు పూనిన ప్రయత్నాలన్నీ యీ సమావేశములోనే పరిష్కరించబడతాయి. సోషలిస్టులు, కమ్యూనిస్టులు, తీవ్ర జాతీయవాదులు మొదటినుండి యీ ప్రయత్నాలను తీవ్రముగా ప్రతిఘటించుతున్నారు. జాతీయ పోరాటానికి కాంగ్రెసు ఐక్యతకు విరుద్ధమయిన గాంధీయుల దిగజారుడు పాలసీని జయప్రదముగా ఎదిరించాలంటే తీవ్రవాదులలో సంపూర్ణ ఐక్యత రావాలి. తీవ్రవాదుల ఐక్యత కాంగ్రెసు ఐక్యతకు, జాతీయశక్తులన్నిటి ఐక్యతకు తద్వారా సంపూర్ణ స్వాతంత్ర్యోద్యమ పురోగమనానికి దారితీస్తుంది. బొంబాయి సమావేశాలు ఈకర్తవ్యాన్ని ఎంతవరకు నెరవేర్చాయో పరిశీలించుదాము.

గాంధీయులు కాంగ్రెసును శుద్ధి చేయడానికి నిబంధనావళిలో అనేకమార్పులు సూచించుతూ వచ్చారు. వాటిని నవశక్తి ఇదివరకు చర్చించింది. బొంబాయి సమావేశములో వాటిలో రెండు ముఖ్యమయిన సూచనలను గాంధీయులు ఉపసంహరించుకొన్నారు. (1) మత సాంఘిక మరి యేయితర సంస్థలలో సభ్యులయినవారు కాంగ్రెసు కమిటీలకు ఎన్నుకోబడుటకు అనర్హులు అనే సవరణ తీవ్రవాదులగు రైతుసేవకులను, సోషలిస్టులను కాంగ్రెసునుండి తరిమివేయుటకు చేయు ప్రయత్నమని తీవ్రముగా ప్రతిఘటించాము. ఇది ప్రస్తుతము తీర్మానించకుండా గాంధీయులు బీహార్ కాంగ్రెస్ వరకు వాయిదా వేసారు. (2) అఖిలభారత కాంగ్రెసు కమిటీ ఎన్నికలు యిదివరకువలె కొన్ని స్థానాలకు మాత్రము సింగిల్ ట్రాన్స్‌ఫరబుల్ వోటింగు ప్రకారము జరపి, తక్కిన స్థానాలకు మెజారిటీ వోటింగు ప్రకారము జరపాలి, అనే సవరణ కూడ స్వల్పసంఖ్యాక పార్టీలకు, తీవ్రవాదులకు అఖిల భారత కాంగ్రెసు కమిటీలో తావు లేకుండ చేయుటకేనని తీవ్రముగా ఎదిరించాము. గాంధీయులు ఈ సవరణ కూడ ఉపసంహరించుకొన్నారు. ఇందులకు గాంధీయులకు మా హృదయపూర్వక అభివందనాలు. ఇవి జాతీయ ఐక్యతకు విరుద్ధమయినవగుటచే తాత్కాలికముగ గాక ఎన్నటికిని త్రిసికొని రావద్దని వారిని కోరుతాము.

కాంగ్రెసు కమిటీలకు ఎన్నుకోబడువారు కనీసం మూడుసంవత్సరాలు వరుసగా సభ్యులై వుండాలను సవరణ, సభ్యుడుగా జేరిన సంవత్సరం వరకు వోటింగు హక్కు వుండరాదను సవరణ అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ఆమోదించింది. ఈ సవరణలు రోజు రోజు పోరాటాలద్వారా రాజకీయ రంగంలోనికి వచ్చు నూతన శక్తులు కమిటీలలోనికి ఎన్నుకోబడుటకు అభ్యంతరాలు కల్పించుతాయి; నూతన శక్తులు పోరాటానికి జీవగర్ర; వానికి సరియైన అవకాశం యివ్వకపోవడం సబబు కాదు. కాంగ్రెసులో జేరినవారికి సంవత్సరంవరకు వోటింగు హక్కు లేదని నిర్వచించటమూ సవ్యంగా కాన్పించదు.

ఈ సమావేశం కాంగ్రెసు మంత్రులు రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలతో సంప్రదించ నవసరంలేదని కూడ తీర్మానించింది. ఇదివరకే కాంగ్రెసు మంత్రులు కొన్ని సమయాల్లో బ్రిటిషు రాజ్యాంగ యంత్రాల్లో భాగాలయిపోయి, ప్రజాభిప్రాయాన్ని గమనించుటలేదు. రాష్ట్ర కాంగ్రెస్ సంఘాలు ప్రజాభిప్రాయాన్ని కొంతవరకైనా వ్యక్త పరుస్తాయి. ఉదాహరణకు చీరాల, చిట్టివలస కాల్పుల విషయమై ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్‌కమిటీ ప్రజా హృదయాన్ని వ్యక్తపరచింది. కాని మంత్రివర్గం నిరంకుశ అధికారుల రిపోర్టులపై ఆధారపడి తన కర్తవ్యాన్ని నెరవేర్చ లేకపోయింది. ఈ తీర్మానము మంత్రులకు తమ చిత్తమువచ్చినట్లు మెలగే అవకాశమిస్తూంది. దూరంగా వున్న పార్లమెంటరీ బోర్డు సరిగా అజమాయిషీ చేయడం సాధ్యపడదు.

రాష్ట్ర కాంగ్రెసు కమిటీల అనుమతిలేకుండ సత్యాగ్రహంలో కాంగ్రెసువాదులు పాల్గొనరాదను తీర్మానముకూడ ప్యాసయింది. జాతీయ సంరంభం, స్వాతంత్ర్య పోరాటం కాంగ్రెసు నాయకత్వాన జరగాలని మేమూ అంగీకరిస్తాము. కాని కార్మిక కర్షకులు తమ కనీస హక్కులకై జరుపు దిన దిన పోరాటాలు కాంగ్రెసు అనుమతితోనే జరగాలనడము అసాధ్యమైన పని. కాంగ్రెసు వాదులలో కార్మికులు, రైతులు కూడ వున్నారు. వారు తమ వర్గ హక్కులకై జరుగు పోరాటాలలో పాల్గొనడానికి రాష్ట్ర కాంగ్రెసు అనుమతికొరకు వేచివుండాలనడం అర్థంలేనిమాట. కార్మికులు, రైతులు అయిన కాంగ్రెసు వాదులు తమ వర్గపోరాటాలలో ఎంత హెచ్చుగా పాల్గొంటారో కాంగ్రెసు మహాసభకు ఆయావర్గ ప్రజలలో అంత హెచ్చు గౌరవాన్ని తెస్తారు; ఆయావర్గాలనుండి అంతఎక్కువ మందిని కాంగ్రెసులోనికి, స్వాతంత్ర్య పోరాటములోనికి తీసికొని రాగలుగుతారు. ముఖ్యముగా బీహారు, ఆంధ్ర, సి. పి. రాష్ట్రాలలో సంఘటనల బట్టియే యీ తీర్మానము గావించ బడెనని వార్తలు తెలుపుతున్నాయి. దీనిద్వారా కార్మిక కర్షక సేవకులను కాంగ్రెసునుండి తరిమివేయడానికి కాంగ్రెసును బలహీన పరచడానికి రాష్ట్ర కాంగ్రెసు సంఘాలకు అధికారం యిచ్చినట్లే అవుతుంది. ఉదాహరణకు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ కాళీపట్టణ రైతు పోరాటంలో పాల్గొన్న కాంగ్రెసు వాదులకు నోటీసు లిచ్చుట రైతులలో కాంగ్రెసు యెడల అసహ్యభావాన్ని కలిగించి తీరుతుందిగదా!

తీవ్రవాద శక్తుల మధ్య ఐక్యత ఎంతవరకు సానుకూలపడిందో చూదాము. ఫార్వర్డు బ్లాకులో సోషలిస్టులు, కమ్యూనిస్టులు పార్టీలుగా చేరడానికి బోసు అంగీకరించలేదు. అందరూ వ్యక్తిగతముగా చేరి మెజారిటీ ననుసరించి పాలసీ నిర్ణయించడానికి సోషలిస్టులు, కమ్యూనిస్టులు అంగీకరించలేదు. వారు పార్టీలుగా చేరతామనీ, వివిధ రాష్ట్ర, జిల్లా ఐక్యతాసంఘాల్లోను, అఖిల భారత తీవ్రవాద ఐక్యసంఘటనలోనూ తమ తమ పార్టీల ప్రతినిధులుంటారనీ, అన్ని పార్టీల అంగీకారముతో (మెజారిటీ వోట్లతో కాదు) పాలసీ నిర్ణయించబడాలనీ కోరారు. చివరకు తాత్కాలిక ఒడంబడిక కుదిరింది. దీనిప్రకారము ఫార్వర్డు బ్లాకు ప్రతినిధులు, కమ్యూనిస్టు, సోషలిస్టు ప్రతినిధులు కలసిన అఖిల భారత తీవ్రవాద సంఘటన కమిటీ ఏర్పాటు చేయబడింది. ఈ కమిటీ అఖిల భారత కాంగ్రెసు కమిటీలో తీవ్రవాదులు అవలంబించాలసిన పాలసీ నిర్ణయిస్తుంది. తాత్కాలిక కమిటీలో బోసు, సహజానంద, రంగా, సోషలిస్టు, కమ్యూనిస్టు ప్రతినిధులు ఉన్నారు.

ఈ తాత్కాలిక ఐక్యతవల్లనే అఖిల భారతకాంగ్రెసు కమిటీ సమావేశములో తీవ్రవాదుల బలము వృద్ధి అయింది. 119—87 వోట్లతో వారి సవరణలు వోడిపోయాయి. కాని ముఖ్యముగా గమనించవలసిన విషయమేమంటే తీవ్రవాదులందరి ప్రతిఘటన, ఒత్తిడివల్లనే గాంధీయులు కొన్ని అయినా సంకుచితమయిన నిబంధనలు ఉపసంహరించుకొన్నారు. అందుచేతనే ప్రెసిడెంటు రాజేంద్రబాబు తన ఉపన్యాసములో అందరి సహకారము వర్కింగుకమిటీ ఆశించుతూంది అని చెప్పవలసి వచ్చింది.

ఇక తీవ్రవాదుల కర్తవ్యము స్పష్టంగా కాన్పించుతూంది; తాత్కాలికంగా వచ్చిన ఐక్యకతను స్థిరపరచాలి. సుభాసు చంద్రబోసు అన్నటుల తీవ్రవాదుల ఐక్యసంఘటన సమకూరినగాని బొంబాయి వీడమనేదీక్ష బూనాలి. తీవ్రవాదుల ఐక్యతకు పూనాది వేసికొని జాతీయ ఐక్యతకు స్వాతంత్ర్య పోరాటానికి దారి తీయాలి. అపుడే గాంధీయుల దిగజారుడు పాలసీని, కాంస్టిట్యూషనల్ తత్వంపై మోజును వోడించ గలుగుతాము; సామాన్య కాంగ్రెసు సభ్యులలో యేర్పడిన "యిపుడిక పోరాటం రాదులే!" అనే నిస్పృహను జయించ గలుగుతాము. వీని కన్నిటికీ ప్రధానమైన తీవ్రవాదులందరి ఐక్య సంఘటన స్థిరంగా యేర్పరచాలి.

నేడు మన నినాదాలు:—

తీవ్రవాదుల ఐక్యత సాధించాలి!
కాంగ్రెసు ఐక్యత కాపాడాలి!
దిగజారుడు విధానం నశించాలి!
సంయుక్త నాయకత్వం కావాలి!

మన రాజకీయాలు

యు. పి. ప్రభుత్వం లంచగొండి తనం

ప్రభుత్వ శాఖలలో లంచగొండితనాన్ని నిర్మూలించ డానికి యు. పి. కాంగ్రెసు ప్రభుత్వము కొన్ని ఉత్తరువులు పంపింది. ప్రతి డిపార్టుమెంటు ఉద్యోగి పీటిని ఆచరణలో పెట్టాలి. ఉద్యోగంలో ప్రవేశించేటప్పుడు తనకున్న స్థిరాస్థి ఎంతో, ఎంతమందిని తాను పోషించవలసి యున్నదో, తెలియజేయాలి. ఖర్చుకంటె సంపాదన విపరీతంగా పెరుగుతూన్నట్లు ప్రభుత్వానికి ఋజువైతే, అప్పుడు అతని మీద తగిన చర్య తీసుకొనబడుతుంది. క్రింది ఉద్యోగుల్ని నియమించే అధికారం డిపార్టుమెంటు అధికారిదే కాని, అతని క్రింది అధికార్లదికాదు. ప్రమోషన్ల విషయంకూడా ఇంతే. లంచాలు తీసుకొని ఉద్యోగాలిచ్చే పాడు అలవాటు యీ నిబంధనవల్ల చాలావరకు నశిస్తుంది. రికమండేషన్లమీద ఉద్యోగాలివ్వడం నిషేధిస్తూ మరొక నిబంధన "బహుమతుల"ని పిలువబడే మామూళ్లు ఎట్టి సందర్భంలోను, ఏ రూపములోను, ప్రభుత్వోద్యోగులు అంగీకరించకూడదు. ప్రతి స్థానిక ప్రభుత్వ కార్యాలయంవద్ద ఒక పెట్టెలో వేసే పిటీషన్లను జాగ్రత్తగా పరిశీలించి, అందలి అంశాలపై తగిన విచారణ జరుపుతూ ఉండాలి. వ్యక్తులు ప్రభుత్వోద్యోగుల కిచ్చే విందులలోను, టీ పార్టీలలోను పాల్గొనకూడదు. ప్రతి సరకు నగదు యిచ్చే కొనుక్కోవాలి. బస్సులలోగాని, బళ్ళలోగాని, ఉచితంగా ప్రయాణము చేయకూడదు. క్రింది ఉద్యోగులు లంచాలు పుచ్చుకొంటూన్నదీ, లేనిదీ జాగ్రత్తగా పరిశీలిస్తూ ఉండాలి. స్థానిక వకీళ్ళ సహాయము తీసుకొంటూ లంచగొండితన నిర్మూలనానికి పూనుకోవాలి.

ఈ ఉత్తరువుల్ని ప్రభుత్వోద్యోగులు ఆచరణలో పెట్టేటట్లు ఆ యా స్థానిక కాంగ్రెసు కమిటీలు తీవ్రముగా కృషి చేస్తే, లంచగొండితనము చాలావరకు నిర్మూలించబడవచ్చు. విదేశీ ప్రభుత్వము, దానితోపాటు నిరంకుశ అధికారవర్గము మనదేశములో ఉన్నంతకాలము యీసమస్య పూర్తిగా పరిష్కరించబడజాలదు. కొంతవరకైనా పరిష్కరించడానికి పూనుకొన్న యు. పి. కాంగ్రెసు మంత్రుల్ని అభినందించవలసియుంది.

సి. పి. లో మ్యునిసిపాలిటీల చట్టం

మధ్యపరగణాల కాంగ్రెసు మంత్రివర్గం మున్సిపాలిటీల చట్టము ఒకటి ప్రవేశపెట్టింది. చిత్తు చట్టములో, 18 ఏండ్లు దాటిన స్త్రీ పురుషులందరికీ జిల్లాబోర్డు, మున్సిపాలిటీ వగైరా స్థానిక సంస్థ లన్నింటి ఎన్నికలలోను వోటు హక్కు ఉండాలని ప్రభుత్వము ప్రతిపాదించింది. కాని దరిమిలాను శాసనసభచే నియమించబడ్డ సెలక్టు కమిటీ దీన్ని సవరించి, 21 ఏండ్లు దాటినవారికి మాత్రమే వోటు హక్కు యివ్వాలనీ, ఈ సూత్రం మునిసిపాలిటీలకు మాత్రమే వర్తిస్తుందనీ, సిఫార్సు చేసింది. త్వరలో బిల్లుపై చర్చ ప్రారంభమవుతుంది.

ప్రజా సామాన్యం యొక్క విచక్షణలో నమ్మకం వుంచి, అన్ని ప్రజాసంస్థలలో వారికి వోటు హక్కు యివ్వడం సాధారణ ప్రజాస్వామిక సూత్రం. యీ సూత్రాన్ని 1931 లో కరాచీ కాంగ్రెసు అంగీకరించి యుంది. స్థానిక సంస్థలకు యీసూత్రాన్ని వర్తింపజేయడానికి మధ్యపరగణాల మంత్రివర్గం ప్రయత్నించడము అభినందించదగ్గ విషయం. అయితే, మొదట స్థానిక సంస్థ లన్నింటికీ యీసిద్ధాంతం వర్తింపజేయాల్ని తలపెట్టి, తరువాత సెలక్టుకమిటీలో ఒక్క మునిసిపాలిటీలకే వర్తింపజేయాలని చూడ్డం పల్లెటూరి ప్రజలలో మంత్రులకు విశ్వాసం సన్నగిలుతూన్నట్లు సూచిస్తూంది. కాంగ్రెసు మంత్రులు అధికారములో ఉన్న 8 రాష్ట్రాలలో మధ్యపరగణాల మంత్రివర్గము మొదట సంకల్పించిన సంస్కరణను తేవడానికి పూనుకోవడం మంచిది.

మద్రాసు ప్రభుత్వం. రైతు-కూలీలు.

అయితే, రైతులయొక్క, వ్యవసాయ కూలీల యొక్క, సమస్యలపై మన మద్రాసు ప్రభుత్వము ఎంత అధ్వాన్నమైన దృక్పథము తీసుకొంటూందో 20, 21 తేదీలలో వెలువడిన రెండు వార్తలవల్ల బోధపడుతుంది. మలబార్ జిల్లాలో ఈయేడు దాళవా పంట నష్టమయిందనీ, దానిపై ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు వచ్చాయనీ, ల్యాండ్ రివెన్యూ కమీషనర్‌ని ప్రభుత్వము అక్కడికి పంపిందనీ, అతడు పరిస్థితులన్నీ స్వయంగా విచారించి ప్రభుత్వానికొక రిపోర్టు సమర్పించాడనీ. ఆ రిపోర్టు చూస్తే, మలబార్ రైతులకు ఇదివరలో ఇచ్చిన సగం రెమిషన్‌కంటె ఎక్కువ అవసరము ఉండదనీ, ప్రభుత్వ ప్రకటనలో ఉంది. రెండోవార్త. పారిశ్రామిక కార్మికుల ఋణబాధానివారణకై త్వరలో మద్రాసు ప్రభుత్వము ఒకశాసనము తేబోతున్నదట. కాని వ్యవసాయ కూలీల ఋణ నివారణ, వారు ఉన్న "ప్రత్యేక పరిస్థితులలో" సాధ్యం కాదట! వ్యవసాయదారుల ఋణ నివారణ చట్టాన్ని మొదట ప్రకటించినప్పుడు కూలీలకుకూడా అది వర్తించాలని దేశంలో ఆందోళన బయలుదేరడం, దానిపై వ్యవసాయకూలీలకు ప్రత్యేకంగా ఒక చట్టం ప్రవేశపెట్టుతాం అని ప్రభుత్వం



రాజాజీ

జవాబుచెప్పడం పాఠకులకు జ్ఞాపకం ఉండే ఉంటుంది ఇప్పుడు ఆ ప్రభుత్వమే "సాధ్యం కాద"ని మొండి చెయ్యి చూపించడం ఏమి న్యాయము?

బొంబాయిలో మద్య నిషేధం

బొంబాయి వంటి పెద్ద నగరములో మద్య నిషేధ శాసనాన్ని అమలు జరుపకూడదని బొంబాయి మంత్రివర్గాన్ని ఆక్షేపిస్తూ అక్కడి పార్సీ ధనిక వర్గాలవారు బ్రహ్మాండమైన ఆందోళన లేవదీశారు. పల్లెటూళ్ళలోనే మద్య నిషేధము పెట్టిన మద్రాసు ప్రధాని ఆదర్శ పురుషుడన్నారు. బొంబాయి మంత్రుల చర్యను ఖండిస్తూ కరపత్రాలు పంచిపెడుతున్నారు. కాని, బొంబాయి ప్రధాని, మద్రాసు ప్రధాని ఒకే నివేదికపై నిలబడి బొంబాయి నగరములో మద్యపాన నిషేధము అమలు పరచడాన్ని సమర్థిస్తూ ఉపన్యసించి నదున్ను ఎవరూ, ఎట్టి ఆక్షేపణ, చేయలేక పోయారు.

తాగుడు వ్యాపారమువల్ల లక్షాధికారులౌతూన్న మహానుభావులు కాంగ్రెసు మంత్రుల్ని విమర్శిస్తూంటే, వారి విమర్శనలకు ఎంత విలువ ఉంటుందో వేరే చెప్పక్కర్లేదు!

కాంగ్రెసు మంత్రులు—మత వైషమ్యాలు

కాంగ్రెసు మంత్రులు ప్రజానురంజకమైన శాసనాలు కొన్ని చేయుటచే, ప్రజలలో వ్యాపిస్తూన్న జాతీయాభిమానము చూచి కాంగ్రెసు వ్యతిరేకులు అనేక రాష్ట్రాలలో మత వైషమ్యాలు రెచ్చగొట్టుతున్నారు. హిందీ నిర్బంధము కాదనీ, హిందీలో ప్యాసుకాకపోతే విద్యార్థిని పై తరగతికి పంపకపోవడము ఉండదనీ, రాజాజీ స్పష్టముగా తెలియజేసినప్పటికీ, మద్రాసులో హిందీ వ్యతిరేకవాదుల విజృంభణ తగ్గడము లేదు. కాన్పూరులో హిందువులకూ—మహమ్మదీయులకూ మధ్య జరిగిన దొమ్మీలో 10 మంది మరణించారు. 45 గురు గాయపడ్డారు. లక్నోలో షియా—సున్నీ తగాదాను పరిష్కరించడానికి ఏ మహమ్మదీయ నాయకుడూ ముందుకు రావడము లేదు. అబ్దుల్‌కలాంఅజాద్ పరిష్కరించటానికి పూనుకొంటే, అనేక ఆటంకాలు, లేనిపోని అపవాదులు తెచ్చిపెడుతున్నారు. షియా మహమ్మదీయులు ప్రతిరోజు శాసనోల్లంఘనం చేసి అరెస్టు అవుతున్నారు. లక్నో జిల్లా కలెక్టరు 144 జారీచేసి, మీటింగులు—ఊరేగింపులు జరుపకూడదని నిషేధించాడు. కాని, ఉద్యమము ఆగే సూచనలు కనపడ్డం లేదు.

మతద్వేషాలను రెచ్చగొట్టే వ్యక్తులయెడల పత్రికలయెడల, ఇప్పటికంటె కఠిన విధానము చేబూనాలని బొంబాయిలో సమావేశమైన కాంగ్రెసు ప్రధానుల సభ తీర్మానించింది. అట్టి విధానాన్ని హృదయపూర్వకముగా ఆహ్వానిస్తున్నాం.

జ్యోతి—నూతన జ్యోతి అనగానే అంతా ఏదో వెలుగు నిస్తుందని ఎదురుజూస్తారు. కాని గాంధిమహాత్ముని నూతన జ్యోతి బాధ్యతాయుత ప్రభుత్వం, పౌరసత్వ హక్కులకోసం అర్రులు సాచుకొన్న సంస్థాన ప్రజలకు గాని, స్వాతంత్ర్యం, స్వరాజ్యంకోసం ఉవ్విళ్ళూరుచున్న భారత ప్రజానీకానికి గాని ఏమీ తరించే మార్గం చూపించుట లేదు: పైగా యీ జ్యోతి అంధకారాన్నే వ్యాపింపజేస్తూంది.

అందుచేతనే గాంధీజీ రాజకోట తిరువాన్కూరులపై తా నిచ్చిన స్టేటుమెంట్లు దేశంలో అంతులేని గందరగోళం కలుగజేసాయనీ, మహదేవదేశాయి, ప్యారిలాల్ భాష్యం చెప్పి అపార్థం తొలగించాలని ఎంత పురుష ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదనీ చెప్పాడు. ఈ వారపు హరిజన్‌లో తానే స్పష్టపరచ పూనుకొన్నాడు.

"మనోవాక్కాయకర్మల అహింసతో చేసిన పని ప్రత్యర్థిలో దౌర్జన్య భావం ఎక్కువ కాలం కలిగించజాలదు." "1920 నుండి జరుపబడిన ఉద్యమాలలో కత్తి కలియుటవల్లనే తగిన ఫలితము చేకూరలేదు" అంటున్నాడు.

సామ్రాజ్యవాదం భారత ప్రజలను దోచుకుంటూంది: నరేంద్రులు సంస్థానప్రజల శ్రమతో సుఖపడుతున్నారు.

భారతప్రజలు 'మనోవాక్కాయకర్మల' అహింసతోనైనా సరే సామ్రాజ్యవాదుల పెత్తనాన్ని, దోపిడిని తొలగించడానికి ప్రయత్నించితే దౌర్జన్యానికి పూనుకొంటారు: భారతీయుల స్వాతంత్ర్య ప్రయత్నాలలోని హింసా అహింసలతో సామ్రాజ్యవాదుల కెట్టి ప్రసక్తీ లేదు. వరికి కావలసింది తమ దోపిడీ విధానము కొనసాగడం: తద్వ్యతిరేకంగా జరిగే ప్రయత్నా లన్నిటిని సామ్రాజ్యవాదులు నిర్బంధవిధానంతో ఎదుర్కొని తీరుతారు. వారిలో దౌర్జన్య భావము కలిగించకుండా ఉండగలిగితేనేగాని మనం సత్యాగ్రహం సాగించడానికి వీలు లేదు. అంటే ప్రళయాంతము వరకు వేచి వుండడమే అవుతుంది. పోరాటమే సాగించకూడదనే లిబరల్సు సిద్ధాంతము అదే.

* * *

"మంత్రుల పనులకు గవర్నర్లు ఏ మాత్రం అడ్డురాలేదు. కాని కాంగ్రెసు వాదులనుండి, సంఘాల నుండి అనేకసార్లు విసుగుదల గలిగించేటంత అభ్యంతరాలు గలిగించబడ్డాయి" అంటున్నాడు గాంధీజీ. రాజకీయ ఖైదీల విడుదలకు గవర్నర్లు అడ్డుపడుటయు బీహారు, యు. పి. మంత్రులు రాజీనామా యిచ్చుట ప్రజలు మరచిపోలేదు. కాంగ్రెసు ఎన్నికల ప్రణాళికననుసరించి నిర్బంధ శాసనాలను రద్దుచేస్తూ సరిహద్దు మంత్రివర్గం ప్యాసుచేసిన బిల్లును గవర్నరు త్రోసివేయలేదా? ఒరిస్సా మంత్రివర్గంచేసిన జమీన్ రైతు శాసనానికి అనుమతి యివ్వకుండా గవర్నరు, వైస్రాయిలు త్రొక్కిపట్టి వుంచలేదా? ఎచట కాంగ్రెసు మంత్రులు కాంగ్రెసు ఎన్నికల ప్రణాళికను అమలు జరపడానికి పూనుకొంటున్నారో అచటల్లా గవర్నర్లు అడ్డుతగులుతూనే వున్నారు. లేదనుకోవడం సత్యాన్ని కన్నులుండీ చూడలేకపోవడమే.

ఇక కాంగ్రెసువాదులు, సంఘాలు అభ్యంతరాలు కల్పించడాన్ని గురించి. ఎన్నికల ప్రణాళికలోని వాగ్దానాలను అమలు జరుపమని ప్రజలతో సంబంధమున్న కాంగ్రెసు కమిటీలు, వ్యక్తులు మంత్రులను హెచ్చరిస్తున్నారు. ఈ మేల్కొల్పుటను అభ్యంతరాలు కల్పించుట అనుటకంటే అన్యాయ ముండబోదు. ప్రజలకు వాగ్దానాలు చేసాము. వానిని నెరవేర్చడానికే కాంగ్రెసు మంత్రివర్గాలుగాని ప్రభుత్వం కొనసాగించడానికి లాఅండ్ ఆర్డరు రక్షించడానికి కాదు. ఆపని చేయుడానికి జాతీయ విద్రోహు కావలసినంత మంది వున్నారు. కాంగ్రెసు వారెందుకు?

తప్పటడుగులు-వెక్కిరింతలు

* * *

"ఎంతమంది విమర్శకులు ఆక్షేపించితే మాత్రేమేమి? నూతనజ్యోతి సంస్థానాధిపతులు గాంధీజీని తమ మిత్రుడుగా పరిగణించుకొనేటట్లు చేసింది." అంటున్నాడు హిందూ, బొంబాయి విలేఖరి. 24 వ తేదీ పత్రికలో ....

ఓయి బాబూ! అందుకే నూతన జ్యోతిని అనేక మంది విమర్శించారు. సంస్థాన ప్రజల హక్కులకై జరుగుతూన్న పోరాటాలను గాంధీజీ ఆపుచేసాడు. ఏదో అడ్డుదారి చూపుతా నన్నాడు. ఇదిగో నూతన జ్యోతి అన్నాడు. కాని ఇది సంస్థానాధిపతులకే మిత్రమయినపుడు విమర్శనలు సబబని రుజువయినట్లేగా?

* * *

అఖిల భారత కాంగ్రెసు కమిటీ దక్షిణాఫ్రికా భారతీయులు అచటి ఆదిమ నివాసులు, అరబ్బులు వగైరా ఆసియా వాసులందరితో కలసి యూరోపియన్లకు వ్యతిరేకముగా పోరాడాలని తీర్మానించింది, గాంధీజీ యీ తీర్మానాన్ని వీటో చేసాడు, చెప్పిన కారణం అచటి భారతీయుల కిది నష్టమని. ఆఫ్రికాలోని భారతీయులు ఎక్కువభాగం కార్మికులు, వ్యవసాయదారులు. అచటి ప్రజలతో కలిసి దోపిడిదార్లయిన యూరోపియన్లతో పోరాటము సాగించితే వీరి కెట్టి నష్టములేదు. యూరోపియన్లతో దోపిడి చేయడంలో భాగస్వాములు కాదలచుకొన్న భారతీయ వర్తకులు పెట్టుబడిదార్లకుమాత్రం నష్టము. గాంధీజీ భారతీయులను ఆఫ్రికానుండి తరిమివేయ బూనుకొన్న యూరోపియన్లతో రాజీ ఆపేక్షించుతూ ఆఫ్రికాదేశీయులతో ఇక్యత కూడదంటున్నాడు.

"గొర్రె కటికివాణ్ణి నమ్ముతుంది గాని గొల్లవానిని నమ్మదు"అనే సామెతకు అర్థ మిదే కాబోలు. ఏమైతేనేం ఎ. ఐ. సి. సి బుద్ధిగల బడిపిల్లవానివలే ప్యాసైన తీర్మానాన్ని మరునాడే గాంధీజీ యిష్టప్రకారము దిద్దుకొంది.

* * *

మద్రాసులో కాంగ్రెస్ మంత్రివర్గం హైదరాబాదు సత్యాగ్రహానికి సానుభూతిచూపు సభలు జరగరాదని 144 శెక్షను జారీచేసింది. రాజాజీగారి యీ ఉపక్రమణికను సర్‌సికందర్ హాయత్‌ఖాన్ అందుకొన్నాడు. స్టేట్సు ప్రొటెక్షన్ ఆక్టు (సంస్థానాల రక్షణ చట్టం) ప్రయోగించాడు. వాలంటీరు దళాలు (బాధాలు) వెళ్ళకుండా జిల్లా మేజిస్ట్రేటులు నిషేదించ వచ్చును మద్రాసులో మతకలహాలు లేవు; ఉద్రేకమూలేదు, హైదరాబాద్ ప్రజల పౌరసత్వ హక్కులకోసం జరిగే సత్యాగ్రహానికి సానుభూతి సభలు జరిపితే లాఅండ్ ఆర్డరు భగ్నమయ్యే భీకర పరిస్థితు లేవీలేవు. అట్టిచో ప్రజల విశ్వాస్వాన్ని గోల్పోయిన సర్ సికందర్ నిర్బంధ విధానాన్ని కొనసాగించడానికి మద్రాసు కాంగ్రెసు మంత్రివర్గం మార్గం చూపడం ఎంత విషాదకరం! మంచిచేసి మార్గ చూపించడం చాలాకష్టం కాని చెడు చేయడం ఎంత సులభం!

* * *

ఇదివరకు రాష్ట్రీ కాంగ్రెసు కమిటీల సలహాలను మంత్రివర్గము పొందాలనే అంతా కోరుతున్నారు, ఐనా కాంగ్రెసు మంత్రులు రాష్ట్రీసంఘాల సలహాలను గమనించుటలేదని, ఆంధ్ర, ఒరిస్సా కాంగ్రెసు కమిటీలు ఆక్షేపించాయి. వర్కింగు కమిటీ బొంబాయి సమావేశంలో మంత్రులు సంప్రదించనే అక్కరలేదని తీర్మానించింది, ఇంక రాజాజీవంటి కాంగ్రెసు మంత్రులకు పేటు కేయడానికైనా ఫ్రీ ప్యాస్. పార్లమెంటరీ కాంగ్రెసు పార్టీలు ఇదివరకే మంత్రులకు తాళం వేసేవిగా అయిపోయాయి. ఇపు డీ త్రీర్మానంతో రాష్ట్రీ కాంగ్రెసుల పెత్తనము తగ్గించితే మంత్రివర్గాల పని తమ చిత్తం వచ్చినట్లు మెలగటమే. భళీ! రాజాజీ నీ కెదురు లేకుండా చేసికొన్నావు!!

* * *

మంత్రి గోపాలరెడ్డిగారు కాల్వబుగ్గ వేసవిస్కూలు స్నాతకోపన్యాసంలో యిలా సెలవిచ్చారు."

"పోలీసువారిని నిందించి లాభము లేదు... ....

సమాజాభ్యుదయము కోసరం అవసరము గల్గిన లాఠీచార్జీ, బాయినెటుచార్జీ తుపాకి కాల్పులకు బూనవలసినదే గాని సంఘ శ్రేయమును విడనాడి మూలకూర్చొను అధికారమున నుండునంతకాలము దేశపు శాంతి భద్రతల గుత్తెరిగి పాలించినచో రాబోవు ఎన్నికలలో తిరుగా మమ్ముల ఎన్నుకొనకపోయినను ఆలోచింపవలసిన పనిలేదు."

అభీష్టానికి విరుద్ధమైనా సరే యీసారి మేము ఓడిపోయినా సరే శాంతిభద్రతల కాపాడితీరుతాము అనడం కంటే అపభ్రంశం యింకొకటి వుండబోదు. బ్రిటీషు సామ్రాజ్య రక్షణ కేర్పడిన 'శాంతి భద్రతలపై పీరికింత మోజు ఎందుకో తోచదు! సామ్రాజ్యవాదులు సైతం ప్రజల క్షేమం ఆలోచించియే తమ బాధ్యత నెరవేర్చడానికే లాఠీలు తుపాకులు వినియోగించుతున్నామనీ చెప్పేవారు. నిజంగా ప్రజల క్షేమం కోసమే పరిపాలన సాగించితే ప్రజాభీష్ట ప్రకారమే ఏలాలి: తుపాకులు కాల్చనవసరం లేదు: లాఠీలు ప్రయోగించనక్కరలేదు. రాబోవు ఎన్నికలలో 'ఓడిపోతేపోతాములే'అనే మూర్ఖపు మాటలు కాంగ్రెసు మంత్రి పలుకనక్కరలేదు. "మేమ్ తింటాం! మట్టే తింటాంటే!!" అంటే ఎవరేం చేస్తారు. ఇటువంటివారికి ఫ్రీ ప్యాసే?

కత్తిరింపులు

రైతులకో సలహా; సత్యాగ్రహము చివరి ఆయుధమని గుర్తించవలయును

చీటికిమాటికి రైతులు సత్యాగ్రహము చేయరాదు. విషమపరిస్థితులలోనే గత్యంతరము లేకపోతేనే, రైతుసంఘముల రాజీలన్నియు భగ్నమైపోతేనే, రైతుల మొరలను ప్రభుత్వము పెడచెవిని పెట్టితేనే రైతులు శాస్త్రీయంగా సత్యము అహింసా సూత్రాలపైన ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ అనుమతిలో సత్యాగ్రహముచేయుట అవసరము. తగినశక్తి ధైర్యము త్యాగము, బాధ్యతాయుతమయిన నాయకత్వము వుంటేనే సత్యాగ్రహమునకు పూనుకొనవలయును. సాధ్యమయినంతవరకు సత్యాగ్రహమును లేకుండానే రైతుల కష్టాలను నివారణచేయుట రైతుసంఘాల ధర్మము.

—ఆచార్య రంగా.

* * *

అయితే గాంధీగారు చెప్పేదానికి, దీనికీ వ్యత్యాసం యేమిటి?

ఎడిటర్, "ప్రజాబంధు"

వల్లెటూరి కవులు: భారతదేశ విప్లవం

కామ్రేడ్ అహమ్మద్ ఆలీ

[గత సంచిక తరువాయి]

రెండవ సభ ఆరుబయట జరుప వలసివచ్చింది. గాలివలన చాందినీ తీసివే యాల్సి వచ్చింది. దుమ్ముతో నిండిన ఆకాశం క్రింద కూర్చొన్నాం. వేడిగాలి మా కళ్లల్లో ఇసుకా, దుమ్మూ కొట్టింది.

సభ 'ఆలా' (పురాణపద్యం)తో ప్రారంభ మయింది. ఈ పద్యంలో కాంగ్రెసు చరిత్రను గురించీ, జాతీయ పోరాటాన్ని గురించీ వ్రాశారు. ఉత్తర హిందూస్థానంలో ప్రసిద్ధి చెందిన—నాయికా నాయకులు "ఆలా, ఊదాల్" చరిత్రను చెప్పిన పద్యం ధోరణితో రచించడం వల్ల ఈపేరు వచ్చింది ఇలాంటి పద్యాలకు.



సతోకిశర్మ

ఇది చాలా పొడుగాటి పద్యం. ప్రశ్న సమాధానాలతో ప్రారంభమవుతుంది. "తమలపాకులు ఎందుకు చేయబడ్డాయి? తినడానికి. హనుమంతు డెందుకు జన్మించాడు? లంకను నాశనం చేయడానికి. రావణుడెందుకు పుట్టాడు? పాపం వృద్ధిచేయడానికి. కృష్ణుడెందుకు జన్మించాడు? పాపసంహారానికి. గాంధి ఎందుకు జన్మించాడు? అహింసను బోధించడానికి. జవహర్‌లాల్ జన్మించిందెందుకు? స్వతంత్ర యుద్ధాన్ని నడపటానికి...."

దీనితర్వాత స్వాతంత్ర్య యుద్ధాన్నిగురించి ఉంటుంది. దర్శన ఉప్పు సత్యాగ్రహాన్ని గురించిన భాగాన్ని ఇస్తాను. కవి, గాంధి, తయ్యాబ్జీల అరెస్టు గురించివ్రాశాడు. ఈఇద్దరు 'జనరల్స్' అరెస్టయాక సరోజినీనాయుడు నాయకత్వం వహించి పోరాటాన్ని నడిపింది. ఆ పద్యభావం ఇది.

తయ్యాబ్జీ అరెస్టయాడు.
సరోజిని రణరంగానికి ఉరికింది.
భరతమాతకు జైయంటూ, కాంగ్రెసు
పతాకాన్ని ఎగురవేసింది.
త్యాగమూర్తులయిన స్త్రీపురుషులకు
జయమగు గాక!
భయంకరమైన మస్తుల ధరించి
రాక్షస సంహారానికి దుర్గ ఏతెంచినట్లు,
ఆమె కొందరు వాలంటీర్లతో
దర్శనకు విచ్చేసింది.
సరిగా శత్రువుల సరిహద్దువద్ద,
తన మనుష్యులను నిలిపి,
ఎట్టి ఆలస్యం లేకుండా
ఉప్పు జేయమని ఆజ్ఞాపించింది.
ఆమె నోటినుండి మాట వెలువడిందో
లేదో వలంటీర్లు ముందుకు పరువెత్తారు.
రెండు గంబలావిధంగా ఉప్పుచేసారు.
శత్రువు లొంగిపోవలసివచ్చింది.
కాని బ్రిటిషుప్రభుత్వానికి హృదయం లేదు.
ఆమెను అరెస్టు చేసి
యర్రవాడ జైలుకు పంపారు.
లేవండి! నిద్ర లేవండి!
ఎన్నా క్లీవికి హృదయం?
ఆడవాళ్లు జైలుకు వెళ్ళారు
కాని, సోమరిపోతులారా! మీకు సిగ్గు లేదా?

★

జ్ఞాపకం ఉంచుకోండి. మీరు వీర అర్జునుని. శ్రీ కృష్ణుని పేర్లకు అపకీర్తి తెస్తున్నారు. ఒకానొకప్పుడు ద్రౌపది వస్త్రాపహరణం జరిగితే మీరు మహాభారత యుద్ధం జరుపలేదా, ఒకానొకప్పుడు సీత నెత్తుకుపోతే మీరు లంకను నాశనం చేయలేదా?

★

ఇపుడు అనేక ద్రౌపదులు, అనేక సీతలు
బజార్లలో అవమానింపబడుతున్నారు.
అయినా మీకు సిగ్గు లేదు
నిర్లక్ష్యంగా నిద్రపోతున్నారు.
మీరు నపుంసకులు.
సీటుగా, పిచ్చివెధవల్లాగ తిరుగుతున్నారు.

★

తల్లులారా! మీరు బిడ్డల్ని కంటే
కౌసల్యవలె రాముని గనండి,
లేక కృష్ణుని, అంజనీవలె హనుమంతుని
కనండి.
లేదా మన దేశాన్ని విముక్తి నొందించే
వీర జవహర్‌లాల్‌ను కనండి.
మన దేశానికి అలాంటి పుత్రునిగన్న
మాతకు జయమగు గాక ....
నేను చెప్పాలసిన విషయం ఏమన్నా ఉంటే
వేయి విషయాలకన్నా ముఖ్యమైనది
ఒకటి ఉంది.
ఒక కవి ఈ కథను వ్రాయ మొదలిడితే
దుఃఖమే సముద్రంగా మారిపోతుంది.
నీవు ఈ రోజు కోసమే పెంచబడ్డావు.
ఆ రోజు ఇదిగో-వచ్చింది.
ఎప్పుడూ కాంగ్రెస్ పతాక స్వేచ్ఛగా
ఎగరాలి.
ఎప్పుడూ వెన్నిచ్చివెను దిరిగిపోరాదు.

★

గాంధిజీ తెరమరుగుకుపోయి జవహర్‌లాల్ ఎలా ప్రజావీరుడయాడో విచిత్రంగానే ఉంటుంది. కాని ఈ సంవత్సరంలో, కాంగ్రెస్ అధికారం స్వీకరించాక - ప్రాతనాయకులతో పాటు జవహర్‌లాల్‌లోకూడ రైతులకు విశ్వాసం పోయింది. నాటకాలలో చిత్రించడానికి తగిన నాయకులు కార్మిక-కర్షకులకు కన్పడటం లేదిప్పుడు. కాంగ్రెస్ పెత్తందారుల, గాంధి, జవహరుల రోజులు పోయాయి.

అలిఘర్ జిల్లా నివాసియయిన చిద్దాలాల- ఒక రైతు యువకుడు-దాన్ని వ్రాశాడు. మరో రైతు యువకుడు 'పతిరామ్' దీన్ని పాడాడు. ఇది పాడినంతసేపు. మంత్రముగ్ధులవలె నిశ్చింబ్దంగా కూర్చున్నారు ప్రేక్షకులు తుపాను విజృంభించింది. మా కళ్లల్లోను, పాడుతున్న పతిరామ్ నోట్లోనూదుమ్ము కొట్టింది. కాని ఎవరూ కదలలేదు. కథలు చెబుతుంటే ఊ కొట్టే చిన్న పిల్లల్లాగా ప్రేక్షకులు ఈ పద్యంలో తన్మయులయిపోయారు.



బుద్ధిబాబా

పతిరామ్ ముగించాడు చప్పట్లు జోరుగా కొట్టారు. 75 ఏండ్ల "బుద్ధిబాబా" వేదిక ఎక్కాడు. ముఖం ముడితలుపడింది. పండ్లూడి పోయాయి. జాతీయోద్యమములో 8 సార్లు జైలుకువెళ్ళాడు. అయినా అతనిది యువక హృదయమే! ఎపుడూ నిస్సహాయత అనేది భావించకుండా, నవ్వుతూ, ఆడుతూ కులాసాగా ఉంటాడు. ఏమైనా "ప్రేమకవిత్వం" వ్రాశావా అని అడిగాను. కొన్ని మత సంబంధమైనవీ, మరికొన్ని సాధారణ గీతాలూ ఇచ్చినా ప్రేమ గీతాల గురించి, చెప్పడానికి నిరాకరించాడు. మేము ఎగతాళిచేశాం. సిగ్గు పడవలసినదేమీ లేదని చెప్పాం. వినలేదు. అతని కాని యౌవ్వనం-బహుశా మంచి రొమాన్సుతో కూడికొన యౌవ్వనంలో - తొంగి చూడనివ్వలేదు మమ్మల్ని. అక్కడ ఉన్న కవులందరూ జాతీయ పోరాటానికి సంబంధించని పద్యాలనివ్వడానికి నిరాకరించారు. సిగ్గువల్ల కాదు వాళ్లివ్వకపోవడం. (రైతులకు సామాన్యంగా సిగ్గుపడరు. అందులో కొందరు, నాముందు బూతు పద్యాలను చదివి వినిపించారు.) అలాంటి పద్యాలు వల్ల ఏమీ లాభములేదని వాళ్ళఉద్దేశ్యం. కొంచెం కష్టంగానే, వాళ్ళ మత సంబంధమైన కవిత్వమూ, వివిధరకాల పద్యాలూ, వినగలిగాను. జాతీయ గీతాలు పాడమన్నపుడు వారుత్సాహంతో ముందుకువచ్చేవారు. మాకు ఆ పద్యాల వినిపించడానికి తమలో తాము పోటీపడేవారు.

బుద్ధిబాబా మాకు పెండ్లిరూపంలో, జైలును గురించి ఒక యేలపాట వినిపించాడు. పెండ్లి కొడుకు (శిక్షింపబడ్డతానే) ఎలా పెండ్లి కొడుకయినదీ, అత్తవారింటికి (జైలు) ఎలా వెళ్లినదీ, అక్కడ ఎలా మర్యాదచేసినదీ తెల్పుతాడు ఆపద్యాలను ఉదహరించడానికి స్థలంచాలదు. కాని నాకు ఆశ్చర్యం గల్గించిన విషయం ఒకటిఉంది. సాధారణంగా పల్లెటూరి కవిత్వంలో ఉండే 'సెంటిమెంటు'గాని, ఉద్రేకాన్ని ప్రదర్శించడంగాని లేదు. ప్రతిదీ వాస్తవికతమీద ఒక కన్నుంచి వ్రాయబడింది. దాన్నిండా హాస్యముంది, భావనఉంది. నీచ కవిత్వ స్థాయికి రానేరాదు. చాలా బాధాకరమైన విషయాలను గురించి—విషాదకరమైన, విషయాలను గురించి - సెంటిమెంటు లేకుండా అంతహాయిగా రైతులు వ్రాయగల్గడం ఎంతో గొప్ప విషయం. అయినా ఈ కవిత్వాన్ని చదువుచున్నపుడు నీలో ఉద్రేకాన్ని కల్గిస్తుంది. నీ హృదయాన్ని కదిలించుతుంది....

తుపాను హెచ్చింది. మా మొఖాల నిండా, జుట్టు నిండా, బట్టల నిండా, ఇసుక కొట్టింది. ఒక పంద గజాల వెనుక మా కేమీ కన్పటడం లేదు. మా ముందరి చెట్టు బాణంలా వంగిపోయింది. గాలి విపరీతమైన వేగంతో ధ్వని చేసికొంటూ వీచింది కాని ప్రేక్షకులు ఒక అంగుళంకూడా కదలలేదు. చీకటి పడుతున్నకొద్దీ రైతులు తుపానును లక్ష్యపెట్టకుండా సభకు వస్తునే ఉన్నారు

బుద్ధి బాబా తర్వాత హార్మోనియం, మద్దెల యువకలతో కవులు పాడసాగారు. వాళ్లపద్యాలన్నీ విప్లవ భావపూరిత మైనవి. అదృష్టాల మీద నమ్మకం విడిచి, పోరాటానికి రండని ప్రబోధించినాయి ఆ పద్యాలు. నావద్ద అలాంటి పద్యాలు చాలా ఉన్నాయి, కాని ఇపు డందులో ఒకటి మచ్చుకు చూపిస్తాను. అపద్యభావం ఇది,



దూలీచందు

"కాలచక్రం తిప్పుమంటూ కదలి దరిజేరు శబ్దం
ఎపుడు వినవచ్చున్, ఎల్లపుడు వినవచ్చున్"

ప్రొద్దు కూకింది, గ్యాస్ దీపాలు వెలిగించారు. చెమట పోస్తున్న మా శరీరాలపైన ఇంత యిసుక పోసింది గాలి. పల్లమధ్యన కరకరమంటూ గాలి వీచింది. గర్‌గాంవ్ జిల్లా వాసి దూలీచంద్-ఒక మంగలి-పాట నారంభించాడు. సన్నగా, పొట్టిగా, చిన్న గడ్డంతో ఉంటాడు. అతనికి త్వరగా ఊహించే శక్తి, మంచి పొయిటిక్ సెన్సు, రెడీ విట్, మంచి పద్యాలను ఆశువుగా చెప్పే శక్తి ఉన్నాయి. ముస్లిం దార్వేష్ శిష్యుడతను. జాతీయ గీతాలను వ్రాయడానికి పూర్వం తన పీర్ (గురువు) చే ప్రోత్సహింపబడి భక్తిగీతాలు వ్రాసేవాడు. కొందరు కాంగ్రెస్ వర్కర్లు ఒక సంవత్సరం క్రిందట ఆ గ్రామానికి వెళ్ళినపుడు జాతీయ గీతాలను వ్రాయమని అడిగారు. సిగ్గుపడి తానసలు వ్రాయలేనని చెప్పాడు. కాని వారిపద్యాలకు సహాయం చేస్తానని వాగ్దానం చేశాడు. వచ్చు చాలా నాసిరకం పద్యాలు తెచ్చారని నాతో చెప్పాడు. వెంటనే అప్పటి కపుడు ఒక గీతాన్ని వ్రాసి వాళ్ళకి చదివి వినిపించాడు. వాళ్ళందరూ ఆశ్చర్య పడ్డారు. అతన్ని కాంగ్రెస్ వారి వద్దకు తీసుకవెళ్ళి అతనిచేత ఆ గీతాన్ని పాడించారు, అతన్ని ఉత్సాహపరచి, అతనికి భగత్ సింగు చరిత్రగూర్చి - ఉరినిగురించీ చెప్పారు. అతను ఇంటికివెళ్ళి హృదయాలను ఉఱ్ఱూత లూగించే గీతాన్ని వ్రాశాడు. నేను ఫరీదాబాద్‌లో ఇంతచక్కని గీతాన్ని మరొకటి విన లేదు....ఆవిధంగా అతడొక జాతీయ కవి అయాడు. అతడు మహాద్భుతంగా పాడగలడు. అతని కంఠం తీయగా, హాయిగా ఉంటుంది. దోత్రా (సితారాలాగ రెండుతీగెల వాయిద్యం)తో పాడుతున్నపుడు శ్రోతలకు కన్నీళ్ళు తెప్పించగలడు.

భగత్‌సింగును గురించిన పద్యాలను ఉదహరించేముందు లండన్ స్త్రీల డైలాగ్ ఒకటి ఉదహరిస్తాను. ఈపద్యం చెప్పేముందు కవి ఇలా చెప్పాడు. "సుభాష చంద్రబోసు లండను వెళ్ళినపుడు బ్రిటిషువారితో ఇలా చెప్పాడు.



ప్రేక్షకుడు

"మీరు మీయంతట స్వరాజ్యం ఇచ్చారా సరేసరి. లేకపోతే బలవంతంగా లాక్కొంటాం."ఇదివిని లండన్‌లో స్త్రీలంతా ఏడ్వడం సాగించారు.

మెదటి స్త్రీ

లండన్‌లో స్త్రీలు ఏడ్చుతున్నారు.
మొత్తుకొంటున్నారు.
గాంధి మన చావుకు వచ్చాడు.
గాంధి గవర్నమెంటును మోసగిల్లేటట్లు
చేశాడు.
గవర్నమెంటుఆయుధాలిక నిష్ప్రయోజనాలు
వాళ్ల కందిరీగల్లాగ, తేనెటీగల్లాగ కుడతారు.
మనను రక్షించే నాథుడెవడు?
లండనంతా శోకమయం
దేవుడిక మనప్రక్కలేడు.
అహింసే ఆయుధంగా గల
ఆ దిగంబరుణ్ణి ఎలాగెలుస్తాం?

రెండవ స్త్రీ

లండన్ గాంధిఅంటే గడగడలాడుతున్నది.
అతనితో జవహర్‌లాల్ ఉన్నాడు.
చెల్లీ! మనమిన్నాళ్లు
అడ్డు, ఆపు లేకుండా దోచేశాం.
ఎప్పుడైనా ప్రభువుకు దురాశ జనిస్తే
వాడు పొందే ఫలితం ఇదే.
దురాశకుపోయిన దుష్ట రావణుని
లంకలో మృత్యువు తాండవించింది.

ఈ విధంగా అతని కవిత్వమంతా సామెతలతో హిందూ పురాణ ప్రమాణాలతో నిండి ఉంటుంది. ఎక్కడ ఏ సామెత వేయాలో అతనికి బాగా తెలుసు.

గాలి అతని ముఖాన్ని దుమ్ముతో కొట్టింది. అతని గడ్డమంతా తెల్లబడింది. భగత్‌సింగు ఉరిపైన యాలపాట ప్రారంభించాడు. 1929 లో ఢిల్లీ అస్సెంబ్లీలో బాంబువేసినందుకు (భగత్ సింగు) ఉరితీయబడ్డాడు. అయినా ఇప్పటికీ హిందూదేశ స్వాతంత్ర్యానికి బలియైన వీరులలో ప్రముఖుడు. రైతులకు టెర్రరిస్టు సిద్ధాంతాలు తెలియవు. తెలుసుకోవాలని లక్ష్యమూ లేదు. వాళ్లకొక్క సంగతి తెలుసు. దేశ స్వాతంత్ర్యం కోసం ఉరి తీయబడ్డా, కాల్చబడినా వాడు వీరుడు. వీరత్వానికి, బలికి, త్యాగానికి, అతడు చిహ్నం. అందుకనే కార్మిక - కర్షకులూ, మధ్యతరగతి విప్లవవాదులూ హిందూ దేశమంతటా అతన్ని పాడారు.

భగత్‌సింగును గూర్చి యేల పాటపాడే ముందు, కవి యిలా చెప్పాడు. "భగత్‌సింగు తల్లి, కుమారుని జైల్లో చూడటానికి వెళ్లినపుడు



ప్రేక్షకులు

ఒక రూపాయి, పసుపు బట్టలు తీసుకువెళ్లింది, "నే నెక్కడికయినా సంతకెళ్ళుతున్నానా నా కీ రూపాయి తెచ్చావు." అని అడిగాడు కొడుకు. ఆమె చెప్పింది. పెండ్లి బహుమానమిది.

నా ప్రియపుత్రా, భగత్, పెండ్లికొడుకువుగా
లండన్ వెళ్ళు - పెండ్లికి.
పెండ్లిపెద్దలు యిండియానుండి వస్తారు.
అతిధులు-వందలు-వేలు-ఉంటారు.

కవి ఇంకా ఇలా ఇలా చెప్పాడు. "ఒక రోజున తఖ్తా (పెండ్లిపీట ఉరితీసేటప్పుడు కూర్చొనేపీట.) పైన కూర్చోవాలి నీవు. దానికి బహుమతు లివి." తర్వాత ఆమె ఇలా అన్నది.

తఖ్తాపై కూర్చొని స్వరాజ్యం అడుగు
దేశానికి సౌఖ్యం కలుగుతుంది.

దీని తర్వాత మరో పద్యం ఉంటుంది. వానికి తల్లి మళ్లీ జవాబిస్తుంది.

ప్రియ తనయా
నీదేశానికై ప్రాణాలర్పించు.
నా మాతృ ఋణం ఆలా తీర్చుకో.
నీ పేరు చిరస్థాయిగా నిలుస్తుంది.
భయపడకు నాయినా, భయపడకు.
భయపడి నాగర్వానికి తలవంపులు తేవద్దు.
అది నిజంగా, ఉరిస్తంభంగాదు.
ఇంగ్లీషువాళ్ల మృత్యు దండం అది.
బ్రిటిషువాళ్ళుపడ్డసందిగ్ధావస్థను కప్పను మ్రింగిన
పాముతో పోల్చుతాడు. అద్భుతమైన బుద్ధి
అతనిది. బ్రిటిషువాళ్ళు ఇలా అనుకొంటున్నారు.
"అతనిని విడిచిపెట్టామా, మనల్ని వాళ్లు
వదలరు
అతనిని ఉరితీశామా, వాళ్లు తిరగబడతారు"

దాని తర్వాత ఉరి తీయడం వాయిదాలు వేస్తున్నందుకు భగత్ సింగ్ కంప్లైయింట్ చేయడాన్ని గురించి వ్రాస్తాడు. "భగత్‌సింగ్ భగవంతుని వద్దకు పోయి, వందలకొలది భగత్‌సింగులను తీసుకు వస్తాడట." భగత్‌సింగు ఇలా అంటాడు.

నేను పునర్జన్మించి నపుడు
మీ రిక్కడే
ఉండండి.
పిరికిపందలై పారిపోకండి
అపుడు మన శత్రువుల్ని వరుసగా నిల
బెడదాం.
వారిని కోట్లకొలది ఉరితీద్దాం.
(నా గొంతుచుట్టూ ఉన్న ఉరిత్రాడంటే వారి
కంత భయ మెందుకు?)
నన్ను దహనం చేస్తారు.



నేను శాశ్వతంగా నిల్చిపోతాను
నా బొమికలు, నా రక్తం, నా మాంసం
ప్రతి ముక్కా, ప్రతి బిందువు
ఫలించుతాయి.
ధాన్యపు మొక్కలవలె
ధాత్రినుండి పొడుచుకు వస్తాయి.
(నా గొంతుచుట్టూ ఉన్న ఉరిత్రాడంటే వారి
కెందు కంత భయం?)

దీని తర్వాత కవి భగత్‌సింగు ఎలా ఉరి దీయబడిందీ, రవినది ఒడ్డుకు లారీలో ఎలా రహస్యంగా తీసకెళ్లబడిందీ, వర్ణిస్తాడు. దానితర్వాత, తల్లి, సోదరుల దుఃఖాన్ని వర్ణించి పద్యాన్ని ముగిస్తాడు.

రవి నది ఒడ్డున
వీరుడా! నీ సోదరి విలపించుతోంది
'ఒంటరిదానను, దీనురాలను
నా దుఃఖ హృదయాన్ని ఉపశమించు.'
తల్లికి నీవు జ్ఞప్తి వచ్చినపుడు
ఆమెగుండె తరుక్కుపోతుంది.
ఓ! భగవంతుడా!
ఎప్పుడు ఈ క్రూరఆంగ్లేయుల్ని
నాశనం చేస్తావు?
తల్లి విలపించుతుంది:
"నా హృదయం శోకంతో దగ్ధమౌతున్నది.
'తల్లి' అని ఒకసారి పిలువు నాయనా.
భారతదేశమంతా ప్రేమించిన బంగారు చిట్టీ
నా ఇంట్లో ఆడుకో.
చిన్నికృష్ణా, నాయొడిలో పడుకో."

తల్లి విలాపాన్ని అనువదించడం కష్టం. సాధారణంగా హిందూదేశంలో తల్లి తనబిడ్డల్ని పిలిచే ముద్దుపేర్లతో, పదాలతో కప్పివేశాడు. పద్యమంతా ఎంతో సులలితంగా ఉంది. మన



హృదయాలను కదల్చుతుంది. కవిత్వాన్ని చలాయించగల అతనిశక్తికి అందరూ ఆశ్చర్యపడతారు. అతనిలో మరొక విశేషం పోలికలు. అతని గీతాలన్నిటిలో గ్రామ్యపదాలు, సర్వసాధారణంగా వాడేపదాలు ఉంటాయి. వర్ణనల లోని అతని నిత్యకృత్య సంభాషణా పదజాలం మంచి ఆనందాన్నిస్తుంది. పెళ్ళికొడుకుగా, ఉరిస్థంబంమీద, వీరునిగా, వీర సైనికునిగా, శిశువుగా, సోదరునిగా, భగత్సింగును వర్ణించినపుడు ప్రతివారి మనస్సూ ద్రవిస్తుంది. ముఖ్యంగా, తల్లి, సోదరి, గావించిన విలాపాలు ముఖ్యంగా హృదయానికి నాటుకొంటాయి, పల్లెటూరి వాసులంగాని మేమే. దూలీచందు ప్రతిభకు నిశ్చేష్టులమయాం, అతడు ఆపివేయగానే, అంతా నిశ్శబ్దం. ఒక్క నిమిషానికిగాబోలు, తెప్పరిలి వాళ్ళు చప్పట్లుగొట్ట నారంభించారు........

రాత్రి. ప్రొద్దుపోయింది. తుపాను తగ్గలేదు, దానితర్వాత "ముషైరా" ఇంకోటిఉంది. మేం పోవాలి. సయ్యద్ జహీర్ ఉపన్యాసంతో సభ ముగిసింది. మేము రోడ్డుకురాగానే, కోపంతో, శోకంతో ఆవేదన పడుతున్న హృదయాలకు శాంతి, విశ్రాంతి నిచ్చే కన్నీళ్ళలాగా వర్షపు బిందువులు పడసాగాయి. గాలివేగం తగ్గింది. గాలిలో లేచిన మట్టివాసన, బాగాఉంది. మా ఊపిరితిత్తులను, తియ్యదనంతో నింపింది. ఇదంతా గొప్ప కల్లోలం తర్వాతవచ్చే విప్లవానికీ శాంతికీ. ఇవి లక్షణాలా? అన్నట్లు కన్పడింది.

కాశీపట్టణములో

మేము కాంగ్రెసు ధర్మమునే నెరవేర్చినాము

రాష్ట్ర కాంగ్రెసు సంఘంవారి నోటీసులకు సోషలిస్టుల సమాధానం

ఆంధ్రరాష్ట్రీ కాంగ్రెసు సంఘమువారిచే జారీ చేయబడిన డిసిప్లిన్ నోటీసులకు పశ్చిమగోదావరి జిల్లాలోని ఉద్దరాజు రామం, పేటేటి వెంకటరత్నం, అల్లూరి అన్నపూర్ణాదేవి, భూపతిరాజు లక్ష్మీనర్సరాజు, అల్లూరి సత్యనారాయణ, చేకూరి అచ్యుతరామరాజు, ఉద్దరాజు సూర్పరాజు, నెక్కలపూడి రామారావు, కలిదిండి బంగార్రాజు, ప్రేేప మృత్యుంజయుడు, సంకు అప్పారావు, కృత్తివెంటి వెంకటేశ్వరరావు, దర్బా శ్రీరామమూర్తి, గొట్టుముక్కల వెంకట్రామరాజు, గార్లు ఒక్కొక్కరు ఈక్రింది సమాధానముపంపిరి.

ఆంధ్రరాష్ట్రీ కాంగ్రెసు సంఘ కార్యదర్శి గారికి,

అయ్యా,

మీరుపంపిన సంజాయిషీ నోటీసు అందినది. కాశీపట్టణ సత్యాగ్రహములో నేను పాల్గొన్నట్లు (ప్రోత్సహించినట్లు) మీకు తెలియుచున్నదని వ్రాశారు. అఖిలభారత కాంగ్రెసు కార్యసంఘం వారి అనుమతిలేనిదే ఏ అధీనసంఘముగాని, ఏ కాంగ్రెసు వాదిగాని శాసనోల్లంఘనము చేయకూడదని మీరు లోగడ ప్రకటించినట్లు వ్రాసియున్నారు. నేనా ప్రకటనకు వ్యతిరేకముగ ప్రవర్తించినందులకు సంజాయిషీ ఇమ్మని కోరినారు.

రెండు ప్రశ్నలు

మీ నోటీసువల్ల రెండు ప్రశ్నలు బయలు దేరుతున్నాయి. "కాంగ్రెసువాదికి రైతు, కార్మిక, విద్యార్థి, స్త్రీ సంస్థలద్వారా జరుగు పోరాటాలలో వ్యక్తిగతముగా పాల్గొనడానికి హక్కు ఉన్నదా లేదా? (2) కాశీపట్టణ సత్యాగ్రహములో నేను పాల్గొనడము అఖిలభారత కాంగ్రెసుసంఘ నియమములకు వ్యతిరేకమా?

మొదటి ప్రశ్నను గూర్చి నాబోటి కాంగ్రెసు వాదుల అభిప్రాయం ఈలాఉంది. కాంగ్రెసు భారతదేశ స్వాతంత్ర్యమును సంపాదించడానికి పోరాటము నడిపేసంస్థ. ఈసంస్థలో వివిధ తరగతులున్నాయి. కాంగ్రెసుయొక్క పని ఈవివిధ తరగతుల మధ్యనుండు ఘర్షణలను, పరస్పర హక్కులను, సమన్వయించి స్వాతంత్ర్య పోరాటాన్ని అభివృద్ధి చేయడం. సమన్వయించునపుడు స్వాతంత్ర్య పోరాటములో అధిక సంఖ్యాకులు పాల్గొనేటట్లు చూస్తూఉండాలి. అందుచే అధిక సంఖ్యాకులగు రైతులు, కూలీలు, హక్కులకోసము ప్రత్యేక శ్రద్ధ వహిస్తూంటుంది. అట్టి కార్యక్రమమును కూలీ రైతుల హక్కులను నిర్వచిస్తూ కాంగ్రెసు ఎన్నికల కరపత్రము, ఫెయిజ్‌పూర్ కాంగ్రెసు కాంగ్రెసు తీర్మానములు, 1937 ఫిబ్రవరి వార్దా వర్కింగుకమిటీ తీర్మానములు చేయబడినవి. ఈ కార్యక్రమమును అమలులో పెట్టించడానికి రైతులు, కూలీలు ఆ కార్యక్రమమును అమలులోకి రానివ్వకుండా చేయాలనెడి జమీందారులు, ధనవంతులయొక్క ప్రయత్నాలను ఎదుర్కొంటూ పోరాటాలు సాగించినపుడు కాంగ్రెసు సంఘాలయొక్క, కాంగ్రెసు వాదులయొక్క, ధర్మము ఆపోరాటాలలో పాల్గొనడము, వాటిని పూర్తిగ బలపర్చడము. ఈవిధముగ చేయుట వల్లనే స్వాతంత్ర్య పోరాటాన్ని, కాంగ్రెసునూ బలపర్చుచూ, కోటానుకోట్ల రైతులు, కార్మికులు ముందుకువస్తారు. అసలు స్వాతంత్ర్య పోరాటము ఇట్టి రైతు పోరాటాలు, కార్మిక పోరాటాలు, ప్రజాపోరాటాలు బయలుదేరి ఒకే పర్యాయము దేశమంతటా సాగడమే అందుచే స్వాతంత్ర్య పోరాటమును పెంపొందించడానికి పూనుకొనే ప్రతి కాంగ్రెసువాది, ప్రజాపోరాటములో పాల్గొనే హక్కును ప్రాణప్రదముగ చూచుకుంటాడు. దీనిని కాంగ్రెసు వాదియే గాక, ప్రతి ప్రజాసంఘము కూడ ప్రాణప్రదముగా చూచుకుంటుంది. ఈ విషయమునే ఆంధ్రరాష్ట్రీ రైతు సంఘాధ్యక్షులు, ఆంధ్రరాష్ట్రీ కాంగ్రెసు సోషలిస్టు పార్టీ కార్యదర్శి స్పష్టము చేసియున్నారు. మావద్దనుండి సంజాయిషీ తీసుకోడానికి మీకు అధికారమిస్తూ మార్చి నెలాఖరున రాష్ట్రీ కాంగ్రెసు వర్కింగు కమిటీ తీర్మానించినపుడే వారు



కాశీపట్టణం సత్యాగ్రహంలో పనిచేసిన కాంగ్రెసు వర్కర్లు.

రైతుసంఘ సభ్యుల యొక్క, సోషలిస్టుల యొక్కదృక్పథమును తెలియజేస్తూ ప్రకటించియున్నారు.

ఈ హక్కును కాంగ్రెసు ఇదివరకే అంగీకరించింది

ఈ హక్కును మేము ప్రత్యేకముగా నేను క్రొత్తగా ఇమ్మని కోరడములేదు, ఈ హక్కు కాంగ్రెసు మహాసంస్థచే అంగీకరింపబడినదేనని మేము మనవిచేస్తున్నాము. 1922 లో సత్యాగ్రహోద్యమము విరమింపబడిన పిదపకూడ నాగపూరు జాతీయపతాక సత్యాగ్రహము, అకాలీ సత్యాగ్రహము, బార్డోలి రైతుల సత్యాగ్రహం, నీల్ సత్యాగ్రహము మొదలగు అనేక సమిష్టి శాసనోల్లంఘనములు కాంగ్రెసు సంస్థ అనుమతి లేకనే ఆరంభింపబడినాయి. వ్యక్తిగతంగా కూడ కాంగ్రెసు సంస్థ అనుమతిలేకనే అనేకమంది శాసనోల్లంఘనము గావించియున్నారు 144 వ సెక్షనును ధిక్కరించడం మామూలు. కడకు మహాత్మాజీయే శ్రద్ధానంద పార్కులో విదేశ వస్త్ర దహనము చేసి శాసనోల్లంఘనము చేయుట ప్రపంచ మంతయూ ఎరిగినదే. అందుచే కాంగ్రెసు అనుమతి లేనిదే సత్యాగ్రహముచేయుట కాంగ్రెసువాదుల కెట్టి అడ్డంకి కూడ కాదని స్పష్టము.

కాని, ఈ ఉదాహరణలన్నీ ప్రస్తుత సమయానికి వర్తించవని మీ రనవచ్చు. ఆ కాలములో తమ అనుమతి లేనిదే సత్యాగ్రహము చేయకూడదని కాంగ్రెసు కమిటీ తీర్మానము చేసి యుండలేదు. నేడు అట్టి తీర్మానము 1934 మే నెలలో అఖిలభారత కాంగ్రెసు కమిటీ చేసి ఉండుటచే, దాని అనుమతి లేక సత్యాగ్రహము చేయడము కాంగ్రెసు నియమముల ధిక్కరించడమేనని మీరు వాదిస్తారు.

ఇదికూడ పొరపాటే నని మా దృఢ విశ్వాసం. కాంగ్రెసు తీర్మానమునకు మీరిచ్చే అర్థము సరియైనదికాదు. కాంగ్రెసు తీర్మానం ప్రకారం అధీన కాంగ్రెసు సంస్థలు, అ. భా. కాం. సంఘము అనుమతి లేక ఎట్టి సత్యాగ్రహములో పాల్గొనకూడదని నిషేధింపబడి ఉంది. గాంధీ మహాత్ముని కొక్కరికే వ్యక్తిగత శాసనోల్లంఘనము చేయుటకు హక్కు గలదని తీర్మానించడములోకూడ వారి ఉద్దేశ్యము స్వాతంత్ర్యం సంపాదించడానికి సత్యాగ్రహం చేయగల సమర్ధుడు గాంధీ యొక్క.డేనని అప్పుడా కమిటీ తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ ఇతరులెవ్వరూ స్వాతంత్ర్య సంపాదనకని సత్యాగ్రహము చేయవలదని వాదించిరి. ఈ మా అర్థము సరియైనదని తరువాత జరిగిన ఘటనలు రుజువు చేస్తున్నాయి. ఇచ్చట ఒక ఉదాహరణము మాత్ర మిస్తున్నాము.

కొన్ని ఉదాహరణలు

1937 లో క్రొత్తపట్టణములో ఆంధ్ర యువతులు పౌరసత్వహక్కుల రక్షణార్థమని 144 సెక్షనును ధిక్కరించినపుడు అప్పటి కాంగ్రెసు అధ్యక్షుడు జవహర్‌లాల్ నెహ్రూ తన స్టేటుమెంటులో వ్యక్తులు సత్యాగ్రహం చేయడానికి అధికారముందని స్పష్టము చేసారు.

ఈ ఉదాహరణకూడ ప్రస్తుత పరిస్థితులకు వర్తించదని మీరు వాదించవచ్చును. పార్లమెంటరీ కార్యనిర్వాహణలో నిమగ్నులై ఉన్నతరుణములో అనుమతి లేనిదే సత్యాగ్రహం చేయరాదని మీరు వాదిస్తున్నారు. లాహోరులో రైతు సత్యాగ్రహమును బలపరుస్తూ, దానిని ప్రోత్సహిస్తూ,దానిలో కాంగ్రెసువాదులు పాల్గొనవలయునని పంజాబు కాంగ్రెసుకమిటీ తీర్మానముచేయడము, కలకత్తా కార్పొరేషను బిల్లును ప్రతిఘటించడానికి బెంగాలు రాష్ట్రీ కాంగ్రెసు కమిటీ సత్యాగ్రహముచేయ నిర్ణయించడము, స్వదేశ సంస్థానాలలో ముఖ్యంగా జయపూరు, రాజకోటలలో, జమ్నాలాల్‌బజాజ్, వల్లభాయి పటేలులు కూడ పాల్గొని నడపడము, ఇవి అన్నీ మీరు నిర్వచించిన ఈకాలములోనే జరిగినవని మీకు జ్ఞప్తికి తెచ్చుచున్నాము. స్వదేశసంస్థానాలలో అచ్చటిప్రజలకు సహాయము జేయవచ్చునని కాంగ్రెసు తీర్మానమున్నదని మీరు వాదించవచ్చు, కాని సహాయముచేయడము, వేరు. శాసనోల్లంఘనము చేయడము వేరు అనేది మరచిపోరాదు అయితే ఈవిధంగా స్వదేశసంస్థాన ప్రజా పోరాటములో పాల్గొనడము పొరపాటని మేము చెప్పుటలేదు. ఇంకను ఎక్కువగా పాల్గొనలేదనియే మా విచారము.

ప్రజా పోరాటాలే మనమంత్రులకు బలము నిస్తాయి.

కాని కాంగ్రెసు మంత్రివర్గాలున్న చోట్లనే, సత్యాగ్రహము అనుమతి లేకుండా చేయకూడదని మీరు వాదించవచ్చు. అట్టి సత్యాగ్రహములు కాంగ్రెసు మంత్రులకు వ్యతిరేకమవుతుందని, కాంగ్రెసు మంత్రులను, కాంగ్రెసు సంఘాలను బలహీన పరుస్తుందని మీ ఉద్దేశ్యము. ఇది సరికాదు. కాంగ్రెసు మంత్రులకు పూర్ణ అధికారములేదు. వారి అనుజ్ఞలను, పోలీసు ఉద్యోగస్థులు, క్రింది ఉద్యోగస్థులు సరిగా ఆచరణలో పెట్టకపోవడమేగాక, అనేక సందర్భాలలో తామే లాఅండ్ ఆర్డర్ కాపాడడానికని దౌర్జన్యము చేస్తున్నారు. కాంగ్రెసు మంత్రివర్గాలు కాంగ్రెసు ఎన్నిక కార్యక్రమమును ఆచరణలో పెట్టకుండా, వారి హుకుం గులాములు, అడ్డువస్తున్న సంగతికూడ మీకు మేము ప్రత్యేకముగా తెలుపనవసరములేదు. ఈ పరిస్థితులలో గవర్నరును, ప్రభుత్వోద్యోగులను అదుపులో పెట్టగల్గింది, ప్రజా పోరాటాలే, అట్టి ప్రజాపోరాటాలను కాంగ్రెసువాదులు కాంగ్రెసుసంస్థలు బలపర్చడము మూలముననే కాంగ్రెసు మంత్రులకు బలముకలుగుతుంది, కాంగ్రెసుసంస్థలు అప్రతిష్టపాలు కాకుండా ప్రజా నాయకత్వము వహించుటకు ఇదియొక్కటియే మార్గము.

ఇతర రాష్ట్రాలు

సిద్ధాంతరీత్యా కాంగ్రెసు మంత్రుల హయాములో ఇట్టిహక్కు ఉండవలసిన అవసరము తెలియజేశాము. దీనిని బలపర్చడానికి ఇతర రాష్ట్రాలలోని కొన్ని ఉదాహరణ లిస్తున్నాము.

బీహారులో కాంగ్రెసు మంత్రివర్గ మున్నప్పుడు రైతులు తమవద్దనుండి జమీందారులు ఊడబెరుక్కున్న పొలాలను తిరిగి వశము చేసుకోడానికి, రైతు సంఘాలద్వారా, సత్యాగ్రహము సాగించసాగారు. దీనివలన రాష్ట్రకాంగ్రెసు కమిటీకి రైతు సంఘానికీ మధ్య ఘర్షణ ఏర్పడింది. ఇది అ. భా. సమస్యగామారింది. తత్ఫలితంగా హరిపురా కాంగ్రెసు రైతు సంఘాలు ఏర్పరచుకో వచ్చునని తీర్మానించింది. ఈ

తీర్మానము ఏ సందర్భములో, ఏ పరిస్థితులలో చేయవలసివచ్చినది, మనము జ్ఞాపకముంచుకొనిన, రైతుసంఘాలకు కాంగ్రెసు మంత్రుల పాలనలోకూడ రైతులు హక్కులకోసం పోరాటాలారంభించుటకు హక్కుగలదని గుర్తించినట్లు తేటతెల్ల మవుతుంది. అంతేగాక అట్టి రైతుసంఘాలలో కాంగ్రెసు వాదులుగ పాల్గొనవచ్చుననికూడ గుర్తించించింది. కాబట్టియే గత వత్సరము రివెరా, మొదలగు స్థానాలలో యదునందనశర్మ, స్వామి సహజానంద, రాహుల సాంకృత్యాయన మొదలగు సుప్రసిద్ధ కాంగ్రెసువాదుల నాయకత్వముక్రింద రైతుసత్యాగ్రహము జరిగినను బీహారురాష్ట్ర కాంగ్రెసు కమిటీ, వారిపై ఎట్టి చర్యకూడ తీసుకొనలేదు.

ఈ సందర్భములో మరియొక ఉదాహరణ కాన్పూరు. కాన్పూరులో మిల్లు కార్మికులసమ్మెను బలపరుస్తూ, కాన్పూరు కాంగ్రెసుకమిటీ రాష్ట్ర కాంగ్రెసుకమిటీ పాల్గొనడము, కాంగ్రెసు వలంటీర్లు కార్మిక వలంటీర్లతోపాటు మిల్లుగేటువద్ద పికెటింగు చేయడము మనకందరకీ తెలుసును. అచ్చట కాంగ్రెసు మంత్రివర్గము కార్మికుల హక్కులను గుర్తించి నిర్బంధవిధానానికి పూనుకొననందుననే, అది సమిష్టిశాసనోల్లంఘనముగా మారలేదు.

మీకు, మంత్రులకుకూడ తెలియజేశాము

కాశీపట్టణ వ్యవహారములో మంత్రులకు తెలియజేశాము జిల్లాకాంగ్రెసు కమిటీకి, రాష్ట్ర కాంగ్రెసు కమిటీకి తెలియజేశాము. వారివద్ద నుండి మాకెట్టి సూచనలుకూడ రాలేదు. పైగా రైతులు దౌర్జన్యముగా జమీందారుని పొలాలు ఆక్రమిస్తున్నట్లు గాంధీజీ, డాక్టరు పట్టాభిగారి రిపోర్టును ఆధారము చేసుకొని వ్రాశారు. ఈ పరిస్థితులలో కాంగ్రెసు నాయకుల బలమును చూచుకొని, రాజీకి ఏమాత్రము రాక, రైతుల పొలాల్ని బలవంతంగా ఆక్రమించుకోడానికి జమీందారు పూనుకొన్నాడు. ఈ పరిస్థితులలో రైతులకు కాంగ్రెసు మీద, కాంగ్రెసువాదులమీద విశ్వాసముపోయి, నిరాశతో తమ పొలాన్ని ఇతరులు ఆక్రమించకుండా అడ్డుపడడానికి పూనుకొన్నారు. ఆ సమయములో మా కర్తవ్యము యేమిటి?

మేము రైతులనుండి వచ్చినవారము. కాంగ్రెసులో చాల సంవత్సరములుగా పాల్గొనుచున్నాము. కాంగ్రెసు రైతుల హక్కులను కాపాడే స్వరాజ్యాన్ని తెస్తుందనే పూర్ణ విశ్వాసముతోనే మేము దీనిలో పని చేస్తున్నాము. రైతు హక్కులను కాపాడక, రైతు పోరాటాల నుండి దూరంగా కాంగ్రెసుగాని, కాంగ్రెసు వాదులుగాగాని ఉండగలరనుట మేము ఊహించనుకూడా ఊహించజాలకపోయాము. కాంగ్రెసులోని ఎవరో కొంతమంది ఆలా ఉండగలుగుదురని ఇప్పుడిప్పుడే మేము గ్రహించసాగాము. కాని ఆలా ఉండడము పూర్తిగ తప్పని, కాంగ్రెసును బలపరుస్తుందని మా విశ్వాసము. అందుచే మేము, రైతుల పొలాలను, జమీందారు పోలీసుల సాయముతో వశపర్చుకోడానికి పోయినప్పుడు దానికి రైతులు అడ్డు తగులుట న్యాయమని అనుకొన్నాము. దానినిబలపర్చాలి, దానిలో పాల్గొనాలి. ఇకముందుకూడ అలా పాల్గొనెదము.

కాంగ్రెసునుండి వెళ్ళగొట్టుటకా?

ఈ విధముగ రైతు పోరాటాలలో పాల్గొని కాంగ్రెసుసంస్థయందు వారివిశ్వాసము కాపాడి కాంగ్రెసు సంస్థను బలపరచిన మామీద సంజాయిషీ నోటీసులు: రైతుపొలాలను జమీందారు లాక్కోడానికి పోలీసులను సాయం పంపినందులకు క్రింది ఉద్యోగస్థులపై ఎట్టి చర్య తీసుకొననందుకు కాంగ్రెసు మంత్రుల కభినందనములు: ఇట్టి పరిస్థితి కాంగ్రెసును బలహీనపరుస్తాయని మేము వేరే వ్రాయనవసరము లేదు.

ఆంధ్ర కాంగ్రెసు వర్కింగు కమిటీ ఇట్టి తీర్మానం 2½ నెలల్రితం చేసినది. ఇంతవరకు మాకు నోటీసు లివ్వకపోవడము, నేడు మునగాలలో రైతుల పోరాటము సాగుతున్నపుడివ్వడము, మునగాల రైతులపోరాటాన్ని బలపరిస్తే కాశీపట్టణ రైతుల పోరాటాన్ని బలపర్చిన వారిగతి తమకు పట్టుతుందని కాంగ్రెసు వాదులను బెదరించడమా దీని ఉద్దేశ్యము? లేక ఈ నోటీసులు కాశీపట్టణానికి 100 మైళ్ళ దూరములో నవశక్తి ఆఫీసులోపనిచేస్తూ ఉన్న తణికెళ్ళ వెంకటచలపతి, ప్రకాశం పంతులుగారు కాశీపట్టణం వచ్చినప్పుడు, ఆయనతో కలసి కాశీపట్టణం సత్యాగ్రహ క్షేత్రాన్ని దర్శించడానికి వెళ్ళిన శ్రీ అచ్యుత రామరాజుగార్కి, మీతో పాటు త్రిపురిలో ఉన్న శ్రీ ఉద్దరాజు సూర్పరాజు, అల్లూరి సత్యనారాయణ,పేటేటి వెంకటరత్నంలకు నోటీసు లివ్వడము . సోషలిస్టు, రైతు సంఘాలలో పని చేసే వర్కర్లకు మాత్రమే నోటీసు లిచ్చినట్లు స్పష్టమవుతూవుంది. ఈ పోరాటములో సానుభూతి, సహాయమొనర్చి, ధైర్యముగ తమ విద్యుక్త ధర్మమును నెరవేర్చిన ఇతరులపై ఎట్టి నోటీసులు పంపకపోవడము కూడ స్పష్టముగా తెలుస్తూఉంది. దీనినిబట్టి రైతుసంఘ సభ్యులను, సోషలిస్టు పార్టీ సభ్యులను కాంగ్రెసు నుండి తరిమివేయడానికి ఇది ఆరంభమా? అనే సందేహము మాకు కల్గుతోంది. ఈ సందేహము నిజమో కాదో మీరు తీసుకొనే చర్యమీద ఆధారపడి ఉంటుంది.

ఆఖరి మాట

అయ్యా, ఆఖరి మాట.

స్వాతంత్ర్య పోరాటాన్ని బలపర్చడానికి మా దృక్పథమేమిటో స్పష్టముగ తెలియజేశాము. ఇట్టి విశ్వాసముతో నున్న మమ్ము బెదరించడమువల్ల ప్రయోజనముండదు. ఇట్టి విస్వాసమున్నవారి కందరికి కాంగ్రెసులో స్థానము లేకుండజేయడము కాంగ్రెసు సంస్థను బలహీనపర్చడము, తాము కూర్చొన్న కొమ్మ మొదలు నరుక్కోవడమే అవుతుందని విన్నవించుకొనుచు, ఇంతటితోనైనా మీ రీ నోటీసు ఉపసంహరించుకొని, రైతు, కార్మిక ప్రజా పోరాటాలను బలపర్చెదరు గాక అని కోరుతున్నాము.

యుద్ధ ప్రతికూల ప్రచారం

గుంటూరుజిల్లా జాతీయ వాంఛా దళము.

త్రిపురీ కాంగ్రెసు జాతీయ వాంఛా తీర్మానం త్వరలో రానున్న స్వాతంత్ర్య పోరాటంలో జయప్రదంగా పోరాడుటకు దేశీయ ప్రజలనందరను సిద్ధము చేయవలసినదని కాంగ్రెసు కమిటీల నన్నిటిని ఆజ్ఞాపించినది. ఆ యాజ్ఞానుసారము గుంటూరు జిల్లాలో, ఫెడరేషన్ను, యుద్ధాన్ని ప్రతిఘటించాలని, ప్రజా పరిషత్తు కొరకు, సంపూర్ణ స్వాతంత్రముకొరకు పోరాడాలని జాతీయ వాంఛా ప్రచారము చేయుటకై గుంటూరుజిల్లా కాంగ్రెసు సోషలిస్టుపార్టీ సంయుక్త కార్యదర్శియైన శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారిని జిల్లా కాంగ్రెసు కమిటీ ఆర్గనైజరుగా నియమించింది. ఈనెల 20 వ తారీకు నుండి శ్రీ వావిలాల గోపాలక్రిష్ణయ్యగారి నాయకత్వాన జాతీయ వాంఛా దళమొకటి జిల్లాలో పర్యటనము చేయుచున్నది. ఈ దళము ప్రతిఫిర్కా సెంటరులో సభలు జరుపుతున్నది, ఆయా ఫిర్కాలలోని ప్రజలు విరివిగా సభలకు వచ్చి ఫెడరేషన్‌ను భగ్నంచేస్తామని, జాతీయ వాంఛను సాధిస్తామని ప్రతిజ్ఞ తీసుకొందురు గాకయని కోరుచున్నాము. మరియు జాతీయ వాంచానిధికి తమ శక్తికొలది ధనమును సమర్పింప ప్రార్థించుచున్నాము.

జిల్లాలోని తాలూకా, స్థానిక కాంగ్రెసు కమిటీలు, సోషలిస్టుపార్టీలు, రైతు సంఘాలు, విద్యార్థి సంఘాలు, మరియితర సామ్రాజ్య వ్యతిరేక సంఘాలు దళమున కుచితరీతిని సాయముచేయాలి. ఫిర్కా మహాసభలకు ఫిర్కాలోని ప్రజలందరు వచ్చునట్లుచేసి ప్రచారము జయప్రద మొనర్ప గోరుచున్నాము.

ఇట్లు,

మంతెన వెంకటరాజు
జిల్లా కాంగ్రెసు అధ్యక్షుడు.

గుంటూరు 16-6-39

పి. వి. శివయ్య
జిల్లా సోషలిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి.

ధూళిపాళ కోటయ్య
జిల్లా రైతుసంఘ అధ్యక్షుడు.

టి. వెంకటేశ్వరరావు
జిల్లా విద్యార్థి సంఘ ప్రధాన కార్యదర్శి.

ఆయా ఫిర్కాలలో జరుగు సభలను జయప్రద మొనర్ప సహాయపడవలెనని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వెలువోలు శీతారామయ్యగారు ఇటువంటివిజ్ఞప్తినే మరొకటి గావించారు.

* * *

ప॥ గో॥ జి॥ కాంగ్రెసు అధ్యక్షులు, కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి గారు అధీనసంఘాలకు ఈ హెచ్చరిగ గావించుచున్నారు.

ఆంధ్రరాష్ట్రీ కాంగ్రెసు సంఘమువారి వద్ద నుండి వచ్చిన ఈ దిగువ సర్క్యులర్‌ను పంపుతున్నాము. సదరు విధముగా ప్రచారముచేసి, వివరాలను రిపోర్టు రూపకముగా ప్రతివారము జిల్లా ఆఫీసుకు పంపవలెను.

"నెల్లూరు, కందుకూరు ప్రాంతములలో యుద్ధమునకై టెరిటోరియలు (Territorial) సేనయందు చేర్చుటకై ప్రయత్నములు జరుగుచున్నట్లున్నూ, నెల్లూరుజిల్లా కాంగ్రెసు సంఘం సంయుక్త కార్యదర్శి శ్రీ మన్నేపల్లి హనుమంతరావుగారు మా ఆఫీసుకు వ్రాసినారు. సామ్రాజ్యవాదమును బలపరచునట్టి యుద్ధములను ప్రతిఘటించుటకును యిట్టి యుద్ధసన్నాహములకై మన దేశమున బ్రిటీషు ప్రభుత్వ వారు సాగించు సైనికులు వగైరాలను చేర్చు కార్యక్రమును అన్ని విధములా నిరోధించుటకు అఖిలభారత కాంగ్రెసు తీర్మానించుట జరిగినది ఆ తీర్మానమును ఆచరణలో ఉంచవలసిన ధాధ్యత ప్రతి కాంగ్రెసువాదికిని గలదు, కాన పైన సూచించినట్లు యుద్ధ సైనికులను చేర్చుటకు జరుగు ప్రయత్నములు కూడదనియూ వారు చెప్పు మాటలువిని యుద్ధమునకై సైనికులుగ చేరుట కాంగ్రెసు ఆశయములకు విరుద్ధమనియూ, దేశ లాభమునకు నష్టకరమనియూ, ప్రబోధము సలుపవలసినదిగ ఆంధ్ర రాష్ట్రములోని కాంగ్రెసువాదుల నెల్ల హెచ్చరించుచున్నాను."

ఇట్టి హెచ్చరికను మీ శాఖా సంఘములకు సభ్యులకు పంపవలెను.

కోవూరు తాలూకా రైతు సంఘం

5-7-39 తేదీ కోవూరు తాలూకా రైతు సంఘ సాంవత్సరిక సమావేశము యిందుపూరులో నూకలపాటి శంకరయ్యగారి మేడలో ఉదయం 8 గంటలకు జరుగును.

ఎజండా

1 అధ్యక్షుని యెన్నిక
2. కార్యదర్శి రిపోర్టులు-జమా-ఖర్చులు
3. భవిష్యత్కార్యక్రమము
4. కార్యనిర్వాహకవర్గ యెన్నికలు
5. తాలూకా రైతుసంఘమునకు నిబంధనలు యేర్పరుచుట.
6. తాలూకాలోని శ్రోత్రియం రైతులయొక్కయు, ఫారెస్టుయిలాకా రైతులయొక్కయు యిబ్బందులను విచారించి రిపోర్టుచేయుటకు సబ్ కమిటీలను నియమించుట.
7. కార్యదర్శి తెచ్చు యితర విషయములు.

షరా:- 31-7-30 లోపల చేరిన రైతుసంఘ మెంబర్లు 25 మందికి 1 డెలిగేటు చొ॥ యెన్నుకొని పంపినవారే పై సభలో పాల్గొనవలెను. ఇంతవరకు యెన్నికలు జరుపని గ్రామాలలో వెంటనే యెన్నికలు జరిపి యీ క్రింది అడ్రెసుకు తెలియజేయవలెను.

బి. శేషయ్య,
అధ్యక్షుడు,
కోవూరు తాలూకా, అల్లూరు (పోస్టు),
నెల్లూరు జిల్లా

ఆంగ్లో - జపాను యుద్ధమా ?

రెండు వారాలయింది అప్పుడే జపాను టీన్ట్సిన్ చుట్టూ 'బ్లాకేడ్' కట్టి. అయినా ఇంత వరకు బ్రిటను 'అసమ్మతులు-తీవ్రమైన అసమ్మతులు-తీవ్ర ఆలోచనలతో' కాలం బుచ్చింది కాని తగిన కార్యాచరణ సాగించలేదు. అలా అని మెదలకుండా కూర్చొన్నదని అర్థంగాదు. ఆంగ్లో-ఫ్రెంచి సైనిక సంప్రదింపులుసాగాయి. ఈ సంప్రదింపులు గురించి చెప్పే ముందు, జపాను టీన్ట్సిన్‌ను ముట్టడించడంలోని భావమేమిటో చూడాలి.

ఇదివరకే చెప్పినట్లు,జపాను వారి కీలుబొమ్మ అయిన చంగ్‌ను హత్యగావించడంవల్లనే ఇంత రభసజరుగుట లేదు. జపాను మిలిటరీ ఆఫీసర్లు ప్రభుత్వోద్యోగులు స్పష్టంగా చెప్పే విషయమే ఇది. "మేము ఆసియాలో ఒక నూతన విధానాన్ని అమలుపెడతాం. ఆ విధానానికి మీరు అడ్డు రాకండి. పైగా సహాయం చేయండి." ఈ విధానం మరేమీ కాదు. చైనాను జయించడం. ఇపుడు చైనాకు కొద్దిగా చేస్తున్న సహాయాన్నికూడా ఆపి, తమ బందిపోటు తనానికి సహాయం చేస్తే, బ్రిటిషువారివి గాని, ఫ్రెంచి వారివిగాని హక్కులు నిలుస్తాయి. లేకపోతే లేదు. ఇది జపాను ధోరణి. ఇది ఒకటి. రెండవది, పూర్తిగా బ్రిటన్‌ను దెబ్బగొట్టి ఉత్తర చైనాలో తమ వర్తకాన్ని వృద్ధి చేసుకోడం.

జపానులోకూడ రెండభిప్రాయా లున్నట్లు తోస్తుంది. ఒకటి జంగ్-కై-షేక్‌కు ధన సహాయం చేయకుండా, బ్రిటన్ సహకారం చేస్తే చాలు. రెండవది, బ్రిటన్-చైనాకు సహాయం చేయకుండుటే గాక, తనహక్కుల్ని వదలుకొని, సైనిక, ఆర్థిక పెత్తనాన్ని జపానుకు అప్పగించాలి. అందుకే రెండవ అభిప్రాయం గల మిలటరీ ప్రముఖులు ప్రభుత్వంపైన ఒత్తిడి తెస్తున్నారు.

తీరని అవమానాలకు విదేశస్థుల్ని-ముఖ్యంగా ఇంగ్లీషువారిని. రష్యనులను-గురిచేస్తున్నారు. ఛాంబర్లేను వాక్యాలలో "సహింపరాని—అవమానకరమైన-దుష్ట" కృత్యాలు చేస్తున్నారు జపానువారు. బ్రిటన్, అమెరికాల అసమ్మతులను నిర్లక్ష్య పరిచడమే గాక పైగా బ్రిటన్ యాంగెట్సీ నదిమీద (వుహూ పట్టణం వద్ద) జపానువారి నవమానించారని ఎదురుదెప్పి అసమ్మతిచూపారు. ఇదంతా లబద్ధమని బ్రిటన్ తెలియజేసింది.

బ్రిటిషువారి కోర్కెల తిరస్కరించుతూ జపాను (తాత్కాలిక) ప్రభుత్వం ఈ క్రింది కోర్కెల కోరింది.

1. బ్రిటిష్ కన్సెషన్పులోని టెర్రరిస్టులను కమ్యూనిస్టులను జపానుకు అప్పగించాలి.

2 చైనా జాతీయ ప్రభుత్వపు 'కరెన్సీ నోట్లను' ప్రచారం లేకుండా అడ్డగించి, కన్సెషన్పులో వున్న చైనా వెండిని, జపానుకు వశపరచుటలో బ్రిటన్ సహాయం గావించడం.

3. కన్సెషనులోని చైనా బ్యాంకులను, మారకపు షాపులను, నిల్వ అంగళ్లను పరీక్షించడానికి అనుమతి ఈయడం.

4. తాత్కాలిక ప్రభుత్వానికి వ్యతిరేకమైన ప్రచారం, అభిప్రాయాలు, చేష్టలు, ప్రయత్నాలు మానివేయడం.

దీనినిబట్టి ఏంతెలుస్తుంది? చైనాను పూర్తిగా ఆర్థికంగా దెబ్బగొట్టాలని. 1935 లో జపాను దురాక్రమణ సాగించిన నాటినుండీ నేటివరకు చైనా ఎలాగో ఆయుధాలను కొనగల్గుతూనే ఉంది. స్వాటో ఆక్రమణతో వర్సేల్సు సంధి ప్రకారం చైనా వశానఉన్న రేవుపట్టణాలు రెండుదప్ప అన్నీ జపాను వశమయాయి. 18 రాష్ట్రాలలో 12 రాష్ట్రాలు జపానువశమయాయి. అయినా, చైనా జపానును ధిక్కరించి, ఆర్థికస్థితిని నిలబెట్టుకోగల్గింది. ఇపుడీ ఆర్థిక సుస్థితిని నాశనంచేసి లొంగదీయాలని, బ్రిటన్‌పై జపాను ఒత్తిడి తెచ్చింది. అవే ఈ షరతులు.

అయితే ఈ షరతులకు బ్రిటన్ ప్రధాని ఇలా అన్నాడు.

"అసాధ్యమైనవి — అంగీకరింపరానివి ఈ కోర్కెలు", ఇంతేగాదు. "విదేశాంగ రాజనీతి ఎవరో ఇతరులు డిక్టేట్ చేయడంవల్ల మార్చుకోదు బ్రిటన్". దీనినిబట్టి, బ్రిటన్ గట్టిగా జపానును ఎదిరించుతుందా? అన్న ప్రశ్న రాకమానదు.

స్వాటో ఆక్రమణం

స్వాటో ఆక్రమణం—దాని తర్వాత జరిగిన ఘటనలు బ్రిటన్ లొంగదను భావన కలుగజేసినా బ్రిటన్ త్వరగా చర్య తీసుకోడంలేదు. స్వాటో ఆక్రమణవల్ల చైనాకు పెద్దదెబ్బ. చైనాకు హాంగ్‌కాంగ్ తర్వాత ఇదే ఆయుధాల సప్లయికి ధోవ. స్వాటోను ఆక్రమించిన తర్వాత జపాను అధికారులు 22 వ తేదీన సాయంత్ర ఒంటిగంటలోగా.విదేశ యుద్ధనౌకలు విడిచిపోవాలని చెప్పారు. కాని అమెరికా, ఇంగ్లండులు ధిక్కరించి యుద్ధనౌకల్ని పంపించాయి.

సింగపూరు సంప్రదింపులు

పైకి మెత్త మెత్తగా మాట్లాడుతున్నా, ఎపుడూ శాంతిప్రియులమని చెబుతున్నా,"ఆత్మరక్షణ" అంటూ ఆక్రోశించుతున్నా, బ్రిటన్ ఫ్రాంసులు మరో సామ్రాజ్య యుద్ధానికి తయారవుతున్నాయి అని అనిపిస్తుంది. దీనికి కావలసినన్ని ఉదాహరణలున్నాయి.

ఫ్రెంచి మాగినట్ లైనును సందర్శించడానికి బ్రిటన్‌నుండి గోర్టు వెళ్ళాడు. ఫ్రెంచి సైన్యాధికారులలో ప్రముఖుడగు గామిలిన్ బ్రిటన్ వచ్చాడు. వలసరాజ్య కార్యదర్శి మాల్కాం మాగ్డనాల్డు. ఫ్రెంచి వలసరాజ్య మంత్రి మాండెల్, పారిస్‌లో కలిసికొని, సైనిక సహకారాన్ని గురించి, వలస రాజ్యాలకు సంబంధించిన, ఆర్థిక సైనిక విషయాలు చర్చించారు. అన్నిటికన్న ముఖ్యమైన విషయం సింగపూర్ సభ.

22 వ తేదీన సింగపూర్‌లో ఫ్రెంచి, ఇంగ్లీషు యుద్ధశాఖాధికారులు కలిసికొన్నారు. ఇండియా, బర్మా, సిలోన్, మలయా, హాంగ్‌కాంగ్‌ల నుండి దాదాపు 60 మంది ఆఫీసర్లు వచ్చారు. సింగపూర్‌లోని సంప్రదింపులు ఫలితాలివియని తెలియవస్తుంది. యుద్ధం తటస్థించితే, సింగపూర్‌ను కేంద్రంగా చేసికొని, బ్రిటిష్ నావల్ కమాండర్-ఇన్-చీఫ్ నాయకత్వము క్రింద ఫ్రెంచి, బ్రిటిష్ నావికా సైన్యాన్ని నడపటం.

జపాను, హైనానుదీవిని, ఫ్రెంచి వారి స్ప్రిట్లీదీవులను ఆక్రమించుటతోనే బ్రిటిషు ఫ్రెంచి హక్కులకు భంగం కల్గింది; అందుచేత ఇప్పటి సంభాషణలలో హాంగ్‌కాంగ్ రక్షణ గురించికూడ చర్చించబడింది. ఇంతేగాక యుద్ధంవస్తే అవసరమైన యుద్ధనౌకల్ని సింగపూర్‌లో ఉంచారు. దీనినిబట్టి ఆంగ్లో-జపాను యుద్ధానికిది సన్నాహమా అంటే అవునని చెప్పడానికే ఎక్కువ కారణాలున్నాయి.

యూరపు పరిస్థితులు

ఆంగ్లో-సోవియట్ రాయబారాలతో ప్రపంచమంతా రెండుభాగాల క్రింద విభజింపబడ్డట్లు భావించాం ఒకటి ఇతర దేశాలపై దురాక్రమణ గావించే దేశాలు. అబిసీనియా, స్పెయిన్, చైనా, ఆస్ట్రియా, జకోస్లొవేకియా, అల్బేనియాలపై దురాక్రమణ గావించిన జపాను, జర్మనీ, ఇటలీలు. రెండవది, శాంతినికోరే ప్రజాస్వామ్యదేశాలు. స్పెయిన్, జకోస్లొవేకియాలలో ద్రోహమొనర్చి, ఫేసిస్టులను సంతృప్తి పరిచిన ఫ్రెంచి, బ్రిటిషు సామ్రాజ్యాలుకూడా "ప్రజాస్వామ్య దేశాల" క్రింద లెఖ్ఖ! ఈసంతృప్తి విధానంమాని, సోవియటుతో దురాక్రమణ నిరోధానికి సంధిచేసికొని, చిన్న చిన్న దేశాలకు రక్షణఇచ్చి, అమెరికాను కూడగట్టుకొని, ఇవన్నీ "శాంతికూటమి"గా మారుతాయేమోనని ప్రపంచమంతా అభిలషించింది.

కాని, మూడు నెలలైనా ఆంగ్లో-సోవియట్ రాయబారాల వలని ఫలితం కలగలేదు. సంధి కుదురుతుందను ఆశలేదు. మొరేవియా, బోహేమియాల ఆక్రమణ, ఆల్బేనియా ఆక్రమణతో బ్రిటిషు ప్రభుత్వ విధానంపై అసమ్మతి హెచ్చినది, పోలండ్, రుమేనియా, గ్రీసులకు, ఫ్రాంసు, ఇంగ్లండులు అభయ మీయవలసి వచ్చింది. సోవియట్‌తో రాయబారాలుకూడా సాగించవలసి వచ్చింది.

సోవియట్‌తో రాయబారాలు సాగించడంలో ఛాంబర్లేను ప్రభుత్వపు ఎత్తులు రెండున్నాయి. సంభాషణలు సాగించుతూ, ప్రజలను భ్రమపెట్టి సంతృప్తి పరచడం. డిక్టేటర్లను బెదరించడం.

యూరోపియను పత్రిక లన్నీ పూర్వంకొన్నాళ్లు "యుక్రెయిన్" గురించి గోరంత కొండంతలుచేసి వ్రాశాయి. అవిధంగా ప్రోత్సహిస్తే తమ సామ్రాజ్య హక్కులకు భంగం లేకుండా, సోవియట్ యూనియన్‌పై హిట్లర్ దండెత్తుతాడని ఆశించారు బ్రిటిషువారు. సోవియట్ బలాన్ని గుర్తెరిగిన హిట్లర్ ఆ ప్రయత్నం మానేశాడు. ఇపుడు బాల్టిక్ దేశాలకు రక్షణ ఈయకుండా ఆ త్రోవను సోవియటుపైకి పొమ్మని మళ్ళా ప్రోత్సహించాయి. అందుకోసమే సోవియట్ రాయబారాలలో ఇంత ఆలస్యం, జర్మనీ - సోవియటులు కొట్టుకొంటే తాము పైనుంచి పెత్తనం చేయవచ్చునని ఆశ. అయినా హిట్లర్ అటువైపు వరుగెత్తలేదు, పైగా సోవియటుతో వర్తక సంధులకు వరుగెత్తుతున్నాడు. స్పెయిన్‌లో రష్యాఖైదీల వదలిపెట్టించాడు. డాంజిగే కావాలంటున్నాడు. కాలనీలే కావాలంటున్నాడు. ఇటు తూర్పున జపానును ప్రోత్సహిస్తున్నాడు.

స్లోవేకియా వైపు, ఫ్రెంచి సరిహద్దులవైపు జర్మనీ సైన్యాలు పోతున్నాయి. డాంజిగ్ తిరిగి జర్మనీలో కలుస్తుందని రోజూ ఉపన్యాసాలిస్తున్నారు నాజీ నాయకులు. దానినిబట్టి అటు టీన్ట్సిన్‌వద్ద బ్రిటన్ అవస్థలు పడుచున్నపుడే డాంజిగ్ కొట్టేయాలని హిట్లర్ ఎత్తు.

రెండువిధాలా, జర్మనీని సోవియటుపై దుమికించజాలని బ్రిటన్ చేసేది లేక యుద్ధానికి సిద్ధమౌతున్నది. సోవియట్ జర్మనీతో కలుస్తుందని వ్యతిరేక ప్రచారం సాగించింది. అటు టీన్ట్సిన్‌వద్ద త్వరగా చర్య తీసుకోడానికి ఆలస్యం చేయడం దేనికి యుద్ధానికి సిద్ధమయితే, అన్న ప్రశ్న వస్తుంది. చిట్టచివరి ప్రయత్నం చేసి చూద్దామని బ్రిటన్ వాంఛ. అందుకోసం, యుద్ధ సన్నాహాలుచేసినా తొందరపడటం లేదు. ఇటీవల ఛాంబర్లేను, హాలిఫాక్సు ప్రభువుల ఉపన్యాసాలే అందుకు తార్కాణం. దురాక్రమణచేసేవారిని ఒకప్రక్క బెదిరిస్తూనే మరోప్రక్క లాలిస్తున్నారు. జూన్ 12 వ తేదీన హాలిఫాక్సు ప్రభువు మాటాడుతూ

"దౌర్జన్యాన్ని దౌర్జన్యంతో ప్రతిఘటించుతాం" అన్నాడు. కార్డిఫ్‌వద్ద మాట్లాడుతూ ఛాంబర్లేను జర్మనీని గురించి ఇలా అన్నాడు.

"జర్మను పరిశ్రమలకు స్థలమూ, జర్మను కార్మికులకు ఉద్యోగమూ చూడవచ్చు.... కాని అలాంటి సౌఖ్యప్రదమైన స్థితి జర్మనీకి అనుమానాలున్నంతకాలమూ కలగానే ఉంటుంది." ఇది ఛాంబర్లేను లాలన. ఛాంబర్లేను వాక్యాలను జర్మనీ విశ్వసించడంలేదు. విశ్వసించదుకూడా దురాక్రమణకై సిద్ధమైనప్పుడు విశ్వాస, అవిశ్వాసాలెందుకు? గోబెల్సు "మాకు కార్యాలుగాని, మాటలు అక్కరలేదు" అన్నాడు.

మరొకప్రక్క జర్మనీని బెదరించుతూ టైమ్సుపత్రికఇలా వ్రాసింది.

"బ్రిటన్ నిస్సహాయస్థితిలో ఉందని జర్మనీ ఇటలీ ప్రజలలో ప్రచారం చేయబడుతుంది. బుల్‌డాగ్ (బ్రిటన్) ఎంత రెచ్చగొట్టినా, కరిచే ముందు అరవదు. కరిచిందా వదిలిపెట్టదు.... బ్రిటిషువారి మెత్తని మాటలను తప్పర్థం చేసికోకూడదు.


దౌర్జన్యాన్ని దౌర్జన్యంతో ఎదుర్కొంటామన్న, ఛాంబర్లేను, హాలిఫాక్సుల హెచ్చరికలను పెడచెవినిబెడితే ప్రపంచానికి మహా దురవస్థ ఘటిల్లుతుంది. తీరా ఆచరణలోపెట్టాక ఆరోజున సంధి సంప్రదింపులు—లాభించవు."

ఫ్రాంకో-టర్కిష్ సంధి

ఈ యుద్ధసన్నాహాలే, ఫ్రాంసు, టర్కీలు సంధికి త్వరపెట్టినాయి. ఆంగ్లో – టర్కిష్ ఒడంబడిక సూత్రాలపైననే ఈ సంధి కూడ గావించబడింది. ఫ్రెంచి మాండేట్ క్రిందనున్న అలెగ్జాండ్రెట్టా (సిరియా) ను తిరిగి టర్కీ స్వాధీన మొనర్చడానికి అంగీకరించింది. దీనివలన ఇటలీ ఎత్తులకు అడ్డు తగులుతున్నది. అపుడే మాండేట్ (సంరక్షణ) నియమావళిని ఉల్లంఘించారంటూ, ఇటలీ దూషించింది. మాండేటరీ కమీషన్‌గూడ విమర్శించింది తమతో విచారించలేదని. ఈ సంధివలన మధ్యధరా సముద్రములో ఆంగ్ల-ఫ్రెంచి సామ్రాజ్యాలు బలపడడమేగాక ఇపుడు జర్మనీతో సహకారాన్ని వాంఛించే కొన్ని తురుష్క దేశాలు మళ్లా ఈ వైపుకు మొగ్గవచ్చు.

శాంతిని గోరే అన్ని దేశాలతోనూ సఖ్యం చేసికోక, ఇలా తమ సామ్రాజ్యాలను మాత్రమే రక్షించుకొంటానికి ప్రయత్నిస్తున్నారనటానికి మరో నిదర్శనం ఉంది. మొన్న సింగపూర్ సభకు అమెరికాను, ప్రక్కనవున్న నెదర్లాండ్సును పిలువలేదు. పైగా కామన్సు సభలో ఈమధ్య ప్రశ్నించినపుడు ఛాంబర్లేను, ప్రాచ్య దేశాలలో జపానుదాడి నరికట్టడానికి సోవియట్‌తో సంప్రదించడం లేదని తెలిపాడు. యూరప్‌లో సోవియట్ తమ సామ్రాజ్యాల రక్షణకు సాయపడాలట! కాని ఆసియాలో మాటిమాటికీ తమనేగాక సోవియటును కవ్వించుతున్న జపానును అరికట్టడానికి, సోవియట్ అక్కరలేదట!

ఇదివరకు, బ్రిటన్, ఇతర దేశాలకు వైరం కల్గించి, తాను అప్పులు బెడుతూ, చివరి కెవరి ప్రక్కనో ఒకప్రక్క జేరి తన సామ్రాజ్య దోపిడికి అనుకూలమైన షరతుల ఇద్దరినెత్తినా విధించేది. కాని ఇపుడు—ఇంతవరకూ సాగినా-సాగకపోతే ఈ సామ్రాజ్యయుద్ధంవల్ల బ్రిటన్ దెబ్బతినదా? అది ఫేసిస్టులపైన ఆధారపడి ఉంటుంది. అమెరికా తటస్థత వదిలేటట్లు, ఇటు సోవియటు కలుగజేసికొనేటట్లు రెచ్చగొట్టకుండా ఉంటే, బ్రిటిషు, ఫ్రెంచి సామ్రాజ్యాలతో మాత్రం, జపాను, జర్మనీ ఇటలీల యుద్ధం తటస్థించవచ్చు. కాని ఇది అంత సులభమైన పనికాదు.



చైనా : సోవియటు యూనియన్

చైనా, సోవియట్‌లు చేసుకొన్న వర్తక సంధివలన సోవియటు సంబంధం ఎక్కువైంది, సోవియట్ దగ్గరనుండి ఆయుధసహాయము రావడం భూగోళ పరిస్థితుల ననుసరించి, కొంత ఆలస్యమవుతుంది. కాని ఈ సంధివలన రెండు దేశాలకు సన్నిహిత సంబంధమూ, జపానుతో రాజీచేసుకోవాలనే వారెవరైనా యుంటే, వారి నరికట్టడమూ జరుగుతుంది.

జపాను : సోవియటు యూనియన్

రోజురోజూ, జపాను-సోవియట్ ఘర్షణ గురించి వచ్చేవార్తలన్నీ జపానునుండే వస్తున్నాయి. క్రిందపడ్డా పైచేయి నాదేఅన్నట్లు, జపాను ఎపుడూ సోవియటు విమానాలు ఎక్కువ కూలిపోతున్నట్లు, తమవి తక్కువ కూలిపోతున్నట్లు వ్రాస్తున్నది. ఇపుడుమాస్కో ప్రకటించిన వార్తలుచూస్తే, జపాను బండారం బయటపడుతుంది.

"గత మాసంలో విమానాల యుద్ధమునూ, భూయుద్ధమునూ సాగించాయి. దానికి కారణం మే 11 వ తేదీన జపాను మంచుకో సైనికులు ఔటర్‌మంగోల్ సరిహద్దు కాపలావారిని ఎదుర్కోడం బూయిర్నర్ సరస్సువద్దనే ఈ ఘర్షణ ప్రారంభమయింది.

ఇందులో జపానువారు 400 మంది చనిపోయారు. చాలమంది గాయపడ్డారు. సోవియట్ సైనికులు 40 మంది చనిపోయారు. 70 మంది గాయపడ్డారు.

మే 28 వ తేదీన హఠాత్తుగా జపాను విమానదాడి సాగించింది. మొదట సోవియట్ విమానాలు 9 కూలినయి. జపానువి 3 కూలినవి. జూన్ 22 వ తేదీన 120 విమానాలు జపానువి దాడి చేసాయి. 95 సోవియట్ విమానాలు ఆత్మరక్షణకు ఎదుర్కొన్నాయి. జపాను విమానాలు 31 సోవియటువి 12 కూలిపోయినవి. మళ్ళీ జూన్ 24 వ తేదీన చెరి60 విమానాలు ఢీకొన్నాయి. జపాను 25, సోవియట్ 2 విమానాలను పోగొట్టుకొంది."

ఇంకా జపాను వైమానిక యుద్ధంచ సాగించుతూనే ఉంది. తప్పుడువార్తలు ప్రకటించుతూనే ఉంది. మంచూకోలో 114 గురిని కమ్యూనిస్టులని 1938 మార్చిలో అరెస్టు చేశారు. వారిలో 10 మందికి మరణశిక్ష, 7 గురికి యావజ్జీవ శిక్ష. తక్కినవారికి వివిధ రకాల శిక్ష విధించింది. జపాను ఈ దారుణ కృత్యాలను సోవియట్ సహించదు. దానికి తార్కాణం క్రిందటిసారి 'చేపల' తగాదాలో జపాను సోవియట్ షరతులకే లొంగిపోయేటట్లు చేసిందన్న సంగతి మరచిపోరాదు.

నవశక్తి మద్రాసు బ్రాంచి

మద్రాసులో మా బ్రాంచిని ఏర్పఱచాం మద్రాసుకు సంబంధించిన అన్ని విషయాలు ఇక్కడ తెలిసికోవచ్చును.

అడ్రసు :—

21 ఎర్రబాలు చెట్టి స్ట్రీటు,
జి. టి. మద్రాసు.

వెంకటగిరి జమీందారీలో దుర్భర పరిస్థితులు

కామ్రేడ్ జి. సి. కొండయ్య.

నెల్లూరు జిల్లా కాంగ్రెసు సంఘంవారి తీర్మానం ప్రకారం వెంకటగిరిలో ప్రచారం నిమిత్తం ప్రచారక దళాలు 20 వ తేదీన బయలుదేరినవి. 20, 21 తేదీలలో మా దళము యీ క్రింది గ్రామాల్లో సభలు జరిపి, అక్కడ పరిస్థితులు తెలుసుకొన్నాము. రైతు అనుభవించు కష్టాల్లో కొన్ని ఈ క్రింద వ్రాస్తాను.

పిడూరు

ఈ గ్రామంలో యీ సంవత్సరం బొత్తిగా పంటలు లేవు యేదయినా తోటపైరులు కొద్దిగా పండితే, యీ పండినదానికి శిస్తులు మార్చిలోనే వసూలు చేసుకొన్నారు. విద్యా, రైల్వే, రోడ్ల పన్నులుకూడా వసూలు చేసుకొన్నారు. యిక రైతులు యివ్వలేమనే పన్ను పండని భూములదే. యింతకుముందు, పన్నులు వసూలు చేసుకొనేటప్పుడు ఇక మీదగ్గరకు పన్నులు వసూలని రాము అని చెప్పిరి. కాని ఆ పన్నులు వసూలు చేసుకొని యిప్పుడు మళ్లీ పన్నులు కట్టమని బాధిస్తున్నారు. రైతులుమాత్రం ఇవ్వలేమని చెప్పుచున్నారు. యిప్పటికి ఆవూరులో 12 కుటుంబాల పశువులను జప్తు చేశారు. ఒక వర్తకుడింటిలో సిపాయిలు దొరబడి నూనె డబ్బాలు, యింటి తలుపులు వూడబెరికి బయట వేయించి జప్తుచేసారు. రైతులు యీ పూటకు తిండిలేని మా వద్ద యేమి వసూలు చేస్తార్రు, మా భార్యా బిడ్డలను బ్రతికించమని బ్రతిమిలాడిరట. కాని జమీందారు మనుష్యులు వినటంలేదు, అంతట రైతులు భూములనూ, పశువులను జప్తుచేసుకొని పొమ్మని చెబుతున్నారు. యీ గ్రామంలో చెర్వు యిప్పటికి మాకు తెలిసినంత వరకు రిపేరుచేసి ఎరుగరు.

పిదూరి పాలెం.

ఈ గ్రామంలో కూడా తోటలపన్ను, రైల్వే విద్యా, పన్నులు వసూలు చేసుకొన్నారు. వసూలు చేసేటప్పుడు యెండిన పైర్లకుమాత్రం పన్ను లేదని చెప్పేరట. కాని, యిప్పుడు జప్తులు ఆరంభమయినవి. ఇప్పటికే 11 కుటుంబాల సేద్యపు పశువుల జప్తు చేసారు. ఇంకా ఇండ్లలో జరుగుబడికి కాయధాన్యం జప్తులు చేస్తామని సిపాయిలు చెపుతున్నారు. యీ గ్రామానికి ఒక చెరువు ఉంది. యీ చెరువుకు వచ్చే కాలువ యే 100 యేండ్లనాడో రిపేరు చేయించారట. అందువల్ల కాలువ పూడిపోయి నీళ్లు రాక కష్టపడు దాపరిస్తున్నదని చెప్పిరి. లేక యెప్పుడయినా నీళ్లవచ్చి పండితే ఎకరాకు 5 తూములు గింజలకంటె జాస్తి పండదు. ఆ పూచి భూమి అయినా పన్నుల బాధ తప్పదట. పోనీ యీ సంవత్సరం తిండికయినా గింజలు లేనప్పుడు పన్నులు యేవిధముగా కట్టము బాబూ అని కండ్ల నీళ్లుకార్చారు.

స్వీకారం

పత్రికలు

తెలుగు తల్లి

(జాతీయ హాస్యరస పక్షపత్రిక)

సంపాదకులు : యస్. ఆర్. శర్మ

విడిపత్రిక అర్ధణా. (విజయనగరం)

* * *

తెలుగు టాకీ

(సినిమా మాసపత్రిక)

సంపాదకులు : పమిడిపాటి శ్రీనివాసరావు

విడిప్రతి అణా.

[2/52 అన్నాపిళ్లయి స్ట్రీటు, జి. టి. మద్రాసు]

* * *

కథాంజలి

(వార్షిక సంచిక)

[32 క్రిష్ణప్పనాయిక్ టాంక్ స్ట్రీట్, జి. టి. మద్రాసు.]

* * *

పుస్తకాలు

సినిమా పరిశ్రమ

వెల రూపాయి.

రచయిత : కె. కృష్ణమూర్తి (పిఠాపురం)

పార్టీ సభ్యులు గమనించాలి.

	చేర్పించాలసిన కోటా.			చేర్పించినది.						బాకీ		
	సం॥	½సం॥	రూ॥	సం॥	½సం॥	విరాళాలు (రూ)	మొత్తం (రూ)					
విశాఖ.	4	8	12	2	1	—	7	8	0	4	8	0
తూ॥ గో॥	15	30	45	2	1	—	7	8	0	37	8	0
ప॥ గో॥	20	40	60	3	1	51	61	8	0	(+1	8	0)
కృష్ణా	37	74	111	9	8	—	39	0	0	72	0	0
గుంటూరు	25	50	75	5	5	12	34	8	0	40	8	0
నెల్లూరు	25	50	75	9	0	—	27	0	0	48	0	0
ఇ॥ స్థ॥	8	16	24	4	2	—	15	0	0	9	0	0
	134	268	402	34	18	63	192	0	0	211	8	0

ఈ బాకీలను జిల్లాపార్టీలవారు జులై మొదటి వారంలో చెల్లించాలి.

గుంటూరు జిల్లా కాంగ్రెసు సోషలిస్టు పార్టీ తీర్మానాలు

పార్టీ సభ్యులకు హెచ్చరిక!

12-6-39 న గుంటూరుజిల్లా కాం॥ సో॥ పార్టీ కార్యనిర్వాహక వర్గము సమావేశమయి ఈదిగువ తీర్మానాలు గావించింది.

1. జిల్లా, తాలూకా, పట్టణ కాంగ్రెసు కమిటీలయొక్క కార్యనిర్వాహక వర్గముల యొక్క ఎన్నికలైనవి. వీటి ఫలితములవల్ల పార్టీ సభ్యులలో అనేక భేదాభిప్రాయములు, కలతలు కలిగినవి. ఒకరు పార్టీ సభ్యత్వానికి రాజీనామా ఇవ్వటం జరిగింది. ఎలెక్షన్ల ఫలితాలు చర్చించటానికి జిల్లా జనరల్ బాడీసమావేశము జరగాలని కూడ ఒక తాలూకా పార్టీ అభిప్రాయబడ్డది. ఎన్నిక తత్త్వంఎక్కువైంది. ప్రజలలో పనిచేస్తూ దానిద్వారా కాంగ్రెసు కమిటీలకు ఎన్నుకోబడటం, ఆబలంతో కార్యనిర్వాహక వర్గములోనికి ఎన్నుకోబడటం సరియైన పద్ధతి కాని ఇతర సమయాల్లో వీలుండే పార్టీ సభ్యులు ఎన్నుకో బడుతారు. లేనప్పుడులేదు. మన కాంగ్రెసు కమిటీలను capture చేయడానికి వ్యతిరేకులము కాబట్టి పార్టీ సభ్యులంతా ప్రజా సంఘాల్లో పని ముఖ్యమని గుర్తించాలి కాంగ్రెసు కమిటీ అధికారాలకు అంత ప్రాముఖ్యత ఇవ్వకూడదని కార్యనిర్వాహక వర్గం ప్రతిపార్టీ మెంబరుకు హెచ్చరిస్తున్నది.

2. ప్రతిస్థానిక పార్టీయు జూన్ నెలాఖరులోగా సమావేశమయి ప్రతిసభ్యునికి అతని అవకాశాన్ని శక్తినిబట్టి పనియివ్వి, జిల్లా ఆఫీసుకు తెలియపర్చాలి. సదరు సభ్యుడు తనికొన్న పనిని చేస్తున్నాడో లేదో పరిశీలిస్తూ అలాపని చేయలేక పోయినచో, అతనిని యాక్టీవుసభ్యులిస్టునుండి తొలగించాలి.

రాష్ట్రపార్టీ (5-6-39) సమావేశ తీర్మానమునునుసరించి పార్టీలో యాక్టీవు సభ్యులు మాత్రమే ఉండాలి. అంటే ప్రస్తుతమున్న సభ్యత్వమునంతటిని క్రమంగా సంస్కరించాలి.

3. స్థానిక పార్టీలు ప్రతివారం రోజులకొకసారి, తాలూకాపార్టీలు 15 రోజులకొకసారి సమావేశమౌతుండాలి. సమావేశంలో ఆమోదింపబడ్డ పార్టీ రిపోర్టును జిల్లాపార్టీ ఆఫీసుకు వెంటనే పంపాలి. పార్టీ కేంద్రానికి రిపోర్టులు లేకుండా వార్తాపత్రికలకు మాత్రమే తీర్మానాలు పంపుతూ స్థానిక పార్టీలు పనిచేస్తున్నాయి. ఇది మానాలి. జిల్లాఆఫీసుకు తప్పక తీర్మానాలు రిపోర్టు వెంటనే పంపాలి.

4. జిల్లాపార్టి సెక్రటరీగాని, కార్యనిర్వాహక వర్గముచే నియమింపబడ్డ మరి యితరులుగాని జిల్లాలో సంచారము చేయునపుడు ఆయాస్థానిక పార్టీలు తమ ఫైళ్ళను రికార్డులలో తనిఖీ చేయించు కోవాలి.

స్థానిక పార్టీలవుంచవలసిన ఫైళ్లు:-

(1) సభ్యత్వం (యాక్టీవు, అసోసియేట్ తప్సీళ్ళతో)

(2) జిల్లా, రాష్ట్ర పార్టీల నుంచివచ్చు సర్క్యులర్‌లు, రిపోర్టులు, ఉత్తరాలు

(3) తమ పార్టీనుంచి పై కమిటీలకు పంపిన రిపోర్టులు, ఉత్తరాలు వగైరా.

(4) పార్టి మెంబర్లుఇచ్చే తమపనిని గురించిన 15 రోజుల రిపోర్టులు. కాంగ్రెసు సంఘాలు, రైతు సంఘాలు, వ్యవసాయకూలి సంఘాలు, యువజన సంఘాలు, విద్యార్థి సంఘాలు, కార్మిక సంఘాలు, పార్టి మెంబరిచ్చే రిపోర్టును సంఘాలువారీగా ఫైలు చేయాలి. అంటే ప్రతి సంఘానికి ఒక ఫైలుండాలి.

(5) నవశక్తి ఫైలు

(6) నేషనల్ ఫ్రంటు ఫైలు & కాంగ్రెసు సోషలిస్టు ఫైలు

(7) వార్తాపత్రికల కటింగుల ఫైలు

5. జూన్ నెలాఖరులోగా స్థానిక పార్టీలు తమతమ తాలూకాల్లో సర్వసాధారణంగా ప్రజలకుండే ఇబ్బందులు ఏవో, ఏ యిబ్బందులమీద తాలూకా యంతటగాని, ఫిర్కాలలోగాని ఆందోళన ఉద్యమముల నడుపవచ్చునో వాటిని గురించి ఇంతవరకు ఏమిచేశారో, ఇప్పుడే స్థితిలోనున్నదో వెంటనే తెలియచేయాలి. స్థానికంగా కార్యక్రమం పనిచేస్తూంటే జిల్లాపార్టి వానన్నిటిని క్రోడీకరించి జిల్లా అంతట ఆందోళన జరుపుతుంది.

6. రాష్ట్రపార్టి తీర్మాన్నాననుసరించి (5-6-39) జిల్లాలో ఆయాచోట్లగల యెస్టేటు గ్రామాల ఇబ్బందులను వాటిని తొలగించుటకు ఆప్రజలుచేసిన కృషి, ఇప్పుడు పోరాట మేస్థితిలోనున్నది వెంటనే జూన్ నెలాఖరులోగా జిల్లా పార్టికి రాష్ట్రపార్టికి తెలియపఱచాలి.

7. 5-6-39 రాష్ట్రపార్టి సమావేశ తీర్మాననుసరించి పార్టీ పత్రికయైన "నవశక్తి"కి చందాదారుల వల్లగాని, విరాళాలవల్లగాని మన జిల్లా ప్రతినెల రు 75 లు వసూలుచేసిపంపాలి. ఈ సంవత్సరానికి ఇక 7 నెలలు నడపాలి. అందుకు రు 525 లు పంపాలి. జిల్లాలను ఈ క్రింది విధంగా 5 భాగములుచేసి ఆయా స్థానములనుంచి ఆయా నెలలలో నిర్ణయించినతేదీకి రు 105 లు పంపాలని జిల్లాపార్టి తీర్మానిస్తున్నది. స్థానికపార్టిలు దీనిని శ్రద్ధగా నిర్వర్తించాలి. అవసరమైతే అనెలలో స్థానిక పార్టి అంతటికి ప్రత్యేకంగా "నవశక్తి" పనే ఇవ్వవచ్చు.

రేపల్లె	జూన్—జూలై	రు 105/
తెనాలి	జూలై—ఆగస్టు	రు 105/
ఒంగోలు, బాపట్ల	ఆగస్టు—సెప్టెంబరు	..
గుంటూరు, సత్తెనపల్లి	అక్టోబరు—నవంబరు	..
నరసరావుపేట డివిజన్	నవంబరు—డిసెంబరు	..

ఆయా తాలూకాల్లోని పార్టిలు తమ కోటా చెల్లించవలసిన నెల వచ్చేలోపుగా చందాదారులను చేర్పించుటనే ఉండాలి. నవశక్తికి ఎంతమంది చందాదారులను చేర్పించింది. విరాళము ఎంత పోగుచేసింది జిల్లాపార్టి ఆఫీసుకు రిపోర్టు పంపాలి. ఈధనము వసూలు చేయటానికి జిల్లా కార్యనిర్వాహకవర్గ సభ్యులకు బాధ్యత ఈయబడింది.

పల్లెకోన వేసవి రాజకీయ పాఠశాల.



అధ్యాపక బృందము

పి. వి. శివయ్య, వావిలాల గోపాలకృష్ణయ్య, పి. నరసింహమూర్తి, కె. సత్యనారాయణ (నిలుచున్నవారు) రామమోహన్, మూర్తి



విద్యార్థులు

(b) పాతబాకీలన్నీ జూన్ నెలాఖరులోగా చెల్లించితీరాలి. తరువాత బాకీఉన్న సభ్యులపైన చర్య తీసికొనబడుతుంది.

8. మార్చినెల రాష్ట్రపార్టి సమావేశము తీర్మానంప్రకారం ప్రతి సోషలిస్టుపార్టి సభ్యుడు నెలకు రు 0-1-0 లు చొప్పున చందా రాష్ట్రపార్టికి ఇస్తుండాలి అట్లు ఇవ్వనివారు శిక్షణకు గురియగుదురు.

9. అఖిలభారత కాంగ్రెసు కాన్స్టిట్యూషన్ సబ్‌కమిటీయొక్క సూచనలు ప్రస్తుతనాయకత్వమే కాంగ్రెసులో స్థిరముగా నిల్చునట్లు చేయునవి గానున్నది 5వ ఆర్టికిల్ మత సంబంధమైన లేకుండా ఇతర సంస్థలలో నుండువారు గూడ కాంగ్రెసు కమిటీలలో నుండగూడదను సూచన వివిధములైన సామ్రాజ్య వ్యతిరేక సంఘాలలో పనిచేయుచున్న అతివాదులను కాంగ్రెసు సంస్థనుంచి వెళ్ళగొట్టుటకు బాగా ఉపయోగపడుతుంది. ఆర్టికిల్ 7 అఖిభారత కాంగ్రెసు సంఘంలో అతివాదులను రాకుండ కట్టుదిట్టము చేసినది. కాబట్టి పైసూచనలను రాబోవు అఖిలభారత కాంగ్రెసు కమిటీ సమావేశము ఆమోదించ గూడదని ఈ సమావేశము కోరుచున్నది. ఆసూచనలు కాంగ్రెసులో అవినీతిని తొలగింపజాలవు. పైసూచనలకు బదులు కాంగ్రెసు సంస్థలో ఎన్నికలకు నిలుచునే ప్రతి సభ్యుడు రాజకీయ పోరాటమును వృద్ధి చేయజాలునైనందిన కార్యక్రమమును కొనసాగించవలెననియు, అలా కార్యక్రమము కొనసాగించలేనివారు కాంగ్రెసులో ఏసంఘమునకు ఎన్నుకొనబడ కూడదని, సూచించుచున్నది. అ. భా. కాం. కమిటీ వెనుకటి మాదిరే ఎన్నుకొనబడవలెననియు చూచించు చున్నది.

10. అతివాదుల ఐక్యతయొక్క అవసరమును గుర్తించుతూను సోషలిస్టుపార్టి కమ్యూనిస్టులు ఇతర తీవ్రవాదులంతా అతివాద మహాసభకూడవలెనని చేసిన స్టేటుమెంటు సంతృప్తికరముగా నున్నది. లెఫ్టిస్టుకు అతివాదములు. పార్టిలకు కోఆర్డినేటింగు కమిటీగా ఉంచవలెననే సూచనను ఆమోదించు చున్నాము. అట్టి కోఆర్డినేటింగు కమిటీలు రాష్ట్రములకు జిల్లాకుగూడ ఉండవలెనని అభిప్రాయ పడుతున్నాము.

(పై తీర్మానములను రిపోర్టులను స్థానిక లేక తాలూకా పార్టిలు సమావేశమై చదివి వాటిపై తమ యభిప్రాయములను జిల్లాపార్టికి పంపాలి. విమర్శనలను పై కమిటీకి పంపినా, తీర్మానములను వెంటనే ఆచరణలో పెట్టాలి. తీర్మానములయొక్క కార్యక్రమముయొక్క లోపం ఆచరణలో ముఖ్యంగా చూపాలి. లేకపోతే ఆచరణలోపమని యెంచబడును. అందుకు తగిన చర్య తీసుకొబడును.)

గుంటూరు 16—6—39 — పి. వి. శివయ్య, జనరల్ సెక్రటరీ

కాంగ్రెసు వార్తలు

పశ్చిమ గోదావరిజిల్లా కాంగ్రెసు సంఘం

11-6-39 వ తేదీన పై కార్యనిర్వాహక వర్గం శ్రీ కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి గారి అధ్యక్షతను సమావేశమై గావించిన తీర్మానములలో కొన్నిటిని క్రింద ప్రకటించుచున్నాము:

1. 16-5-39 మొదలు 10-6-39 వరకు జరిగిన కార్యక్రమ నివేదిక చదువబడమైనది.

2. అకాల బలవన్మరణానికి గురియైన అల్లూరి రామకృష్ణంరాజుగారి మరణానికి సంతాపము వెలిబుచ్చుచున్నారు.

3. చిలుకూరి వీరభద్రరావు, బ్రహ్మర్షి మరణాలకు చింతిల్లుచున్నారు.

4. 1938—39 సం॥రమునకు తణుకు తాలూకా సంఘ అధ్యక్ష కార్యదర్శులైన శ్రీ యిందుకూరి సుబ్బరాజు, యివటూరి వీరబసవరాజుగార్లు ఏప్రియల్ 22 వ తేదీని నూతన తాలూకా కాంగ్రెసు కార్యవర్గ ఎన్నికలు జరిగినప్పటికిన్నీ, నూతన ఉద్యోగులకు యింతవరకూ రికార్డులు, జమాఖర్చులు వప్పగించనందులకున్నూ, వప్పజెప్పక పోవుటయేగాక జిల్లా కాంగ్రెసు సంఘాధ్యక్షుని తాఖీదులకు ఎట్టి సమాధానములు వ్రాయకపోవుటవల్లను జిల్లా కాంగ్రెసు సంఘాధ్యక్షులు పైవారిరువురను స్వయముగా కలసుకొని హెచ్చరించియున్ననూ, ఆహెచ్చరికను మన్నించి రికార్డుగాని, సొమ్ముగాని ఒప్పగించక పోయినందువల్లను, అధీనసంఘ ఉద్యోగులు పై సంఘముల ఆజ్ఞలను మన్నించకుండుట ఉల్లంఘించుండుట కాంగ్రెసు గౌరవమునకును అంగ నిర్మాణమునకును, కార్యక్రమమునకు, కాంగ్రెసు శిక్షణకు భంగకరముగా నున్నది. గాన శ్రీ యిందుకూరి సుబ్బరాజు, యివటూరి వీరబసవరాజుగార్లపై శిక్షణ చర్య తీసుకొనవలసినదనియూ, యింతటినుంచి 5 సంవత్సరములు కాంగ్రెసు సంస్థయందు బాధ్యతగల పదవులకు అనర్హులనిన్నీ, ఎట్టి బాధ్యతపనులకుగాని వీరిని నియోగించకూడదనియూ, ఈసభవారు రాష్ట్రకాంగ్రెసు సంఘ కార్యవర్గమువారికి శిఫార్సు చేయుచున్నారు.

యీ తీర్మానము విషయమై అవసరమైన ఉత్తర ప్రత్యుత్తరాలను రాష్ట్రకాంగ్రెసు సంఘమువారితో జరుపుటకు జిల్లా కాంగ్రెసు సంఘాధ్యక్షునికి సర్వాధికార మీయడమైనది.

5. జిల్లాబోర్డు సభ్యుల,ఎం. ఎల్. ఎ. ఋణముల రాజీబోర్డుల కాంగ్రెసు మెంబర్లకు తాము గావించిన పనిని గురించియు, తమ నియోజక వర్గములోని పరిస్థితులను ఆఫీసుకు యిన్‌ఫర్మేషనుకొరకు అధ్యక్షునిచే పంపబడిన ప్రశ్నావళులకు యింతవరకూ సమాధానము లివ్వని మెంబర్లు తాము జిల్లా కాంగ్రెసు సంఘము ద్వారానే ఆస్థానము లలంకరించితిమను విషయమును గమనించి, తమపనిని గురించి ఈ సంఘమునకు పంపుట తమ విద్యుక్తధర్మముగా భావించి యికమీదనైననూ వెంటనే జబాబులు పంపాలనియూ, రాష్ట్రకాంగ్రెసు తీర్మానముల ననుసరించి ప్రతిమెంబరు నెలవారీ రిపోర్టు ఆఫీసుకు పంపుచుండవలెనని జిల్లాబోర్డు మెంబర్లు మున్నగువారిని హెచ్చరించుచున్నారు.

6. యిరిగేషనుకు సంబంధించిన విషయములనుగూర్చి కార్యదర్శిగారే అవసరమైన యిన్‌ఫర్మేషను సంపాదించి జిల్లా కాంగ్రెసు కార్యవర్గమువారికి నివేదించవలసినదిగా ఈ సభవారు తీర్మానించడమైనది.

7. జిల్లాలోని వ్యవసాయ కూలీల ఆర్థిక పరిస్థితులను గురించి విచారించి వారి పరిస్థితులు బాగుపడుటకు అవసరమగు సూచనలు గావించుటకు ఉ. రామం, గొట్టిముక్కల వెంకన్న, దాట్ల సూర్యనారాయణరాజుగార్లను నియమించడమైనది. వీరికి సహాయం చేయుటకు అవసరమైనచో ఇద్దరు సభ్యులను కోఆప్టు చేసుకొనుట కధికార మివ్వడమైనది.

ఈ ఉపసంఘానికి శ్రీదాట్ల సూర్యనారాయణరాజుగార్ని కన్వీనరుగా నియమించడమైనది.

8. ప్రాథమిక సభ్యుల సభ్యత్వ రుసుము తాలూకు డబ్బును, ఎట్టి పరిస్థితులలోను,స్థానిక సంస్థల ఎన్నికలకు శాసనసభ్యుల ఎన్నికలకు యికముందు ఖర్చుపెట్టరాదని ఈసంఘమువారు తీర్మానించుచూ, ఆ ఎన్నికల ప్రచారమునకు కావలసిన ధనాన్ని విరాళముల పూర్వకముగా ప్రత్యేక నిధిని వసూలుచేసి ప్రచారం సాగించవలసినదని ఈసంఘంవారు తీర్మానించుచున్నారు. ప్రాథమిక సభ్యత్వ రుసుమును స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రచారమునకు ఖర్చు చేయకూడదనిన నిబంధనలను చేయవలసినదిగా ఈసంఘమువారు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘమువారిని కోరుచున్నారు.

9. సంఘ అధ్యక్ష కార్యదర్శులు ప్రయాణము చేయునపుడు ప్రయాణ ఖర్చులు అనగా రైలు, కారు వగైరా చార్జిలుగాక రోజు 1కి భోజనం వగైరా చార్జిలక్రింద 0-12-0 మించరాదని ఈసంఘంవారు తీర్మానించు చున్నారు.

10. పూళ్ళ పంచాయితీబోర్డు ఎన్నికలలో అధ్యక్ష స్థానమునకు కాంగ్రెసు అభ్యర్థిని ప్రస్తుత పరిస్థితులలో నియమించకూడదని ఈ సభవారు నిర్ణయించు చున్నారు.

11. రాష్ట్రకాంగ్రెసు కమిటీవారిచే ఏర్పాటు చేయబడుచున్న వాలంటీరు శిక్షణా శిబిరమునకు ఈ జిల్లానుండి 15 గురుని ఖర్చులుయిచ్చి పంపుటకు తీర్మానించడమైనది.

12. గ్రామకాంగ్రెసు సంఘాలను తనిఖీ చేసి వాటిచే పని చేయించుటకు ఆర్గనైజరుగా శ్రీ ఉద్దరాజు రామంగారిని ఏర్పరచుచూ తీర్మానించడమైనది.

13. జిల్లా కాంగ్రెసు నిబంధనావళిని తయారుచేయుటకు ఏర్పరచిన కమిటీ యింతవరకూ రిపోర్టు యివ్వకపోవుటకు ఈ సంఘంవారు చింతిల్లుచూ సబ్‌కమిటీ మెంబర్లు కనీసము వారికి నియోగించబడిన పనులను నిర్వర్తించుటకు సావకాశం లేనప్పుడు ఆవిషయమును సంఘానికి తెలిపి యితరవిధంగా సదరు కార్యమును పూర్తి గావించుటకు సంఘమునకు ఆవకాశమిచ్చుట కనీసము వారి ధర్మమని ఈ సంఘమువారు అభిప్రాయపడుచూ సదరు సంఘంవారు ఈ నెలాఖరులోగా రిపోర్టు అందజేయవలెనని సబ్‌కమిటీ మెంబర్లను హెచ్చరించడమైనది.

14. గత సంవత్సరం లెఖలు ఈనెలాఖరులోగా ఆడిట్ ఏర్పాట్లు గావించాలనియూ, సదరు ఆడిట్ రిపోర్టు వచ్చువరకు గత సంవత్సరపు జమాఖర్చుల చర్చను నిలుపుదల చేయడమైనది.

15. మునగాల రైతులకు సానుభూతి చూపుచున్నారు.

16. యీసంవత్సరం అగ్నిప్రమాదంవల్ల జిల్లాలో అనేక గ్రామముల రైతులు అపార నష్టములకు గురియైరి. గృహధన ధాన్యాదులను గోల్పోయి నిలువనీడలేక నిస్సహాయులైయున్న రైతులు ప్రభుత్వమునకు చెల్లించవలసిన పన్నులు చెల్లించ జాలరుగాన 1940 వ సంవత్సరం జనవరి వరకు పన్నులు వసూలు చేయుట నిలుపుదల చేయవలసినదిగా మద్రాసు ప్రభుత్వమురు కోరుచున్నారు.

17. లాహోరు కుట్రకేసులో 20 సంవత్సరములు శిక్షనంది యీమధ్యనే విడుదలయినట్టిన్ని అఖిలభారత కాంగ్రెసు కమిటీ సభ్యులున్ను అయిన శ్రీ విజయ కుమార్ సిన్హాగారి రాకసందర్భమున స్వాగతం ఇచ్చుటకు జిల్లాలో సంచార కార్యక్రమమును ఏర్పాటు చేయుటకును తీర్మానించడ మైనది.

తణుకు 14-6-39 — ఇట్లు, పేరిచేటి వెంకటరత్నం, సహాయ కార్యదర్శి

* * *

వెంకటగిరి టవున్ కాంగ్రెసు కార్యనిర్వాహక సమావేశము తే 21-6-1939 ది సా॥ 5 గంటలకు జరిగి ఈ క్రింది తీర్మానములు ఏకగ్రీవముగా అంగీకరించబడెను.

తీర్మానములు.

1. (ఏ) వెంకటగిరిటవున్ అరవ మాలలు 20-6-1939 దాఖలు చేసుకొన్న అర్జీనిచర్చించి సదరు అర్జీలోని విషయముల గూర్చి 26-6-1939 తేదీలోగా విచారించి రిపోర్టుచేయుటకు శ్రీ చర్ల గురునాధం, గట్టుపల్లి కామేశ్వర రావుగార్లను నియమించడ మైనది.

(బి) జమళ్ళ వెంకట సుబ్బయ్యగారు 25-5-39 తేదీ దాఖలు చేసిన అర్జీని చర్చించి ఇరుపార్టీలను విచారించి ఈ మాసము ఆఖరులోగా రిపోర్టుచేయుటకు శ్రీ చర్ల గురునాధం గట్టుపల్లి కామేశ్వరరావుగార్లను నియమించడమైనది.

2. వెంకటగిరి ఎస్టేటులో వర్షప్రతికూలముచే కలిగిన కాటక పరిస్థితిలో ఎస్టేటు యిలాకావారు పోలీసువారి సహాయముతో గ్రామాదులలో జరుపుతున్న అత్యాచారములను గర్హించుచు రైతులహక్కులకొరకు సకల విధముల సహాయము చేయుటకు తీర్మానించడమైనది.

3. జిల్లా లేబరు అడ్వైజరు కమిటీ మెంబరుగారి అర్జీని చర్చించి సదరు విషయములను అధికారులతో ఉత్తర ప్రత్యుత్తరముల జరుపుటకు శ్రీ అధ్యక్షులవారికి అధికార మివ్వడమైనది.

పొట్టిముత్యాలుగారి సుబ్బరామయ్య,
కార్యదర్శి,
టవున్ కాంగ్రెస్ సంఘం.

తూ. గో. జిల్లా రాజకీయ పాఠశాల ప్రారంభోత్సవము.

16-6-39 వ తేదీ ఉదయం 8 గంటలకు తూర్పు గోదావరిజిల్లా రాజోలు తాలూకా అంతర్వేది పాలెంలో రాజకీయ పాఠశాల ప్రారంభమయినది రైతులు, కూలీలు, విద్యార్థులు ఎఱ్ఱజెండాలతో రైతు కూలీ గీతాలను పాడుతూ స్వాతంత్ర నినాదాలుచేస్తూ ఉత్సాహంతో ఉత్సవంగా బయలుదేరి 9—30 లకు పాఠశాలవద్దచేరిరి అఖిలభారత ఏజన్సీ ప్రజల సంఘ ప్రధాన కార్యదర్శి, గత సంవత్సర స్కూలు ఆర్గనైజరు అగు శ్రీ పుసులూరి కోదండరామయ్య గారు జాతీయ పతాకము, ఎఱ్ఱజెండాలను ఎగురవేస్తూ ఆర్థిక రాజకీయ విజ్ఞానావశ్యకతను గూర్చి ఉపన్యసించేరు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోనుంచీ 40 మంది విద్యార్థులు పాఠశాలలో చేరారు.

15-6-39 వ తేదీని పాఠశాల నిర్మాణ వర్గంవారు నిర్వాహక కార్యక్రమంలో ఉండగా అంతర్వేదిపాలెం అసిస్టెంటు కరణము,రాజోలు హెడ్డుకానిస్టేబిలు, నలుగురు పోలీసులు, అనుమతిలేనిదే అక్రమంగా మస్త్రీడెస్‌లో బెదురు చూపులతో లోపల ప్రవేశించి కాళీగావున్న నోటీసుబోర్డు వగైరాలు పరీక్షించ నారంభించేరు. పాఠశాల నిర్వాహకవర్గంవారు బయటికి పొమ్మని చెప్పినా వెంటనేవెళ్ళక క్రమక్రమముగా జారిపోయేరు. 16, 17 తేదీలలోకూడా రహస్యంగా వచ్చారు. 17 వ తేదీని సర్కిల్ యినస్పెక్టరు కూడా గ్రామంలో ప్రవేశించేరు.

కార్యక్రమం

ప్రతిరోజూ ఉదయం	5—6-30	మిలిటరీడ్రిల్లు
	8—11-30	పాఠాలు
మధ్యాహ్నం	1—4-0	పాఠాలు
	4-30—6-0	మిలిటరీ డ్రిల్లు
రాత్రి	8—9-30	పఠనబృందము

కఱ్ఱ తుపాకులతో కవాతు నేర్పబడుచున్నది

* * *

గుంటూరుజిల్లా విద్యార్థి సంఘం

జిల్లా విద్యార్థిసంఘ కార్యదర్శి టి. వెంకటేశ్వరరావు ఆంధ్రరాష్ట్ర విద్యార్థిసంఘ జాయంటు సెక్రటరీ వై. వి. క్రిష్ణరావు జిల్లాలోని హైస్కూళ్ళలో విద్యార్థి సంఘాలు ఏర్పాటు చేయటానికి జూలై మొదటివారంలో సంచారం చేస్తారు కనుక తెనాలి, కొల్లూరు, రేపల్లె, తురుమెళ్ళ, దుగ్గిరాల, పొన్నూరు, నరసరావుపేట, సత్తెనపల్లి బాపట్ల విద్యార్థులందరు ఉత్సాహముతో పెద్ద మీటింగుల నేర్పాటు చేసి విద్యార్థిసంఘాలలో చేరుటకు సిద్ధంగా ఉండాలని కోరుచున్నాను. విద్యార్థి సంఘాల ఆవశ్యకత, నిర్మాణము, విద్యార్థుల బాధ్యతలను గురించి ఉపన్యసించ బడును.

ఇట్లు
టి. వెంకటేశ్వరరావు
జనరల్ సెక్రటరీ
గుంటూరుజిల్లా విద్యార్థి సంఘం

కృష్ణాజిల్లా రైతు సంఘం.

ది 18-6-39 రాత్రి 7 గంటలకు కృష్ణాజిల్లా రైతుసంఘ సాధారణ సభ్యుల సమావేశము శ్రీ కామినేని వెంకటప్పయ్యగారి అధ్యక్షత క్రింద జరిగి యీ క్రింది తీర్మానము లంగీక రింపబడినవి.

1. మునగాల రైతుల సత్యాగ్రహ పోరాటాన్నిగూర్చి యీరోజున ఆంధ్రరాష్ట్ర రైతు సంఘ కార్యనిర్వాహకవర్గము వారు అంగీక రించిన తీర్మానమును ఏకగ్రీవముగా అంగీక రించడమయినది.

2. తిరిగి సత్యాగ్రహము ప్రారంభముగుచో మునగాల రైతులకు సర్వవిధముల తోడ్పడుట కున్నూ, వెంటనే యీజిల్లాలో స్వయం సేవకులను చేర్చుటకును, మునగాల సత్యాగ్రహ నిధి వసూలు చేయుటకును, యిప్పటినుండీ ప్రజలలో మునగాల రైతుల సత్యాగ్రహ పోరాటాన్ని గురించి ప్రచారము చేయుటకున్నూ యీ సంఘమువారు తీర్మానించుచున్నారు.

3. మునగాల రైతుల సత్యాగ్రహమును గూర్చి ప్రచారముచేయుటకును, నిధిని వసూలు చేయుటకు జిల్లా సబ్ కమిటీ నొకదానిని యేర్పర్చడమైనది. ఈ క్రిందివారు సబ్ కమిటీ సభ్యులు 1. కామినేని వెంకటప్పయ్య 2. చలసాని వాసుదేవరావు 3. పేట బాపయ్యగార్లు.

5. ఈజిల్లా సబ్ కమిటీకి తోడుగా 9 తాలూకాలలోను తొమ్మిది తాలూకా సబ్ కమిటీలు యేర్పర్చడమైనది.

* * *

మునగాల రైతులయెడ సానుభూతి.

19—6—39 వ తేదీ రాత్రి 8 గంటలకు చెన్నూరివారిపాలెం గ్రామకాంగ్రెసు. రైతు సంఘముల సంయుక్త యాజమాన్యమున బహిరంగసభ జరిగినది. మునగాల ప్రజలు తమ జమీందారునివలన పడుచున్న యిక్కట్లను గురించియు, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘ ప్రధానకార్యదర్శి శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారి రాజీని గూర్చియు, ఆరాజీ ప్రకారము రైతులు తాము చెల్లింపవలసిన నిర్ణయములను చెల్లించుచున్ననూ జమీందారు రాజీని భగ్నపరచుటయు, సత్యాగ్రహమును గురించియు, తత్ఫలితముగా 17-6-1939 తేదీన రెవిన్యూ మంత్రి ప్రకాశంగారు ఆచార్య రంగా మున్నగు రైతు నాయకులతో యేస్టేటుకువెళ్లి ప్రజల యిక్కట్లను తెలిసికొని యిచ్చిన జవాబు మున్నగు నేటివరకు జరిగిన పరిస్థితులగూర్చి 18-6-39 తేదీన బెజవాడలో జరిగిన ఆంధ్ర రాష్ట్ర రైతుసంఘ కార్యనిర్వాహకవర్గ సమావేశమువారి తీర్మానమును గూర్చియు శ్రీ సుంకర సూర్యనారాయణ బి. ఏ. గారు ఉపన్యసించిరి. 18-6-1939 తేదీని బెజవాడలో ఆంధ్ర రాష్ట్ర రైతుసంఘ కార్యనిర్వాహక వర్గము వారు చేసిన తీర్మానమునకు తమ పూర్తి ఆమోదమును యీ సభవారు తెల్పిరి.

* * *

మునగాల రైతులయెడ టెక్కలి తాలూకా సవరుల సానుభూతి

యే 19-6-39 వ సాయంకాలము 3 గంటలకు టెక్కలి గ్రామంకు 5 మైళ్ళ దూరంలో నున్న బెల్లుకోల గ్రామంవద్ద టెక్కలి తాలూకా అన్ని యెస్టేట్లకు సంబంధించిన సవర రైతాంగము (కోయలు) సవర సంఘం అధ్యక్షులును తాలూకా కాంగ్రెసు సంఘ కార్యదర్శియునగు శ్రీమల్లి పెద్ది కృష్ణమూర్తిగారి అధ్యక్షతక్రింద సమావేశమైరి.

రైతు లోకం

మన ఆంధ్రదేశంలోనే గాక యావతు భారతదేశంలో రైతులు కలిసి మెలిసి మెట్లు వారి పౌరసత్వపు హక్కులగూర్చి యీనాడు సత్యాగ్రహము చేస్తూన్నారో, అందులో మన మునగాల రైతులు చేస్తూన్న అద్భుత సత్యాగ్రహ విషయమునుగూర్చి విపులముగా, చెప్పిరి. మునగాల జమీందారు అన్యాయముగాను, అక్రమముగాను చేస్తూన్న దుండగములు రైతులు సహించలేక కాంగ్రెసు ప్రభుత్వానికి తెలియజేసినప్పటికి కష్టాలు తీరకపోవుటచే, రైతులు సత్యాగ్రహము చేస్తూంటే పోలీసులు యించుకైన కనికరం లేక కాంగ్రెసు హయాంలోనే అమాయక రైతులపై లాఠీచార్జీ చేయడం చాలశోచనీయముగా నున్నదని చెప్పిరి పిమ్మట యీదిగువ తీర్మానమును యేకగ్రీవముగా అంగీకరించిరి.

"మదోన్మత్తులై జమీందార్లు అక్రమముగా రైతులపై లేనిపోని దుండగములు చేస్తూవుంటే సదరుబాధలు పడలేక ప్రభుత్వమునకు తెలియజేసినను మౌనంవాల్చుటచే వారి హక్కులను



మునగాల సత్యాగ్రహులు

కాపాడుకొనుటకై శాంతి పద్ధతులపై సత్యాగ్రహము చేస్తూన్న మునగాల రైతులపైనను, రైతుసేవకులపైనను కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పోలీసులు లాఠీచార్జీలు చేసి, అరెస్టులు చేయడము చాలా ఘోరమని యీ సభవారు అసమ్మతిని తెలియజేయుచున్నారు."

* * *

సత్యాగ్రహ కమిటీ తీర్మానం

మునగాల జమీన్ రైతు సత్యాగ్రహ కమిటీ మునగాలలో 22-6-39 వ తేదీ సమావేశమై యీ క్రింది తీర్మానము చేసినది.

తీర్మానం

18-6-39 తేదీన బెజవాడలో ఆంధ్రరాష్ట్ర రైతుసంఘము సమావేశమై మునగాల రైతుల సత్యాగ్రహమును గూర్చి గావించిన తీర్మానము ననుసరించియు, ఆ తీర్మానానుసారం మునగాల సత్యాగ్రహముగూర్చి తెలియపరచుటకు రివిన్యూ మంత్రిగారివద్దకు బోయిన రాయబార వర్గము వారిచ్చిన సలహా ననుసరించియు, మునగాల రైతుల సత్యాగ్రహమును విరమింప చేయుటకు తీర్మానించినది. గాన రైతులు తదనుసారంగా నడచుకోవలెనని కోరడమైనది.

జె. యిస్, రెడ్డి,
సత్యాగ్రహ కమిటీ ప్రెసిడెంటు.

ఏలూరు తాలూకా ప్రధమ వ్యవసాయ కూలీల మహాజనసభ, పాలగూడెం.

ది 17-6-39 తేదీని ఏలూరు తాలూకా పాలగూడెం గ్రామంలో సదరుతాలూకా ప్రధమ వ్యవసాయకూలీ మహాజనసభ జరుపబడినది. సదరు సభకు శ్రీ డేనియల్ స్మిత్ గారధ్యక్షులుగను, కామ్రేడ్ గారపాటి సత్యనారాయణగారు ప్రారంభకులుగను వుండిరి. సభాప్రారంభము నకు ముందు అధ్యక్షులను, తదితర ప్రముఖులను పుష్పమాలాంకృతులనుజేసి నగరసంకీర్తనము గావించిరి. తదుపరి శ్రీ పేటేటి వెంకటరత్నంగారిచే జండా ప్రతిష్ట చేయబడెను. ఉప్పు నారాయణమూర్తి. రంభా వెంకటప్పయ్య. కళ్లెం రామస్వామి. మాతంగి లక్ష్మయ్య. నక్కా చినవెంకయ్య. జి. కృపాలినిగార్లు ఉపన్యసించిరి. సభకు ఏలూరు తాలూకాలో సుమారు అన్ని ప్రాంతములనుంచిన్ని సుమారు 1000 కూలీలు, అభిమానులు హాజరైరి. సభాంతరము బ్రహ్మర్షి వెంకటరత్నం నాయుడు గారియొక్కయు, అల్లూరి రామకృష్ణంరాజుగారియొక్కయు మరణములను గూర్చి సానుభూతి తీర్మానమున్నూ, వ్యవసాయ కూలీలకు నియమిత కూలీ, కాల పరిమితి, ఋణ నివారణ చట్టమున్నూ త్వరలో కావలయుననియు, బంజరు భూములు సమిష్టి పద్ధతిని వ్యవసాయకూలీలకు యిప్పించవలయుననియు, ఇండ్ల వసతులు, మరుగు ప్రదేశ వసతులు, మంచినీటి వసతులు కల్పించవలయుననియు మొదలైన తీర్మానములు ఏకగ్రీవముగా ఆమోదింపబడెను. ఏలూరు తాలూకా వ్యవసాయ కూలీలసంఘముకూడా స్థాపించబడినది. సదరు సంఘమునకు 1 కామ్రేడ్స్ గారపాటి సత్యనారాయణ 2 రంభా వెంకటప్పయ్య 3 పసుపులేటి భుజంగరావు 4 పేటేటి వెంకటరత్నం 5 గోరుముచ్చు నాగయ్య 6 అట్ల లింగమూర్తి 7 జక్కంశెట్టి భీమయ్య 8 ముగ్గుళ్ళ మంగయ్య 9 కళ్లెం రామస్వామి 10 బొంతు వెంకటరెడ్డి 11 తోకల ఎలియా 12 మాకనబోయిన రామచంద్రయ్య 13 నక్కా చిన వెంకయ్యగార్లు కార్య నిర్వాహక సభ్యులుగా ఎన్నుకోబడ్డారు. కార్యనిర్వాహక వర్గ సభ్యులలోనుండి కామ్రేడ్ గారపాటి సత్యనారాయణగారిని అధ్యక్షులుగా ఎన్నుకొని మిగతా అధికారవర్గమును ఎన్నుకొనుటకు పై సభ్యులకు అనుమతి యిసంగిరి. ఆహ్వాన సంఘాధ్యక్షుని అభివందనములతో సభ ముగించిన వెనుక కొందరి ముఖ్య నాయకులకు గ్రామస్థులచే తను, అనగోపాలగూడెం హరిజనులచేతను అల్పాహార విందొసగబడెను.

* * *

ప॥గో॥ జిల్లా వ్యవసాయ కూలీసంఘం కార్యనిర్వాహకవర్గ ద్వితీయ సమావేశము పాలగూడెం.

ది 17-6-39 తేదీ శనివారము సాయంత్రము 5 గం॥కు పాలగూడెం హరిజన కచ్చేరీ చావడిలో కామ్రేడ్ గారపాటి సత్యనారాయణగారి అధ్యక్షతను సమావేశమై ఈదిగువ తీర్మానములను ఏకగ్రీవముగా నామోదించెను.

1. జిల్లా వ్యవసాయ కూలీసంఘ కార్యనిర్వాహకవర్గ సభ్యులలోనుండి కామ్రేడ్ అల్లూరి సత్యనారాయణగారు అధ్యక్షులుగాను, వీరవల్లి చంద్రశేఖరంగారు ఉపాధ్యక్షులుగాను, కామ్రేడ్ గారపాటి సత్యనారాయణగారిని కోశాధ్యక్షులుగాను, డేనియల్స్మిత్ గారు జిల్లా ఆర్గనైజరుగాను, మాతంగి లక్ష్మయ్యగారు జనరల్ కార్యదర్శిగాను, నెక్కలపూడి రామారావుగారు సహాయ కార్యదర్శిగాను ఎన్నుకోవడ మైనది.

2. జిల్లాసంఘ తాత్కాలిక ఆఫీసు ఏలూరులో ఏర్పాటు చేయుటకు తీర్మానింపబడినది.

3. ప్రణాళికను తయారు చేయుటకు ఈ దిగువ పేర్లు కలవారిని ఒక ఉపసంఘముగా నియమించడమైనది.

1 కామ్రేడ్ అల్లూరి సత్యనారాయణగారు
2. ,, గారపాటి సత్యనారాయణగారు
3. ,, కె. యస్. డేనియల్స్మిత్ గారు
4. ,, మాతంగి లక్ష్మయ్యగారు
5. ,, రంభా వెంకటప్పయ్యగారు

* * *

కృష్ణాజిల్లా సంయుక్త సమావేశం

18-6-39 వ తేదీని కృష్ణాజిల్లా కాంగ్రెసు, రైతు, యువజన, సోషలిస్టు వర్కర్లు ప్రొఫెసర్ రంగాగారి అధ్యక్షతను సమావేశమై, మునగాల సత్యాగ్రహులను అభినందిస్తూ, రాష్ట్ర రైతుసంఘమువారు చేసిన తీర్మానాన్ని బలపరిచారు.

*

కృష్ణాజిల్లా యువజన సంఘ కార్యనిర్వాహక వర్గం కడియాల గోపాలరావుగారి అధ్యక్షతను సమావేశమై ఇట్టి తీర్మానాన్నే గావించింది.

వెంకటగిరి రైతుల దీనావస్థ

పూర్తి రెమిషన్ కోరుతున్నారు రైతులు

వెంకటగిరి ఎస్టేటు రైతుల స్థితి ఘోరంగా ఉంది. గత సంవత్సరం వెల్లా తాలూకాలలో తప్ప తక్కిన ప్రదేశాలలో పూర్తిగా వర్షం లేక, పైర్లు యెండిపోవడము జరిగింది. చెరువులు తర తరాలనుండి రిపేర్లు లేక శిథిలావస్థలో వున్నాయి. శిస్తులు చెల్లించలేక రైతులు పడే బాధ వర్ణనాతీతం. పశు పోషణకు వారు పడు పాట్లు చెప్ప శక్యం కాదు. కూలీలకు పనులు లేక, తిండికై మల మల మాడుతున్నారు.

వ్యవసాయదారుల ఋణ నివారణ చట్టం ప్రకారం, 1347 ఫసలీ శిస్తులు 1938 వ సంవత్సరం అక్టోబరు మాసాంతములోగాను 1346 ఫసలీ శిస్తులు 1939 సెప్టెంబరు మాసాంతములోగాను చెల్లించినవారికి మాత్రమే పాత బకాయిలు రద్దు చేయబడతాయి. పైగా, 1348 ఫసలీ శిస్తులుకూడా 1939 జూన్ నెలాఖరులోగానే చెల్లించివేయాలి. ఇట్టి పరిస్థితుల్లో రైతులు 1347 ఫసలీకి గత సంవత్సరంలో పండిన స్వల్ప ధాన్యమును, నగలను విక్రయించి శిస్తులు పూర్తిగా చెల్లించారు. కాని, 1938—39 కి వర్షము బొత్తుగా కురవక పైర్లు ఎండిపోవడంవల్ల, మిగిలిన మొత్తాలు చెల్లించుట సాధ్యం కాకపోయింది. ఇట్టిపరిస్థితులలోనే ఉన్న రైత్వారీరైతులకు ప్రభుత్వం పూర్తి రెమిషన్ యిచ్చింది. ఎస్టేటు రైతులుకూడా రెమిషన్ కొరకు ఎస్టేటువారికి, సబ్ కలెక్టరుకు అర్జీలు పెట్టుకున్నారు. మొదట ఎట్టి రెమిషన్ ఇవ్వ నిరాకరించారు. దరిమిలాను కొద్దిగా పండిన మెట్ట భూములకు పూర్తి శిస్తులు చెల్లిస్తే, పండని మాగాణి భూములు తనిఖీచేసి రెమిషన్ యిచ్చెదమని ఎస్టేటువారు వాగ్దానము చేయడమువల్ల రైతులు ఎన్నెన్నో యిడుమలు పడి, పూర్తి పంట పండకపోయినా శిస్తులు పూర్తిగా చెల్లించివేశారు.

జబర్దస్తీ జప్తులు

ఇక 1348 వ ఫసలీకి ఎండిపోయిన మాగాణి భూముల శిస్తులుకూడా కట్టవలసిందని ఎస్టేటు ఉద్యోగులు తీవ్రమైన నిర్బంధములు ప్రారంభించారు. రైతుల రిపోర్టులు, విజ్ఞప్తులు అరణ్య రోదనమైనాయి. ఎస్టేటు నౌకర్లు జబర్దస్తీగా జప్తులు ప్రారంభించారు. సిపాయి దండులను గ్రామాలమీదికి పంపి రైతుల్ని భీతిగొల్ప సాగారు. ఇండ్లలో జొరపడి, అర్ధ గంజికై దాచుకొన్న నూకలు సహితం జప్తులుచేసి, బస్సులమీద వెంకటగిరికి రవాణాచేశారు. వెంకటగిరి తాలూకా తహసిల్దారుగారు సిపాయిలను, ఆడవి మనుష్యులను, పోలీసువారిని వెంటబెట్టుకొని, గ్రామాదులపైబడి, ఇండ్లలో ఆసామీలు లేకపోయినా జొరపడి, డిమాండు నోటీసులు యివ్వకుండానే ధాన్యము, చేతికి దొరకిన సామాన్లు, పశువులు, సేద్యపు పనిముట్లు—జప్తుచేసి, ఎట్టి రశీదులు యివ్వకుండానే వెంకటగిరికి రవానా చేయసాగారు. వెంపటివారి పల్లెలో ఒక రైతు యిల్లు తాళంవేసి ఎక్కడికో వెళ్ళిన సమయాన తాళం పగులగొట్టి, యింట్లో జొరపడి నాలుగు తూముల ధాన్యం, చెంబు తపేలా తీసుకుపోయారు. కానూరు గ్రామంలో పంటలు ఎండిపోయి ప్రజలు నానా అవస్థలు పడుతూన్నప్పటికీ, యీ నెల 2 వ తేదీన ఎస్టేటు రివెన్యూ ఇన్స్పెక్టరువచ్చి పండినంతవరకు ల్యాంచ్ రివెన్యూ చెల్లిస్తే మిగిలిన మాగాణి బంజరు శిస్తులకు మిజరా యిస్తామని వాగ్దానం చేయగా, రైతులు నానా తిప్పలు పడి శిస్తు చెల్లిస్తే, 6 వ తేదీని సిపాయిలు, పోలీసులు వచ్చి మిగిలిన శిస్తుకొరకు జప్తులు ప్రారంభించారు. పశువుల్ని బాదమోది స్వాధీనం చేసుకున్నారు ఆ దెబ్బలకు ఒక ఆవుకాలు విరిగింది. ఒక బర్రె చచ్చింది. ఇది అంతా జరిగిన తర్వాత, రైతులు ఎస్టేటు నౌకర్లను ఆటంక పరిచారని కోర్టులో కేసు ఆరోపించారు. ఇట్టి దౌర్జన్యాలు యింకా ఎన్నో ఉన్నాయి.

పోలీసుల సహాయం

ఎస్టేట్సు ల్యాండ్ ఆక్టు 80 వ సెక్షన్ ప్రకారం, జప్తీ కాలంలో శాంతికి భంగం కలిగే పరిస్థితులు ఎర్పడినప్పుడుగాని, జప్తీని ఆటంక పరచునప్పుడుగాని, పోలీసువారు తగు విధాముగా చర్య తీసుకొనవచ్చు. కాని, వెంకటగిరి పోలీసులు జమీందారుని



మునగాల సత్యాగ్రహులు

తాబేదార్లకు మద్దతుగా రైతులతో పూర్తిగా శిస్తు చెల్లించకపోతే తంతి ద్వారా మిలటరీని తెప్పించి అనేక హింసలకు గురి చేస్తాం అని అనేక గ్రామాలలో బెదరించి దౌర్జన్యాలు గావించారు. కొందరి యిండ్లలో ప్రవేశించి. లాఠీలు చూపించి జమీందారీ నౌకర్లకు సహాయ పడ్డారు.

రాయబారాలు

ఎస్టేటు రైతులు చీళ్ళ గురునాధం, కె యల్. నారాయణరావు వగైరాల నాయకత్వాన వెంకటగిరి సబ్ మేజస్ట్రీటుగారి సద్దకు రాయబారం వెళ్ళి, రైతుల అవస్థను విన్నవించారు. 3—6—39 వ తేదీని వెంకటగిరి తాలూకా, మల్లాం తాలూకా రైతులు కుమార రాజా గారిని దర్శించి, తమ బాధలు ఎరుకపరిచారు. చివరకు వెంకటగిరి తాలూకాలో రు. 5 ల రేటుకు పైన చెల్లించేవారికి రూ॥ 1 కి 0—6—0, మల్లాం తాలూకాలో రూ॥ 1 కి 0—4—0 చొప్పున రెమిషన్ యివ్వబడునని కుమార రాజా గారు తెలియజేశారు. ఇది అయినా, రైతు లింతవరకూ చెల్లించిన మొత్తాలను మెట్టతోటల శిస్తుకు మిజరా పెట్టుకొని, పూర్తి ఫలితం నాశనమైన మాగాణి నిల్వ శిస్తు మీద యిస్తామంటున్నారు.

పైరులు పూర్తిగా నాశనమై ఏమాత్రమూ చెల్లించలేని స్థితిలో ఉన్నప్పుడు పూర్తి రెమిషన్ యిప్పించవలసిందని రైతులు ఎంత మొరపెట్టుకున్నా లాభము లేకపోయింది. సచ్చే ఫలసాయంవరకైనా శిస్తువసూళ్లు ఆపమని రైతులు ప్రార్థించారు. కాని, రాజా గారి రాతి గుండె కరుగలేదు. 4—6—39 వ తేదీని వెంకటగిరి, మల్లాం రైతులు శ్రీ బద్దెపూడి వెంకటనారాయణ రెడ్డి (జిల్లా కాంగ్రెసు కమిటీ అధ్యక్షులు). కనుపర్తి నారాయణరావు(కార్యదర్శి), కమతం షణ్ముఖం ఎం.ఎల్.ఏ. గార్ల నాయకత్వాన సబ్ కలెక్టరుగారిని దర్శించారు. జమీందారు గారు చెప్పిన 0—6—0 కంటె ఎక్కువ రెమిషను యివ్వడానికి సాధ్యం కాదని ఆయన జవాబు చెప్పారు. జప్తీల సందర్భంలో ఇక ముందు పోలీసు వారి జోక్యం అనవసరంగా వుండదని మాత్రం హామీ యిచ్చారు.

14 వ తేదీని నెల్లూరు జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశమయి, ఎస్టేటు రైతుల రక్షణకై ఎట్టి చర్య అవసరమో విచారించి రిపోర్టుచేయుటకు శ్రీ బద్దెపూడి వెంకట నారాయణరెడ్డిగారు వగయిరా 5 గురితో ఒక ఉపసంఘాన్ని నియమించింది. 22 వ తేదీని ఎస్టేటువారొక ప్రకటన చేశారు. వెంకటగిరి, నాయుడుపేట, పోలూరు, మల్లాం, మనుబోలు తాలూకాలలో పంట నష్టమైన మాగాణి పొలాలకు 3 రూపాయల రేటుకన్న జాస్తి రేటు చెల్లించే రైతులకు రూపాయకు 8 అణాల చొప్పున రెమిషన్ యివ్వబడుతుందనీ; రెమిషన్ పోగా మిగిలిన శిస్తు 1939 జూలై నెలాఖరులోగా చెల్లిస్తేనే రెమిషన్ యివ్వబడుతుందనీ—ఆ ప్రకటనలో ఉంది.

అసలే ప్రజలు తిండిలేక బాధపడుతోంటే, పశుగ్రాసం కూడా లేక అల్లాడుతోంటే, రైతులకు పూర్తి రెమిషన్ యివ్వక, రూ, కు 8 అణాలు మాత్రమే యిచ్చి, మిగిలిన శిస్తు 5 వారాలలో చెల్లించి తీరాలని నిర్బంధించడం చాలా అక్రమం. ఈ విషయమై 7-7-39 వ తేదీని నాయుడుపేటలో జరుగబోయే జిల్లా జమీన్ రైతు మహాసభ సావకాశముగా చర్చించి, పూర్తి రెమిషన్కొరకు ఆందోళన చేయవలసి యుంటుంది.

మద్రాసు కార్మిక శాసనం

ప్రభుత్వానికి కొన్ని సూచనలు

కామ్రేడ్ కె. యల్. నరసింహం

మద్రాసు కాంగ్రెసు మంత్రివర్గము ఒక కార్మికశాసనమును తీసుకొని రాబోవుచున్నది. ఈ శాసనమును తీసుకొచ్చేందుకు, మంత్రివర్గము, కార్మిక ప్రతినిధుల, యజమానుల అభిప్రాయాలు ముందుగా తెలుసుకొన్నారు. ఆకార్మిక శాసనములోని ముఖ్యసూత్రములను తెలియజేస్తూ ఒక మెమొరాండం ప్రకటించారు.

ఈ మెమొరాండం రెండు భాగములు.

1. యజమానులకు కార్మికులకు వచ్చు తగాదాలను పరిష్కరించుటకు ఏర్పాట్లు, యజమానులకు, కార్మిక సంఘములకు వుండవలసిన సంబంధము.

2. కార్మికులకు నిరుద్యోగ భీమా వసతి.

మద్రాసు గవర్నమెంటు 22—10—37 వ తారీఖు నాటి ప్రకటనలో కార్మిక విధానమును ఈక్రింది విధంగా తెలియజేసారు.

1. కార్మిక తగాయిదాల సందర్భమున ఇరుపక్షాల వారి మధ్య, వారిలో వారికి రాజీకుదర్చడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది.

2. కష్ట నిష్ఠురాలను ముందరగా తెలియబరచి, కొంత సంప్రదింపులు జరిపిన తర్వాత గాని ప్రత్యక్ష కార్యక్రమమునకు దిగకూడదని ప్రభుత్వపు ఉద్దేశం.

3. రాజీ కుదరని సందర్భమున ప్రభుత్వమువారు కలుగజేసుకొని, పరిష్కారానికి శక్తివంచన లేక కృషి జేస్తారు.

మద్రాసు ప్రభుత్వం యిప్పుడు ప్రకటించిన మెమొరాండం కూడా యీ విధానమునే స్పష్టీకరిస్తూ వుంది.

కార్మిక తగాదాలు

(మెమొరాండంలో భాగం)

"రాబోవు శాసనము, ట్రేడ్‌యూనియన్ యాక్టును, ట్రేడ్ డిస్పూటు యాక్టును అభివృద్ధి పరుస్తుంది. తగాదాలు వచ్చినప్పుడు వారిలో వారే దానిని పరిష్కరించుకోవాలనే సిద్ధాంతముమీద యీ శాసనము ఆధారపడి ఉంది. వారిలో వారికి రాజీ కుదరని సందర్భములోనే గవర్నమెంటు స్వయంగాకాని, ఆఫీసర్ల ద్వారా కాని జోక్యం కలుగజేసుకొంటుంది. లేబరు కమీషనరు ప్రధాన పరిష్కారవేత్త. యజమానులకు, కార్మికులకు రాజీ కుదిర్చేందుకు ప్రయత్నిస్తారు. వారికి అధికారులనుగాని, ఇతర పెద్దలనుగాని పరిష్కర్తలుగా నియమించు అధికారముంది. పరిష్కర్త సలహాల ప్రకారం తగాదాలు పరిష్కరించబడితే, అది అంతటితో అంతమొందుతుంది. ఈ యాక్టు ద్వారా ఒక కోర్టు నియమించబడుతుంది. తగాదాలు పరిష్కర్త మూలంగా రాజీ కుదరని యెడల యిరుపక్షములు వారు కూడిగాని, ప్రత్యేకముగకాని ఆ కోర్టులో విచారణకు తీసుకొనిరావచ్చును. పరిష్కర్త కృషి ఫలించనప్పుడు రిపోర్టు ప్రకటించబడదు. కాని పరిస్థితులు ఏ విధంగా మారుతున్నది, యిరుపక్షములవారి అభిప్రాయములు గవర్నమెంటుకు తెలియజేయబడుచుండును. గవర్నమెంటు సాధారణంగా ఆ రిపోర్టులను ప్రకటించదు. కాని ఏ పక్షంవారైన పరిష్కర్తకు సరియైన అవకాశము యివ్వకుండా, మొండితనం జూపినప్పుడు, అట్టివాన్నిబట్టి ప్రజా సామాన్యంయొక్క ఒత్తిడి తీసుకొనివచ్చేందుకు, ఆ రిపోర్టులను ప్రకటించు అధికారం ప్రభుత్వానికి వుంటుంది. కావున తగాదాలను పరిష్కారము జేయుటకు **Permanent Machinery** ని ఏర్పాటు చేయుటకు గవర్నమెంటు తలపెట్టుచున్నది. జిల్లా కోర్టు మద్రాసులో సివిల్ కోర్టు జడ్జీలను పరిశ్రామిక కోర్టులుగా జేయబోతున్నాం అసెసర్ల (**assesors**) అధికారంలో తగాదా సంబంధమున్న కార్మిక ప్రతినిధి, యాజమానుల ప్రతినిధి ఆజడ్జీలకు సలహాలిస్తారు. పరిష్కార విధానంతో సంతృప్తి జెందనప్పుడు యీ కోర్టు నిర్ణయం సలహా మాత్రమే. పరిష్కార విధానము పూర్తియైన తరువాతగాని, పరిశ్రామిక కోర్టు తీర్పు అయిన తరువాతగాని ప్రత్యక్ష కార్యాచరణలోకి ఏ పక్షంవారైన దిగవచ్చును. కాని ఆ విధంగా ప్రత్యక్ష పోరాటమునకు దిగునప్పుడు, గవర్నమెంటుకు తెలియపరచాలి. అప్పుడు గవర్నమెంటు రెండవ పక్షంవారికి తెలియజేస్తుంది.

తగాదాలను పరిష్కరించుటకు మధ్యవర్తి సంఘమును ఏర్పాటు జేస్తాము (**Board of Arbitration**). ఉభయపక్షములవారు వ్రాతమూలకముగా కోరితేనే తప్ప మధ్యవర్తిసంఘమునకు తగాదా పోదు. కొన్ని పరిస్థితులలో కార్మిక తగాదాలను మధ్యవర్తి సంఘపు తీర్పుకు పంపుటకు గవర్నమెంటుకు అధికారమున్నది. మధ్యవర్తి తీర్పు ఉభయపక్షములవారు వొప్పుకొని తీరాలి. పరిష్కారవేత్తలద్వారా, పరిశ్రమ కోర్టుల ద్వారా తగాదా పరిష్కరించబడకపోయి, పరిశ్రమకు, ఒక తరగతివారి హక్కులకు హాని కలుగు పరిస్థితులలో గవర్నమెంటు నిర్బంధ మధ్యవర్తి తీర్పును ఏర్పాటు జేస్తుంది. (**Compulsory arbitration**) పూర్వపు అనుభవమువల్ల అట్టి హక్కులు గవర్నమెంటు చేతులలో వుండాలని ఋజువైంది."

కార్మిక సమస్యలు

మద్రాసు కాంగ్రెసు మంత్రివర్గము కార్మికశాసనము తీసుకొస్తున్నందుకు మా అభివందనాలు. ప్రభుత్వము సూచించిన రాజీ పద్ధతులు, పరిష్కార విధానముతో మేము పూర్తిగా అంగీకరిస్తూ వున్నాము. రాజీ పద్ధతులు, పరిష్కారవేత్త కృషి పరిశ్రమ కోర్టుల తీర్పులతో కార్మికులు సంతృప్తి జెందనప్పుడు కార్మికులకు సమ్మె జేయు హక్కు వుండాలి. పరిష్కార విధానము నెలరోజులకన్న ఎక్కువ తీసుకోకూడదనే నియామకముండాలి. ప్రధాన పరిష్కారవేత్త, ఆఫీసర్లను కాకుండా ఇతర పెద్దలకు పరిష్కర్తలుగా నియమించాలని సూచించుచున్నాము. ప్రభుత్వం మధ్యవర్తి సంఘమునకు తగాదాను తెలియజేసి, నిర్బంధ తీర్పు యిప్పిస్తామని సూచించారు. నిర్బంధ తీర్పువల్ల కార్మికులకు నష్టము కలుగుతుంది, పైగా ప్రత్యక్ష పోరాటమును కూడా అరికట్టుతుంది. ఇట్టివి శాసనములో వున్నయడల వాటిని అధికారులు దుర్వినియోగపరుచుటకు అవకాశముంటుంది. కావున గవర్నమెంటు అధికారుల చేతులలో అట్టి అధికారాలు వుంచకూడదు. మధ్యవర్తి బోర్డు, రెండుపార్టీలు కోరనిదే నియమించరాదని మాత్రమే వుండాలి.

పరిష్కార వేత్తను, నియమించుటకు, పారిశ్రామిక కోర్టు ఏర్పాటుజేయు సూచనలను మేము అంగీకరిస్తూ వున్నాము. ప్రభుత్వపు మెమొరాండంలో పరిష్కారవేత్త, తగాదా రాజీ కుదరనియెడల, తన రిపోర్టును బ్రకటించదని తెలియజేసారు. ప్రజాసామాన్యమునకు అట్టి తగాదాలలో ఏపక్షంవారిలో తప్పున్నదో తెలిసేందుకు, ప్రజాసామాన్యమువద్దనుంచి వత్తిడి వచ్చేందుకు రిపోర్టులు ఎల్లప్పుడు ప్రకటించాలనియే నిబంధన వుండాలని మేము కోరుతున్నాము.

ట్రేడ్ యూనియన్లు

యూనియన్ రికగ్నిషను విషయములో మెమొరాండములో యీ విధంగా ఉంది, "పై నుదహరించిన ఏర్పాటులతో పరిశ్రమలలోవచ్చు తగాదాలను పరిష్కరించుచూ గొప్ప ఫలితం పొందాలని గవర్నమెంటు అభిలాష. గవర్నమెంటు కార్మికులను ట్రేడ్ యూనియన్లలో జేరమని ప్రోత్సహిస్తుంది. ట్రేడ్‌యూనియన్లు సక్రమమైన పద్ధతులతో నడిస్తే, గవర్నమెంటు ఉద్దేశము నెరవేరుతుంది. కొంత సభ్యత్వంతో ఉన్న ట్రేడ్ యూనియన్లు రికగ్నైజుచేసి, కార్మిక సమస్యలన్నింటిలోను ఆ యూనియన్‌తో సంప్రదింపులు జేసేటట్లు జేస్తాము. రికగ్నైజుగాని యూనియన్లతోకూడా సంప్రదించుటకు యజమానులకు హక్కు ఉంది. రికగ్నైజు అయితే యజమానులు ట్రేడ్ యూనియనుతో తప్పనిసరిగా సంప్రదింపులు జేయాలి. ట్రేడ్ యూనియన్‌ను సంప్రదించకుండా కార్మికుల సర్వీసు పరిస్థితులలో మార్పులు జేయకూడదు బొంబాయి యాక్టులో వున్నట్లుగా సర్వీసు పరిస్థితులు నిర్వచిస్తాము. కొన్ని నియమాలకు లోబడి, సక్రమముగా పనిజేస్తూవున్న ట్రేడ్ యూనియన్లను గవర్నమెంటు రికగ్నైజు జేస్తుంది. సర్వీసు పరిస్థితులు తెలియజేస్తూ యజమానుల రిజిష్టర్లు తయారుచేయాలి. జిల్లా కలెక్టర్ల ఆఫీసులలో వాటి కాపీ లుంటవి. పరిశీలన పరిష్కార విధానములో వున్నప్పుడు ఏ పక్షంవారైన తొందరపడి కార్యాచరణకు దిగిన అట్టివారిపైన కొంత శిక్ష విధించబడును."

కార్మిక తగాదాల సందర్భములో వారిలో వారికి రాజీ కుదరాలంటే ఆ పరిశ్రమలోని ట్రేడ్ యూనియన్ను యజమానులు నిర్బంధముగా రికగ్నైజు చేయాలి. ఆ పరిశ్రమలో 10% సభ్యత్వముండి, ట్రేడ్ యూనియన్ యాక్టుక్రింద రిజిస్టరు అయిన ప్రతి ట్రేడ్ యూనియన్ను యజమానులు తప్పనిసరిగా గుర్తించాలి. కార్మికులను ట్రేడ్ యూనియన్ పనిజేస్తు వున్నందుకు యజమానులు తీసివేయకుండా

తగిన రక్షణలు వుండాలి. ట్రేడ్ యూనియనుల అధికారులు, కార్మికశాసనములను యజమానులు ఏవిధముగా అమలు జరుపుచున్నది పరీక్షించుటకు అవకాశముండాలి. ఫ్యాక్టరీయావరణములో చందాలు వసూలు చేయుటకు, కరపత్రములు పంచుటకు, పనివారలతో సంప్రదించుటకు ట్రేడ్ యూనియన్ అధికారులకు అవకాశములు పని లేని గంటలలో కలుగజేయాలి. సమ్మెల సందర్భములో యజమానులు కార్మికులను పోటీగా పెట్టుట నిషేధించాలి. సమ్మెలలో పోలీసుల కర్తవ్యము నిర్ణయించాలి. పోలీసులు యజమానులతో కలసి కార్మికులకు అనేక యిబ్బందులు కలుగ చేయకుండా వుండేటట్లు చూడాలి. గవర్నమెంటు రికగ్నైజు చేయుటకు గాను కొన్ని షరతులు పెట్టుచున్నట్లు మెమొరాండం సూచించుచున్నది. ట్రేడ్ యూనియన్ యాక్టు ప్రకారం పని చేసే ప్రతి యూనియన్ను గవర్నమెంటు రికగ్నైజు చేయాలి. వేరే షరతులు వుంచకూడదని తెలియచేస్తూ వున్నాము.

నిరుద్యోగ భీమా

హిందూ దేశములో కార్మికులకు నిరుద్యోగ భీమా వసతిలేదు. ఇతర కాంగ్రెసు రాష్ట్రములలోకూడా కార్మికులకు నిరుద్యోగ భీమా వసతి కలుగజేయుటకు కాంగ్రెసు మంత్రులు ప్రయత్నించలేదు. కాని మన మదరాసు కాంగ్రెసు మంత్రివర్గము నిరుద్యోగ భీమాను కలుగజేయుటకు ప్రయత్నించుచున్నందుకు మా హృదయ పూర్వక అభివందనాలు. నిరుద్యోగ భీమాను గురించి మెమొరాండములో యీ విధంగా వ్రాయబడి వుంది "బట్టలు మిల్లు పరిశ్రమకు మాత్రమే ప్రస్తుతము అమలుకు వచ్చును. (1) సంవత్సరమునకు రు. 960 సంపాదించువారు. (2) సంవత్సరమునకు రు. 600 ఆదాయము వచ్చువారికి (3) టెంపరరి పనివారలకు (4) వర్కుమెన్సు కాంపెన్‌సేషను యాక్టు, మెటర్నిటీ బెనిఫిట్టు యాక్టువల్ల సౌకర్యములను పొందువారు. (5) 15 సం॥ లోపల వయస్సు గలవారు. (6) 55 సం॥ పై వయస్సుగల వారికి యీ భీమా వర్తించదు. ఒక సంవత్సరము యీ భీమా కట్టినవారికే ఫలితము యివ్వబడును. కార్మికులకు తమవల్లకాని పరిస్థితుల వల్ల నిరుద్యోగము సంభవించినప్పుడే వసతులు పొందును. చెడుప్రవర్తనకు డిస్మిసు అయినవారికి, సమ్మెలలో వున్నవారికి భీమా వసతిరాదు. కార్మికుడు పనిచేయుటకు సిద్ధంగా వుండాలి. అతనికి పని దొరకుటకు వీలున్న పనియైకూడా వుండాలి. ఈ స్కీములో ముసలతనముల్ల, దెబ్బదగిలినందున జబ్బుచేసినందుకు నిరుద్యోగం వచ్చివారికి భీమావసతి వుండదు. ఉద్యోగము చూపినప్పుడు చేయుటకు నిరాకరించినా భీమావసతి వుండదు. కార్మికులు వారి పేర్లను రిజిస్టరు జేసుకోవాలి. వారికి పనిలేనప్పుడు పని జూపించు బాధ్యత ప్రభుత్వంది. కార్మికుడు రూపాయికి ఒక కాని చెల్లించాలి. యజమానికూడా కార్మికుని తరపున కార్మికుడు చెల్లించినంత చెల్లించాలి. దానికి గవర్నమెంటు కొంతధనమును కలుపుతుంది."

ఈ నిరుద్యోగ భీమా ఒక పరిశ్రమవరకే నియమించుచున్నారు. కాని అన్ని పరిశ్రమలలో పనిచేయు కార్మికులకు యిట్టి అవకాశములను కలుగచేయాలని ప్రభుత్వమును కోరుచున్నాము. కార్మికులను పనిలోనుండి డిస్‌మిస్ చేసినందుకు భీమావసతి వుండదనుట ధర్మము కాదు. యజమానులు అన్యాయంగా డిస్‌మిస్ చేసినంత మాత్రమున భీమా వసతి నిరాకరించుట భావ్యము కాదు. కాబట్టి ఉద్యోగమునకు రాజీనామా యిచ్చినా, డిస్‌మిస్ కాబడినా ఈసౌకర్యమును పొందేటట్లు వుండాలి.

ఈ కార్మిక శాసనములో చాలా ముఖ్యమైన విషయములు వదలివేయబడినవి. పని చేయు గంటలను తగ్గించి అన్ని పరిశ్రమలలో పని చేయు కార్మికులకు తగిన సమపాయాలు కలుగచేయాలి. రోజుకు 8 గంటల పని; ముసలితనములో, జబ్బులలో వున్నప్పుడు తగిన సౌకర్యములకు శాసనములు చేయాలి. ప్రతి పరిశ్రమలోను సర్వీసు పరిస్థితులను నిర్ణయించుటకు తగిన ఏర్పాట్లు చేయాలి. పారిశ్రామిక కార్మికులకు ఋణ నివారణ వసతులను ఏర్పాటు చేయాలి.

మొత్తం మీద అన్ని రాష్ట్రములలో కార్మిక శాసనముకన్న అభివృద్ధికరముగా వున్నదని తలుస్తూ వున్నాము. ఈ శాసనము మద్రాసురాష్ట్రములో ట్రేడ్ యూనియను ఉద్యమమును బలపరుస్తుందని నమ్ముచున్నాము. మేము యిచ్చిన సూచనలను కూడా అంగీకరించి సమగ్రమైన కార్మిక శాసనమును మద్రాసు కాంగ్రెసు మంత్రివర్గము చేస్తుందని నమ్ముచున్నాము.

బెజవాడ

ఆంధ్రవాణి ప్రెస్ పనివారలను అకారణముగా పనిలోనుంచి తొలగించుట

ఈ ప్రెస్‌లో సుమారు 15 మంది పనిచేయుచున్నారు. సుమారు $1\frac{1}{2}$ సం॥ నుంచి శలవు దినమగు ఆదివారం పనిచేసినయడల 6 గంటలకు రోజుగా పరిగణింపబడుచున్నది. కాని 25 జూన్ ఆదివారంనాడు పనిచేయించుకొని $8\frac{1}{2}$ గంటలు చెయ్యవలెనని యజమాని పేచీ పెట్టాడు, సోమవారమునాడు పనిలోకి వెళ్ళగా పనివారెవ్వరు తనకు అవసరం లేదని, తనకు బంధువులగు ముగ్గురిని మాత్రమే పనిలోకి తీసుకొని మిగిలినవారిని బయటికి పొమ్మనెను. వారికి ఇవ్వవలసిన జీతాలు వచ్చే నెల 5 వ తేదీలోపు ఇస్తానని వెళ్ళిపొమ్మన్నాడు. కాని మిగిలిన పనివారందరు ప్రెస్సులోనే నిలబడి వుండిరి.

శ్రీ విజయవాడ ఎడ్లబండ్ల సంఘ సమావేశము

ఈ నగరమునందు కొన్ని దినములనుంచి శలవు దినము "ఆదివారమా, అమావాస్యయా" అనే సమస్య ఉండెను. నేటికి జిల్లా అధికారులు జోక్యము కలుగచేసుకొని 'అమావాస్యయే' శలవుదినమని తీర్పు చెప్పుటచే అమావాస్యయే శలవు దినముగా నిర్ణయించుకొన్నారు. ముఠాపనివారల సంఘ యాజమాన్యమున విజయవాడ ఎడ్లబండ్ల ముఠా పనివారల సంఘముల యాజమాన్యమున 15 వ తేదీన కార్మికులు పనులు మానుకొని పుర వీధులయందు బ్యాండు వాయిద్యములతో గొప్ప ఊరేగింపు జరిపిరి.

సాయంత్రం $4\frac{1}{2}$ గంటలకు కొత్తపేటలో గొప్ప బహిరంగసభ జరిగెను. ఈసభకు పోతిన గణపతిరావు పాత్రుడుగారు (మునిసిపల్ ఉపాధ్యక్షులు) అధ్యక్షత వహించిరి.

ఈసందర్భమున ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘ ప్రధాన కార్యదర్శి గొట్టిపాటి బ్రహ్మయ్యగారు కార్మికుల గురించి, కాంగ్రెసు గురించి గంభీరోపన్యాసమొసంగిరి.

డిమిట్రాఫ్ జన్మదినము

జూన్ 18 ప్రెస్ వర్కర్సు షేగా, బెజవాడ, బందరు, యేలూరు, అంతర్వేదిపాలెములలో జయప్రదముగా జరిగినది. బెజవాడలో శ్రీ పోతిన గణపతి రావుగారు (వైస్ చెయిర్మను) కనీసపు కోర్కెలను బలపరచిరి.

కాకినాడ

రంగా అండ్ కో., ప్రెస్ పనివారల సమ్మె.

పట్టణ కాంగ్రెసు అధ్యక్షుని సానుభూతి.

ఈ ప్రెస్‌లో పనిచేయువారికి నెలజీతములు బకాయి పడినవి. మిగిలిన ప్రెస్‌లలో మాదిరిగా ఆదివారము దినమంతయు శలవులేదు. ఒక పూట శలవు. పనిచేసే గంటలకు కూడ నియమములేదు.

ప్రెస్ యజమానిని తమ జీతము లివ్వవలసినదిగా కోరగా ఒక పనివానిని పనినుండి తొలగించెను. అందువలన 16 తేదీన సమ్మె ప్రారంభం చేయవలసి వచ్చింది. సంఘాధ్యక్షులు యజమానివద్దకు పరిష్కారమునకై వెళ్ళినను లాభము లేకపోయింది. అందువలన సమ్మె సాగుచున్నది. పనివారలకు సానుభూతి చూపుచూ బహిరంగ సభలు జరుగుచున్నవి. ఒక బహిరంగ సభకు పట్టణ కాంగ్రెసు అధ్యక్షులు అధ్యక్షత వహించిరి.

పనివారల కనీసపు కోర్కెలు.

(1) రోజుకు 8 గం॥ మించని పని.

(2) ఆదివారం పూర్తి శలవు.

(3) ప్రతి నెల మొదటి వారంలో జీతములు యివ్వాలి.

(4) ప్రతి నెల 20 వ తేదీలోపు అడ్వాన్సు లివ్వాలి.

విశాఖపట్టణం

రాలీ బ్రదర్సు కంపెనీ కూలీల సమ్మెలు

రాలీ బ్రదర్సు కంపెనీలో బస్తాలు మోయు కూలీలు సుమారు 200 మంది 13 వ తేదీనుంచి సమ్మె జరుపుచున్నారు. పూర్వమునుండియు వారు బస్తాలను "హుక్" అను ఉపకరణముతో యెత్తి జేరవేయుచుండిరి. వారా విధమున రోజునకు సుమారు ఒక్కొక్కరు 100 బస్తాలు సునాయాసముగా మోయ గలిగిరి. రోజునకు మనిషి 1కి రూపాయి కూలి పొందుచున్నారు. ఆ దినమున అవిసెగింజల బస్తాల నా విధముగానే మోయుచుండగా కంపెనీ యజమానులు దానివలన బస్తాలు చెడిపోవుచున్నవనియు, గింజలు వొలికి పోవుచున్నవనియు సాకుచూపి ఆ పద్ధతి మానివేయవలెనని యాజ్ఞాపించిరట కూలీలు ఆ విధముగా చేసిన యెడల తాము దినమునకు పావులా డబ్బులుకూడ సంపాదింపజాలమనియు, కంపెనీవారి యాక్షేపణ కేవలము నిరాధారమనియు చెప్పినను లాభములేక పోవుటచే సమ్మె ప్రారంభించిరి.

కంపెనీవారు నిన్న సాయంకాలము భీమునిపట్టణం నుంచి సుమారు వందమంది కూలీలను తెప్పించి పని చేయించుకొనుచుండిరి. సమ్మె చేసిన కూలీలు విశాఖపట్టణ పోర్టు అండు హార్బరు కార్మిక సంఘమువారి సహాయమున తమకు పోటీగా పనిచేయ వచ్చినవారిలో సుమారు 25 మందిని బ్రతిమాలి నిన్నటిరాత్రి మరల భీమునిపట్నమునకు బండ్లలో పంపిరి.

తరువాత 18 వ తేదీన కంపెనీ యజమానులు మామూలుగా 'హుక్' సహాయముతో బస్తాలను ఎత్తుటకు అంగీకరించిరి. అందువలన సమ్మె అపువేయబడింది.

అఖిల భారత కాంగ్రెసు కమిటీ సమావేశము

24-6-39 వ తేదీని బొంబాయిలో అఖిల భారత కాంగ్రెసు కమిటీ సమావేశమయింది. బాబూ రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించాడు కాంగ్రెసులో ఐక్యతను గురించీ, కాంగ్రెస్ వాదులలో డిసిప్లిన్‌ని గురించీ, రాజేంద్రప్రసాద్ ప్రారంభంలో ఒక ప్రకటన గావించాడు ప్రస్తుత జాతీయ, అంతర్జాతీయ విషమావస్థలో, వర్కింగుకమిటీ మోయవలసిన భారం ఎంతో ఉన్నదన్నాడు. భారతదేశపు సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని అభిలషించేవారంతా, కాంగ్రెస్ సంస్థయొక్క శక్తినీ, డిసిప్లిన్‌నీ యినుమడింపజేయాలని హెచ్చరించాడు. అందుకై కాంగ్రెసువాదులు పరస్పర భేదాభిప్రాయాలను మరచి, కలసి పనిచేయాలని కోరాడు ముందురాబోయే స్వరాజ్య పోరాటానికి దేశాన్ని తయారుచేయాలంటే, వర్కింగ్ కమిటీపై అ. భా. కాం. కమిటీకి సంపూర్ణ విశ్వాసం ఉండాలన్నాడు. కాని, దేశంలోను, కాంగ్రెసులోను నేడు వ్యాపించియున్న స్పర్ధలు మన ఉద్యమాన్ని బలహీనపరుస్తున్నా యన్నాడు. దేశంయొక్క స్వాతంత్ర్యాన్ని, ఐకమత్యాన్ని, కోరే ప్రతి భారతీయుడు వినాశకరమైన శక్తుల్ని ఎదుర్కొని, అంతఃకలహాలను రూపుమాపితేగాని కాంగ్రెసులోను, దేశంలోనుఉన్న "సాధ్యమైన సరకు" (Vital elements) సరిగా పనిచేయజాలదన్నాడు. ఈ ఆశయాన్ని దృష్టిలో ఉంచుకొనే వర్కింగ్ కమిటీవారు తమ కర్తవ్యాన్ని నెరవేర్ప పూనుకున్నారు. కాబట్టి కాంగ్రెస్ వాదులంతా వర్కింగ్ కమిటీతో సహకారం చేయాలని హెచ్చరించాడు.

ప్రపంచ యుద్ధం త్వరలోనే రావచ్చును' ఇండియానుకూడా ఆ యుద్ధంలో పాల్గొనేటట్లు చేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం సన్నాహాలు గావిస్తోంది. ఇండియా అక్టు సవరణ చట్టం అట్టి సన్నాహాలలో ఒకటి. దాని ప్రకారం, అధికారం అంతా బాధ్యతా రహితమైన కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉంటుంది. కాబట్టి, సామ్రాజ్య యుద్ధంలోకి మనల్ని యీడ్వడానికి చేసే ప్రయత్నాలను ఎదుర్కొనవలసి యుంటుంది. వలస రాజ్యాలలో మన భారతీయులు దుర్భర స్థితికి వస్తున్నారు. సింహళంలో అనేక వేల భారతీయులకు అన్యాయం జరిగే శాసనాలు చేయబడుతున్నాయి. బెల్జియన్ కాంగోలో భారతీయ వర్తకులు అనేక కష్టాలకు గురి అవుతున్నారు. తూర్పు ఆఫ్రికాలో మన దేశీయుల్ని వేరుచేసి నానా హింసలు పెడుతున్నారు. దక్షిణ ఆఫ్రికాలో యూనియన్ ప్రభుత్వం అనేక ఒడంబడికలకు విరుద్ధంగా భారతీయుల్ని ప్రత్యేకించి వారిని అవమానాలకు గురిచేస్తూంది.

ఇక మన సంస్థానాల విషయం. చాలామంది సంస్థానాధీశులు క్రూర నిర్బంధ విధానాన్ని చేబట్టారు. ఒరిస్సా, కథియవాడ్ మొదలైన ప్రదేశాలలో అమానుషమైన హత్యాకాండ చెలరేగుతోంది. అనేకమంది మృత్యు దేవతకు బలిఅవుతున్నారు. వేలతరబడి జనం గ్రామాలు విడిచిపెట్టి పారిపోతున్నారు. సంస్థాన ప్రజల పోరాటం భారత జాతీయ పోరాటంలో ఒక భాగంగా వర్కింగ్ కమిటీ గుర్తిస్తూంది. త్రిపురీ కాంగ్రెస్‌లో సంస్థానాలకు సంబంధించిన తీర్మానాన్ని బట్టే వర్కింగ్ కమిటీ నడుస్తోంది. సంస్థాన ప్రజాపోరాటం యొక్క భారం సంస్థాన ప్రజలమీదే ఉండాలి. అనేక పర్యాయాలు బ్రిటిష్ ప్రభుత్వం నిరంకుశ ప్రభువులకే సహాయంచేసి ప్రత్యక్షంగా ప్రజల్ని హింసించింది. ఫెడరేషన్ వస్తే యెట్టి ప్రమాదం సంభవిస్తుందో నిరూపించడానికి యిదొక తార్కాణం. "నేడు ఫెడరేషన్ మన ప్రధాన సమస్య కాకపోయినా మనపై దాన్ని రుద్దడానికి ప్రయత్నాలు చేయబడవచ్చు. ఆ విధంగా రుద్దబడితే, మనం అంతా దాన్ని ఎదుర్కొని తీరాలి. అందుకై దేశాన్ని తయారుచేయాలి.

ఇండో-బ్రిటిష్ వర్తకపు ఒడంబడిక ద్వారా భారతీయ రైతాంగానికి, దేశీయ పరిశ్రమలకూ, తీరని అపకారం జరుగుతోంది. ఇంకా అనేక సందర్భాలలో బ్రిటిష్ ప్రభుత్వం భారతీయ ప్రజాభిప్రాయాన్ని ధిక్కరిస్తూ, బ్రిటిష్ వ్యాపారస్తులకు లాభం చేకూర్చుతోంది. ఇట్టి ఘటనలు అభివృద్ధికి అడ్డుగోడలవంటివి. వాటికి కారణాలయిన జాతి, మత స్పర్ధలను నిర్మూలించడానికి ప్రతి కాంగ్రెసువాదీ పూనుకోవలసి యుంటుంది.

ఇవీ, యింకా ఇతర ప్రధాన సమస్యలు. ఎన్నో నేడు మనల్ని ఎదుర్కొంటున్నాయి. వీటిని పరిష్కరించాలంటే, మొదట మన యిల్లు శుభ్రముగాఉండాలి. నేడు కాంగ్రెసులో ఎన్నో స్పర్ధలున్నాయి. వినాశనకరమైన కాంగ్రెసు ప్రతికూల శక్తులు నేడు కాంగ్రెసులో ఉన్నాయి. వాటిని నిర్మూలించి, సంస్థను బాగు చేయడానికి కాన్‌స్టిట్యూషన్ సబ్‌కమిటీవారు నియమావళిలో కొన్ని సూచనలు గావించారు. కాంగ్రెసువాదు లెవరూ ఇతర జాతీయ ప్రతికూల సంస్థలలో పాల్గొనకుండా నిషేధిస్తూ క్లాజు 5 (c) ని మార్పుచేయాలని ఆకమిటీ సూచించింది. కాని, కొందరు కాంగ్రెసువాదులు యీమార్పును అనుమానంతో చూస్తున్నందువల్ల ప్రస్తుతం వర్కింగ్ కమిటీ దాన్ని విడిచివేసింది. కొందరు కాంగ్రెస్ వాదులు — సంస్థలో ప్రధానస్థానాన్ని అలంకరించిన వారు సహితం — కాంగ్రెస్ డిసిప్లిన్‌కి వ్యతిరేకంగాను, సంస్థకు హానికలిగించే రీతిని, ఇదివరలో ప్రవర్తించియున్నారు. అట్టి విధానం యికముందుకూడా సాగితే, కాంగ్రెసు నిర్వీర్యమయిపోక మానదు. ఏ కాంగ్రెసువాది అయినా బుద్ధిపూర్వకంగా కాంగ్రెసు సంస్థను అవమానపరిస్తే, వానిపై డిసిప్లినరీ చర్య తీసుకొని తీరాలి.

వలసదేశాలలో భారతీయులు

అధ్యక్షుడు పై ప్రకటన గావించిన తర్వాత తీర్మానాలు చర్చకువచ్చాయి. భారతీయుల్ని ఉద్యోగాలనుండి తొలగించడానికి సింహళ ప్రభుత్వం చేయబోయేశాసనం మిక్కిలి ఆందోళన పడచేదిగా ఉన్నది కాబట్టి, ఆప్రభుత్వంతో సంప్రతించి ఒక ఒడంబడికకు రావడానికి జవహర్లాల్ నెహ్రూను నియమిస్తూ మొదట తీర్మానము డాక్టరు పట్టాభిగారిచే ప్రతిపాదించబడి, ఏకగ్రీవంగా ఆమోదించబడింది.

స్మట్సు—గాంధీ ఒడంబడికకు, కేప్‌టవున్ ఒడంబడికకు, ఫీధాం కమిషన్ సిఫార్సులకు విరుద్ధంగా దక్షిణ ఆఫ్రికా ప్రభుత్వం భారతీయుల్ని వెలివేసే విధానాన్ని మార్చుకోవలసినదిగా హెచ్చరిస్తూ తరువాత తీర్మానం బులాభాయి దేశాయిచే ప్రతిపాదించ బడింది. సత్యమూర్తి బలపరిచాడు. దక్షిణాఫ్రికాలోని భారతీయులు నీగ్రోలతోను, అంబులతోను కలసి బ్రిటిష్ ప్రభుత్వంయొక్క జాతి వైషమ్య విధానాన్ని ఎదుర్కోవాలని కోరుతూ డాక్టర్ రాంమనోహర్ లోహియా (సోషలిస్టు) ఒక సవరణను ఉపపాదించాడు. జవహర్లాల్ నెహ్రూ బలపరిచాడు. బులాభాయి దేశాయి సవరణను అంగీకరించాడు. సవరణతోకూడిన తీర్మానం ఆమోదించబడింది.

కాని, యీ సవరణ గాంధీగారికి యిష్టం లేదు. దాన్ని అంగీకరిస్తే దక్షిణాఫ్రికాలోని భారతీయులకు అనేక యిబ్బందులు వస్తాయి కాబట్టి దాన్ని తొలగించవలసినదిగా గాంధీగారు వుత్తరం వ్రాసి పంపారు. వెంటనే నెహ్రూ తన సవరణను ఉపసంహరించుకొన్నాడు. బూలాభాయి తన మొదటి తీర్మానాన్నే మళ్లీ ప్రవేశపెట్టాడు. దాన్ని కమిటీ ఆమోదించింది.

కాంగ్రెస్ నియమావళిలో మార్పులు.

కాంగ్రెసు ఎన్నికలలో వోటుచేసే హక్కు రావడానికి ప్రతిప్రాథమిక కాంగ్రెసు సభ్యుని పేరు 1 సంవత్సరానికి ముందుగా రిజిష్టరులో నమోదు అయి ఉండాలి, అని పండిట్ బాలకృష్ణ శర్మ ఒక సవరణను ప్రతిపాదించాడు. ఎప్పుడైతే ఒక వ్యక్తి కాంగ్రెసులో చేరాడో అప్పుడు అతనికి ఓటింగుహక్కు ఉండటం న్యాయం. అదే ప్రజాస్వామిక సూత్రం. కాబట్టి సవరణను వ్యతిరేకిస్తూ యన్. జి. రంగా, అచ్యుతపట్వర్ధన్ స్వామీ సహజానంద, ఆచార్య నరేంద్రదేవ్, ఎం. ఎన్. ఆనీ, గారలు ఉపన్యసించారు. మోహన్‌లాల్ సాగ్జేనా అసలు తీర్మానాన్ని బలవరుస్తూ సోషలిస్టుల్ని దుమ్మెత్తిపోశాడు. నెహ్రూ, బోసులు సాగ్జేనాకు జవాబుచెప్పాలని అధ్యక్షుని అనుమతి కోరారు. అతడు సభ్యుల విచక్షణకు విడిచివేశాడు. చర్చను ముగించడానికి 84 గురు, సాగించడానికి 60 మంది వోటుచేశారు. కాబట్టి నెహ్రూ బోసులు ఉపన్యసించలేక పోయారు. సవరణకు 119 గురు అనుకూలురు, 87 గురు వ్యతిరేకులు. వ్యతిరేకించిన వారిలో నెహ్రూకూడా ఉన్నాడు.

3 సంవత్సరాల నుంచీ కాంగ్రెసు సభ్యుడుగా ఉండనిదే ఎవరూ, ఏ కాంగ్రెస్ కమిటీకి ఎన్నుకొన బడకూడదని కృప్లానీ తరువాత సవరణను ప్రతిపాదించాడు. స్త్రీలకూ, అల్పసంఖ్యాకులకూ, హరిజనులకూ, విడుదల అయిన రాజకీయ ఖైదీలకూ, యీ నియమం వర్తింప జేయకూడదని భూపేంద్రనాధ సన్యాల్, బాలకృష్ణశర్మగారలు, సవరణలు ప్రతిపాదించారు చర్చ ఆరోజుకు ముగిసింది. మర్నాడు మూడు సంవత్సరాల నియమం కాంగ్రెసు మంత్రులకూ, పార్లమెంటరీ కార్యదర్శులకూ, శాసనసభ్యులకూ, మాత్రమే వర్తించాలని కె. యఫ్. నారిమన్‌గారొక సవరణ తెచ్చారు. కాని, అధ్యక్షుడు దానిపై రూలింగ్ యిచ్చి, ప్రత్యేక తీర్మాన రూపంలో ప్రతిపాదించడానికి అనుమతించాడు.

బ్రిటిష్ సరకులలోగాని, విదేశీ బట్టలలోగాని, కల్లు — సారాయిలలోగాని వ్యాపారము చేసేవారు, కల్లు—సారాయి త్రాగేవారు ఏ కాంగ్రెసు కమిటీకి ఎన్నుకోబడకూడదని మోహన్‌లాల్ గౌతమ్‌గారు (సోషలిస్టు) మరొక సవరణను తెచ్చారు. నిర్దిష్టమైన కాయకష్టం చేస్తేగాని ఎన్నుకొనబడే అర్హత ఉండకూడదని వెన్నెలగంటి రాఘవయ్యగారు యింకొక సవరణ తెచ్చారు.

సత్యమూర్తి యీ సవరణ లన్నింటినీ వ్యతిరేకిస్తూ, 3 సంవత్సరాల నిబంధన కంటె ఎక్కువ కఠిన నిబంధనలువిధిస్తే, వోటర్ల స్వేచ్ఛకు ఆటంకం కలిగించడమే అవుతుంది కాబట్టి అసలు తీర్మానాన్ని ఆమోదించవలసిందిగా హెచ్చరించాడు. అల్పసంఖ్యాకులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తే, కాంగ్రెస్‌లో మత వైషమ్యాలను ఎక్కువ చేయడమే అవుతుందన్నాడు. డాక్టర్ అహమ్మద్ (సోషలిస్టు) సత్యమూర్తిని వ్యతిరేకిస్తూ, బాలకృష్ణశర్మ, అచ్యుత పట్వర్ధన్‌గారల సవరణలను బలపరిచాడు, కాంగ్రెసు సంస్థలో వ్యాపించిన కుళ్లుపోవాలంటే, జిల్లాబోర్డులు వగైరా స్థానిక సంస్థలలో అధికారం గలిగిన కాంగ్రెసు మెంబర్లమీద నిబంధనలు ఎక్కువ చేయవలసిందని కాంగ్రెస్ నాయకుల్ని అతడు కోరాడు.

కాంగ్రెస్ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులుగా ఉన్నవారు ఎదో ఒక నిర్దిష్టమైన రాజకీయ కార్యక్రమంలో పాల్గొంటూ ఉండాలని మందేశ్వరశర్మ, గారొక సవరణను ప్రతిపాదించారు.

ఆచార్య కృప్లానీ సవరణ లన్నింటినీ ఎదిరిస్తూ జవాబుచెప్పాడు. అధ్యక్షుడు వోట్లు తీసుకోగా, మోహన్‌లాల్ గౌతమ్ సవరణ తప్ప మిగిలినవన్నీ వీగిపోయాయి. బాలకృష్ణశర్మగారి సవరణకు అనుకూలంగా 61, వ్యతిరేకంగా 106 వోట్లు, వచ్చాయి. రాఘవయ్యగారు తన సవరణపై వోటు తీసుకోనవసరం లేదంటే, వోటుకు రాలేదు. మందేశ్వరశర్మగారి సవరణకూడా అధిక సంఖ్యాకులచే తోసివేయబడింది. మోహన్‌లాల్ గౌతమ్‌గారి సవరణకు అనుకూలంగా 98 వోట్లు, వ్యతిరేకంగా వోటుచేసినవారిలో సత్యమూర్తి ఒకడు.

కుల, మత సంస్థలు.

కృప్లానీ తరువాత జాతీయ ప్రతికూలమైన ధ్యేయ, కార్యక్రమం కలిగిన కుల, మత సంస్థలలో సభ్యులుగా ఉన్న కాంగ్రెసువాదు లెవరూ కాంగ్రెసు కమిటీలలో ఉండకూడదని తీర్మానం ప్రతిపాదించాడు. "మరి యే ఇతరసంస్థలలోను" అనే శబ్దాలుకూడా చేర్చవలసిందని కాన్‌స్టిట్యూషన్ సబ్‌కమిటీవారి సూచనను ప్రస్తుతం చేర్చటం లేదనీ, అతడు చెప్పాడు. కృప్లానీ తీర్మానానికి కె. ఎఫ్. నారిమన్ శాసనసభలలోగాని, కాంగ్రెసువాదు లెవరూ కాంగ్రెసు కమిటీలలో ఉండకూడదని సవరణ తెచ్చాడు. కాని అధ్యక్షుడు అనుమతి నీయలేదు. కుల మత సంస్థలనగా ముస్లిం లీగ్ హిందూ మహాసభ, అని నిర్వచించవలసినదిగా ముఖర్జీగారొక సవరణను, ఆర్యన్ లీగ్-అకాలీ సమితి-ముస్లింలీగ్-హిందూమహాసభ అని నిర్వచించాలని నూరుద్దీన్ బిహారీగారు మరొక సవరణను ప్రతిపాదించారు. ఆర్యన్ లీగ్ ప్రత్యేకమైన మత సంస్థ అన్నిం

కాబట్టి దాన్ని చేర్చరాదని గౌరీశంకర్ మిశ్రాగారు రెండో సవరణను ఎదిరించారు. అకలీ సమితిలో నేడు అనేక మంది కాంగ్రెస్‌వాదులు సభ్యులుగా ఉన్నారనీ, ఆ సమితి యింతవరకు కాంగ్రెసుకు వ్యతిరేకంగా నడిచియుండలేదు కాబట్టి ఆ సమితిని చేర్చరాదని సర్దార్ శార్దూలసింగుగారు సవరణను వ్యతిరేకిస్తూ మాట్లాడారు.

ఎం. ఎన్. ఆనీ (హిందూమహాసభ) గారు ఏ సంస్థయొక్క రాజకీయ కార్యక్రమం ఐనా కాంగ్రెసుకు వ్యతిరేకమైనదో కాదో చెప్పవలసిన విచక్షణ హక్కు అసలు తీర్మానంలో మాదిరిగా వర్కింగ్ కమిటీకే ఉండాలిగాని పేర్లుపెట్టి పిలువనవసరంలేదనీ, ఆవిధంగా పిలవడం రాజనీతి కాదనీ, కనుక కృప్లానీగారి అసలు సూచననే అంగీకరించవలసిందనీ కోరుతూ ఉపన్యసించారు. కృప్లానీగారు సవరణలకు జవాబిచ్చారు. రెండు సవరణలు వీగిపోయాయి.

ఎన్నికల ట్రిబ్యునల్.

ప్రతి రాష్ట్రీ కాంగ్రెసు వర్కింగు కమిటీ ¾ మెజారిటీ వోట్లతో ఒక ఎన్నికల ట్రిబ్యునల్‌ను నియమించాలనీ, అట్టి రాష్ట్రీ ట్రిబ్యునల్సు ప్రతిజిల్లాకు ఒక్కొక్కరినిగాని, ఒక్కరి కంటె ఎక్కువగాని, ఎన్నికాధికారులను నియమించవచ్చుననీ, వారే ఎన్నికల తగాదాలను పరిష్కరించే అధికారులనీ, కృప్లానీ 8 వ క్లాజులో చేర్చవలసినదిగా ప్రతిపాదించాడు. ఎం. ఎస్. ఆనీగారు వర్కింగు కమిటీగాక, రాష్ట్రీ కాంగ్రెసు కమిటీయొక్క అంగీకారంతో ట్రిబ్యునల్సును నియమించాలని సూచించారు. డాక్టర్ అహమ్మద్ (సోషలిస్టు) గారు సంవత్సరాని కొకసారి రాష్ట్రీ ట్రిబ్యునల్సును నియమించాలని సవరణను ప్రతిపాదించాడు. స్థానిక సంస్థలలోగాని, శాసనసభలలోగాని, సభ్యులుగా ఉన్నవారు ట్రిబ్యునల్సులో ఉండకూడదని ఆర్. కె. సిధ్వాగారు మరొక సవరణను ప్రతిపాదించారు. నారిమన్‌గారు, లాలా శ్యామ్ లాల్ గారు, ఎన్. జి. రంగాగారు ఆనీగారి సవరణను బలపరుస్తూ ఉపన్యసించారు. డాక్టర్ అహమ్మద్‌గారి ఒక సంవత్సరం నిబంధన తప్ప మిగిలిన సవరణలన్నీ వీగిపోయాయి.

డెలిగేట్ల సంఖ్య.

భూలాభాయి దేశాయి 11 వ క్లాజును సవరిస్తూ, ఒక లక్షమంది జనాభాకలిగిన ప్రతిజిల్లాలోను 500 మందికి తక్కువకాని కాంగ్రెసు మెంబర్లు ఉంటే అట్టి జిల్లాలకు ఒక డెలిగేటు చొప్పున ప్రాతినిధ్యం యివ్వాలి అనే ప్రతిపాదనను ప్రవేశపెట్టాడు. ఇంతవరకూ ఒకజిల్లాలో లక్షమంది కాంగ్రెసు సభ్యులుచేరి, మిగిలిన జిల్లాలన్నింటిలోను మరొక లక్షమంది చేరితే, ఆ రాష్ట్రానికి నియమించబడ్డ డెలిగేట్లసంఖ్యలో సగానికి సగం ఒక్క జిల్లానుండే పంపబడతారనీ, ఆ జిల్లాకే ప్రధానస్థానం లభిస్తుందనీ. యిప్పుడు సూచించబడుతున్న మార్పువల్ల ఈ అన్యాయం జరుగదనీ సభ్యులసంఖ్యనుబట్టి కాక జనాభాను బట్టి నిర్ణయిస్తే యిప్పుడు మనం చూస్తున్న పోటీలు ఒక హద్దులో పెట్టబడతాయనీ దేశాయిగారు స్పష్టీకరించారు.

చర్చ మరునాటికి వాయిదా వేయబడింది. సోమవారంనాడు (26-6-39) మధ్యాహ్నము 2 గంటలకు అ. భా. కాం. కమిటీ సమావేశమై, బులాభాయిగారి తీర్మానముపై చర్చ ప్రారంభమయింది డెలిగేట్లచే ఎన్నుకొనబడు ప్రతి అ. భా. కాం. కమిటీ సభ్యుడు 2 సంవత్సరాలవరకు తన సభ్యత్వాన్ని కలిగియుండాలని గౌరీశంకర్ భార్గవాగారు ఒక సవరణను ప్రతిపాదించారు. దేశాయిగారి ప్రతిపాదన త్రిపురీ కాంగ్రెస్ తీర్మానానికి విరుద్ధం కాబట్టి దానిని అంగీకరించకూడదని నారిమన్‌గారు పాయింట్ ఆఫ్ ఆర్డర్ తెచ్చారు. రాజేంద్రప్రసాద్‌గారు దాన్ని తోసివేశారు. బులాభాయి దేశాయిగారి సూచన నెగ్గింది.

అ. భా. కాం. కమిటీ ఎన్నికలలో యిప్పుడున్న ప్రపోర్షనల్ ప్రాతినిధ్య పద్ధతిని తొలగించి, మూడవ వంతు సభ్యుల్ని మాత్రమే ప్రపోర్షనల్ ప్రాతినిధ్య పద్ధతి ప్రకారము, మిగిలిన 2/3 వంతు టెరిటోరియల్ పద్ధతి ప్రకారం సింగిల్ డిస్ట్రిబ్యూటివ్ వోటింగ్ సూత్రాన్ని అనుసరించి ఎన్నుకోవాలని వర్కింగ్ కమిటీ సభ్యులు మొదట నిర్ణయానికి వచ్చారు. కాని, అతివాదులు దీన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తూన్నందున అ. భా. కాం. కమిటీలో ప్రస్తుతం యీ సవరణ తేకుండా నిలిపి యుంచారని తెలుస్తోంది.

రాష్ట్రీ కాంగ్రెస్ కమిటీ అనుమతిలేనిదే ఏ కాంగ్రెసువాది శాసనోల్లంఘనం చేయకూడదని అ. భా. కాం. వర్కింగ్ కమిటీవారు తీర్మానించారు. మునగాల వగైరా జమీందారీ ప్రాంతాలలో రైతుల్ని శాసనోల్లంఘనం చేయవలసినదిగా కొందరు కాంగ్రెసువాదులు ప్రోత్సహించుతూన్నందున కాంగ్రెసుమంత్రులు తాము తలపెట్టిన రైతాంగ శాసనాలకు ప్రతిబంధకం ఏర్పడుతూందని రాజాజీ మొదలైన కాంగ్రెసు మంత్రులు పట్టుపట్టడంవల్ల యీ తీర్మానము చేయవలసి వచ్చినదట.

144 వ సెక్షన్‌ను జారీచేస్తూన్నందుకు మద్రాసు ప్రభుత్వపు చర్యను ఖండిస్తూ కొందరు కాంగ్రెసు సభ్యులు పంపిన ఆక్షేపణలను కూడా వర్కింగ్ కమిటీ చర్చించింది. తన హయాములో ఎన్నిసార్లు 144 జారీ చేయబడినదీ, అందుకు కారణాలతోసహా, రాజాజీ సంజాయిషీ చెప్పాడు. ఆ సంజాయిషీ వర్కింగ్ కమిటీ సభ్యులకు సంతృప్తిని కలిగించడంవల్ల ఎట్టిచర్య అవసరంలేదని తీర్మానించుకున్నారు.

కాంగ్రెసు సభ్యులను చేర్చుట.

అ. భా. కాం. వర్కింగ్ కమిటీ రాబోయే కాంగ్రెసు మహాసభకు ఈక్రింది కార్యక్రమాన్ని నిర్ణయించింది :

కాంగ్రెస్ సభ్యుల్ని చేర్చుటకు ఆఖరు. తేదీ సెప్టెంబరు 15.

కాంగ్రెస్ డెలిగేట్ల ఎన్నిక నవంబరు 8.

అధ్యక్షుని ఎన్నికకు నామినేషన్లు నవంబరు 15 వరకు.

అధ్యక్షుని ఎన్నుకొనుటకు, అ భా. కాం. కమిటీ సభ్యుల్ని ఎన్నుకొనుటకు నవంబరు 29.

అధ్యక్షుని ఎన్నిక ఫలితం ప్రకటించుట డిసెంబరు 3

నోటీసులు

ఆంధ్రరాష్ట్ర కాం॥ సో॥ పార్టీ కార్యనిర్వాహకవర్గ సమావేశము 4-7-39 తేదీ మంగళవారం ఉదయం 7 గంటలకు బెజవాడలో పార్టీ ఆఫీసునందు జరుగును.

విషయములు.

1. ఏ. ఐ. సి. సి. తీర్మానాలు; మన భవిష్యత్ కర్తవ్యము.
2. మునగాల తదితర రైతు పోరాటాలు.
3. పార్టీ నిర్మాణము రాష్ట్రీ కార్యనిర్వాహకవర్గమునుండి 5 గురికి మించని సెక్రటేరియటును ఎన్నుకొనుట.
4. నవశక్తి ఆర్థిక స్థితి.

పి. సుందరయ్య.
కార్యదర్శి.

* * *

నెల్లూరు జిల్లా కాం॥ సో॥ పార్టీ కార్యనిర్వాహక వర్గ సమావేశము.

నెల్లూరు జిల్లా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యనిర్వాహక వర్గ సమావేశం 9-7-39 మధ్యాహ్నం 11 గంటలకు పార్టీ ఆఫీసులో జరుగును.

కార్యక్రమం

1. వెంకటగిరి ఎస్టేటు పరిస్థితులగురించి అచ్చట చేయవలసిన పనిని గూర్చి చర్చించుట.
2. కార్యనిర్వాహక వర్గంవారు యిచ్చిన పనిని చేయనటువంటి ఆక్టివు సభ్యుల విషయమై ఏమిచేయవలయునని నిర్ణయించుకొనుట.
3. ఫిబ్రవరినుండి జమా ఖర్చులు.
4. భవిష్యత్ కార్యక్రమము
5. కార్యదర్శి తెచ్చు యితర విషయములు

షరా:—యిదివరకు యిచ్చిన పనిని చేయనటువంటి ఆక్టివు సభ్యుల విషయమై ఏమి చేయవలయునను విషయం ఆలోచించుతాము గనుక (ప్రతి) ఆక్టివు సభ్యుడు ఈ సమావేశమునకు తప్పక రాగోరుతాను.

జిల్లాకాంగ్రెస్ జనరల్‌బాడీ మీటింగు 9 వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జరుగును గాన జిల్లా కాంగ్రెసులోని సోషలిస్టుపార్టీ మెంబర్లు 9 వ తేదీ 11 గంటలకే వచ్చి కార్యనిర్వాహక కమిటీ సమావేశములో పాల్గొనగోరుచున్నాను

కార్యదర్శి

* * *

బాపట్ల తాలూకా కాం, సో, పార్టీ సమావేశము

30-6-39 వ తేదీన బాపట్ల తాలూకా కాం. సో. పార్టీ అత్యవసర సమావేశము పెదనందిపాడులో జరుగునుగాన తాలూకాపార్టీ మెంబర్లు దీనినే నోటీసుగా భావించి తప్పక రావలయునని కోరుచున్నాను.

చర్చనీయాంశములు

1. జిల్లా సో. పార్టీ ఆఫీసునుండి వచ్చిన సర్క్యులరులలో
   (a) జిల్లా కాం. కమిటీ యెన్నికల రిపోర్టు
   (b) జిల్లా కాం. సో. పార్టీ ఏప్రిల్ మే నెలల రిపోర్టు
   (c) తాలూకా కాం. సో. పార్టీ నెరవేర్పవలసిన కార్యక్రమమును గురించి
2. జాతీయ వాంఛాదళముకు తాలూకాలో సహాయము చేయుటను గురించి

కాకుమాను } ఐ. యస్. రంగనాయకులు,
25-6-39 } సెక్రటరీ
బాపట్ల తాలూకా కాం, సో, పార్టీ

ఆంధ్రదేశమంతటా అఖండ స్వాగతము!

ఎస్. ఎస్. ఆర్. ఫిలిమ్సువారి

★ జయప్రద ★

ప్రస్తుతం యీ క్రింది నగరాల్లో ప్రదర్శింపబడుచున్నది :

తెనాలి — శ్రీ వెంకటేశ్వర టాకీస్
గుంటూరు — శ్రీ కృష్ణా టాకీస్
రాజమండ్రి — శ్రీ గజలక్ష్మి టాకీస్
కాకినాడ — శ్రీ కృష్ణా టాకీస్
కడప — శ్రీ సత్యనారాయణ టాకీస్
26—6—39 తేదీ
నెల్లూరు — వినాయక సినిమా



29-6-39 బెజవాడ - శ్రీ దుర్గా కళామందిరము

Apply:— **S. S. R. FILMS LTD.,** NO. 6. HARRINGTON ROAD, CHETPUT, MADRAS.

(గవర్నమెంటు సెక్యూరిటీలు గలవు)

స్థాపితము—1929 సులభ పద్ధతులు!!

ఆంధ్ర ప్రావిడెంటు కంపెని లిమిటెడ్

హెడ్డాఫీసు :—బెజవాడ.

మేనేజింగు డైరెక్టరు :

మ. రా. శ్రీ. దిట్టకవి వీరరాఘవయ్య పంతులు గారు.

జనన-వివాహపు, జీవిత భీమాలు, బ్యాంకువ్యాపారములు కలవు.

ప్రీమియం నెల 1కి 1-0-0, 2-0-0, 5-0-0 లుమాత్రమే. క్లెయిములు రు 500 లు లగాయతు రు 1000-0-0 ల వరకు గ్యారంటీ చేయబడినవి.

వివాహపు భీమాలో వివాహముకాని స్త్రీ పురుషులెల్లరు పట్టాదారులు కావచ్చును.

జననభీమా శిశుపోషణకు గొప్ప సహాయకారి.లాభదాయకమైన 'డిబెంచర్లు' కలవు.

ఏజంట్లకు ధారాళమైన కమీషను యివ్వబడును.

పూర్తివివరములకు:— మేనేజరు,
ఆంధ్రప్రావిడెంటు కంపెనీ. లిమిటెడ్,
గాంధీనగరం, బెజవాడ.

ముఖ్యగమనింపు

మా అనుభూత మందులను, యితరములను ఆయా జిల్లాలలో మా యేజంట్లకు సప్లయి చేయుటకును, క్రొత్త యేజంట్లను యేర్పాటు చేయుట, ప్రకటనాదులను సరిగ చేయుట మొదలగు వానికిని, సమర్థులగు వారు కావలసి యున్నారు. అర్హతనుబట్టి జీతము వగయిరాలు యివ్వబడును. వారికి గల అనుభవముతో కూడ మాకు వెంటనే వ్రాసికొన వలయును.

ఇట్లు,

డాక్టర్. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి,
బెజవాడ.

అన్నినొప్పులకు దివ్యామృతం

అమృతాంజనం

Published by M. Chandrasekhara Rao } at Navasakti Press, Governorpet, Bezwada.
Printed by Tummala Venkata Ramiah

END OF ISSUE